అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 5-1 -2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 8 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

స్కూల్ డ్రెస్సులపై..

జీఎస్టీభారం..

- వస్త్రాల కోసం నవంబర్‌లోనే టెస్కోకు ఆర్డర్
- కుట్టు కూలిపైనా ప్రభావం!

విద్యాశాఖకు అదనంగా రూ.7కోట్ల వ్యయం

కార్పొరేట్ అధిపతులకు వేల కోట్ల రూపాయల రాయితీలనిస్తున్న సర్కారుకు..పేద విద్యార్థుల యూనిఫారాలపై మాత్రం కనికరం లేకుండా పోయింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని బడి పిల్లలు వేసుకునే యూనిఫారాలపై కూడా మోపటం ద్వారా కేంద్ర ప్రభుత్వం అణగారిన వర్గాల పట్ల తన విధానాన్ని చెప్పకనే చెప్పింది. ఫలితంగా తెలంగాణ సర్కారుపై ఈ ఏటా అదనంగా రూ.7కోట్ల భారం పడనుంది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనున్నప్పటికీ..సర్కారు బడుల్లో చదివే పిల్లలంటే కేంద్ర ప్రభుత్వానికి ఇంత అలుసా..అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి యూనిఫారాల కుట్టుకూలి పెంచకపోతే ఆ భారం తల్లిదండ్రులపై పడే అవకాశముంది.



(ఫైల్)



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, సొసైటీ గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో 1 నుంచి 8వ తరగతి వరకూ సుమారు 22లక్షల మంది విద్యార్థులున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్స్ అందిస్తున్నది. 2017-18 విద్యాసంవత్సరంలో సుమారు 22లక్షల మందికి పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫారాలను అందించింది 2018-19 విద్యాసం వత్సరంలోనూ ఏప్రిల్ నాటికే బడుల్లోకి వస్త్రాన్ని సరఫరా చేయించేలా ప్రస్తుతం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. దీనిలో భాగంగా గతేడాది నవంబర్‌లోనే తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో)తో ఒప్పందం కుదుర్చుకుంది. సుమారు కోటి మీటర్ల వస్త్రాన్ని సకాలంలో అందించేందుకు టెస్కో ఇప్పటి నుంచి పనులు మొదలుపెట్టింది. ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థుల నుంచి కొలతలు తీసుకుని, బడులు ప్రారంభం నాటికి యూనిఫారాలను అందించాలనే లక్ష్యంతో ఉన్నట్టు ...9లో

దళితుడితో బూట్లు నాకించారు

గుజరాత్‌లో ఖాకీల దుర్మార్గం


బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న ఘోరాలు అన్నీ ఇన్నీకావు. బీహార్‌లో సర్పంచ్ ఇంటికి తలుపుతట్టకుండా లోనికి వెళ్లాడనే కోపంతో ఓ వృద్ధుడికి శిక్షగా చెప్పులు నాకించారు. గుజరాత్‌లోని ఉనాలో దళితుల ఘటన మరవకముందే.. తాజాగా ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలో మరో దళితుడికి ఘోర అవమానం జరిగింది. ఇద్దరి మధ్య గొడవ జరుగుతుంటే.. మధ్యలో ఆపటానికి వెళ్లాడు. అతను దళితుడని తెలియగానే ఖాకీల కోపం నషాళానికెక్కింది. అంతే ఇదే అవకాశంగా తీసుకుని ఆ దళితుడికి శిక్షగా ఏకంగా 15 మంది పోలీసుల కాళ్లు మొక్కించుకోవటమే కాదు. వారి బూట్లు నాకించారు. ఈ దారుణంతో వెలుగులోకి రాగానే ప్రజాసంఘాలు, దళితసంఘాల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది.



అహ్మదాబాద్ : గుజరాత్‌లో ఓ దళితుడిపై ఖాకీల అమానవీయ చర్య వెలుగులోకి వచ్చింది. పోలీస్ స్టేషన్‌లో దాదాపు 15 మంది పోలీసులు తనతో కాళ్లు మొక్కించి, వారి బూట్లు నాకించినట్టు హర్షద్ యాదవ్ (38) ఆరోపించారు. తన నివాస ప్రాంతంలో పోలీసు కానిస్టేబుల్ వినోద్‌భాయ్‌కు ఓ వ్యక్తికి మధ్య గొడవ జరుగుతుండగా హర్షద్ యాదవ్ కల్పించుకున్నాడు. వివాదం తగదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. ఆగ్రహానికి గురైన కానిస్టేబుల్ లాఠీతో హర్షద్‌ను కొట్టాడు. ఈ దాడిలో ఓ వేలుకూడా విరిగింది. కానిస్టేబుల్ కొట్టడమే కాకుండా.. హర్షద్ బంధువులనూ తిట్టాడు. ఉన్నతాధికారులకు విషయం చెప్పాడు. హర్షద్ ...9లో

ట్రిపుల్ తలాక్ రద్దు బిల్లు పై వీడని సస్పెన్స్

- బడ్జెట్ సమావేశాల్లో తేలనున్నదా..?
- సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు కేంద్రం తిరస్కరణ
- ఇరుపక్షాల వాదోపవాదాల మధ్య రాజ్యసభ నేటికి వాయిదా



న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్ రద్దు(ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ)బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించబోదని అధికార వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారంతో పార్లమెంట్ సమావేశాలు ముగియనుండటంతో ఈ బిల్లుపై చర్చ బడ్జెట్ సమావేశాల వరకూ వాయిదా పడనున్నట్టు తెలుస్తోంది. ఈలోగా ప్రతిపక్షాల నుంచి కొందరిని బిల్లుకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ నేతలు సంప్రదింపులు జరపనున్నట్టు సమాచారం. ఓవేళ సెలెక్ట్ కమిటీకి పంపడానికి కేంద్రం అంగీకరించినా దీనిపై ఓటింగ్ బడ్జెట్ సమావేశాల దాకా వాయిదా పడక తప్పని పరిస్థితి. గురువారం రాజ్యసభలో మరోసారి ప్రతిపక్షాలు ఈ బిల్లును పార్లమెంట్ కమిటీకి పంపాలని పట్టుపట్టాయి. సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతూ కాంగ్రెస్ సభ్యుడు ...9లో

వాట్సాప్‌లో 7,500 కోట్ల సందేశాలు

- భారత్‌లోనే 2,000 కోట్లు..
- నూతన సంవత్సరం సందర్భంగా 2

ఐసీయూలో ఎన్డీయే..

- 2019తో మోడీ సర్కారు అంతం : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్ 2

సినిమా టికెట్ ధరలు పెంపునకు అనుమతి

- హైకోర్టు మధ్యంతర ఆదేశాలు



హైదరాబాద్ : సినిమా టిక్కెట్ ధరల పెంచేందుకు థియేటర్ యజమానులకు హైకోర్టు అనుమతి ఇస్తూ మధ్యంత ఆదేశాలు జారీ చేసింది. టిక్కెట్ల రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకునేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకునేలోగా థియేటర్ యాజమాన్యాలు రేట్లు పెంచుకోవచ్చునని గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ స్పష్టం చేశారు. అయితే పెంచి రేట్లకు అనుగుణంగా పన్నుల చెల్లింపు కూడా ఉండాలన్నారు. హైకోర్టు షరతుల్ని థియేటర్ యాజమాన్యాలు ...9లో

ఇసుక మాఫియా చేతిలో వీఆర్ఏ హత్య ?

- ట్రాక్టర్‌తో తొక్కించి ఘాతుకానికి పాల్పడిన వైనం
- ప్రమాదవశాత్తు అంటూ కేసు నమోదు
- ఇసుక మాఫియానే చంపింది : వీఆర్ఏల సంఘం
- గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ- నిజామాబాద్ ప్రతినిధి/బాన్సువాడ

ఇసుక మాఫియా బరితెగిస్తోంది. ఇసుక దందా మూడు లారీలు..ఆరు ట్రాక్టర్లుగా సాగిపోతోంది. ఎవరైనా అడ్డొస్తే..మాఫియాతో పోలీసులు మిలాఖత్ అయి కేసుల్ని పక్కదారిపట్టిస్తున్న ఘటనలు ఎక్కువవుతున్నాయి. నేరేళ్లలో ఇసుక లారీలతో ప్రమాదాలు జరుగుతుంటే..అక్కడి దళితులు తిరగబడి లారీలను దహనం చేస్తే పోలీసులు కుళ్లబొడిచారు. ఆ కేసులు ఇంతవరకూ తేలలేదు. ఇది సామాన్యజనానికి ఇసుక మాఫియా వేసిన శిక్ష. తాజాగా ఇసుక తరలింపును అడ్డుకున్నందుకు వీఆర్ఏను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి ప్రాణాం తీస్తే.. పోలీసులు మాత్రం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొని ...9లో

కొత్త కొత్తగా పది నోటు

త్వరలోనే చెలామణిలోకి..!



న్యూఢిల్లీ: పది రూపాయల నోటు సరికొత్త రూపంలో ముందుకు రాబోతున్నది. చాక్లెట్ బ్రౌన్ కలర్‌లో ఉన్న ఈ నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) త్వరలోనే చెలామణిలోకి తేనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కొత్త పది రూపాయల నోటు నమూనాకు కేంద్రం.. వారం రోజుల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహాత్మాగాంధీ సిరీస్‌లో వస్తున్న ఈ నోట్లను ఇప్పటికే దాదాపు 100 కోట్లు ప్రింట్ చేసినట్టు తెలుస్తున్నది. పది రూపాయల నోటు డిజైన్‌ను చివరిసారిగా 2005లో మార్చారు. గతేడాది ఆగస్టులో మహాత్మాగాంధీ సిరీస్‌లో కొత్తగా రూ.200, డిజైన్‌ను మార్పు చేసి రూ.50 నోట్లను ఆర్బీఐ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

వ్యక్తిగత గోప్యతకు చెల్లు చీటీ..?

- రూ.500 చెల్లిస్తే ఎవరి వివరాలైనా తెలుసుకునే అవకాశం..? 2
- ఆధార్ డేటా లీకేజీపై 'ది ట్రిబ్యూన్' పరిశోధనాత్మక కథనం



కొత్తగా ఫీజులు పెంచొద్దు

- సెంట్రల్ సిలబస్ బడుల్లో ఫీజులపై సర్కారు స్టేటస్‌కో

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

"ఫీజులు తేలకముందే అడ్మిషన్లు" శీర్షికతో నవతెలంగాణలో ఈనెల 2న ప్రచురితమైన కథనానికి తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. 2018-19 విద్యాసంవత్సరానికి గానూ ఫీజులు పెంచవద్దని సెంట్రల్ సిలబస్ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదికపై పరిశీలించాల్సి ఉందనీ, ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ 2017-18 సంవత్సరం ఫీజులనే కొనసాగించాలని ఆదేశించారు. డీఈఓలు, ఆర్‌జేడీలు అన్ని పాఠశాలలకు సమాచారమివ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 2 నుంచే సీబీఎస్ఈ, కెంబ్రిడ్జి, ఐసీఎస్ఈ, ఐబీ తదితర సెంట్రల్ సిలబస్ పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్ల షెడ్యూల్ తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలల ...9లో





ఎయ్.. దూరంగ నడవ్..!!

అన్నదాతకు ప్రయోజనం అంతంతే..

- భూగర్భజలాలు తగ్గుతుండటమే కారణం
- గ్రిడ్ నిర్వహణలో హెచ్చుతగ్గులు

వ్యవసాయానికి తగ్గుతున్న విద్యుత్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అనుకున్నదే జరిగింది. కరెంటు ఉంటే అన్నీ పరిష్కారమైనట్టే అనే ప్రభుత్వ ప్రచారం బెడిసికొడుతోంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా వల్ల రైతాంగానికి పరిమిత ప్రయోజనమే కలుగుతోంది. భూగర్భజలాలు అడుగంటు తుండటంతో కరెంటు ఉన్నా రైతాంగం వినియోగించు కోలేకపోతోంది. కొత్తగా ఎలాంటి భూమి సాగులోకి రాలేదు. నీళ్లు లేక బోర్లు నోర్లు తెరుస్తుంటే కరెంటును ఎలా వాడుకోవాలనే ప్రశ్న ఇప్పుడు రైతాంగం నుంచి వినిపిస్తోంది. రైతులు తమకు పగటిపూట రోజుకు 9 గంటల విద్యుత్‌ను రెండు విడతల్లో సరఫరా చేస్తే చాలని మొత్తుకున్నా రాష్ట్రప్రభుత్వం వినిపించుకోలేదు. 24గంటలు సరఫరా చేస్తున్నట్టు ప్రకటించింది. కేవలం మూడు రోజుల్లోనే వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గుతుండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. గడచిన మూడు రోజుల విద్యుత్‌శాఖ గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతోంది. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ వినియోగం పెరిగింది...కానీ 24గంటల సరఫరా ప్రకటించాక...ప్రయోగాత్మక సరఫరా రోజులతో పోల్చితే ఇప్పుడు క్రమేణా విద్యుత్ వినియోగం తగ్గుతోంది. భూగర్భజలాలపై ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే ఫిబ్రవరి, మార్చి మాసాల్లో రైతులు నీళ్లు లేక మరిన్ని కష్టాలు పడే ప్రమాదం పొంచిఉంది. సాధారణంగా శీతాకాలంలో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. కానీ ఈనెల 1వ తేదీ నుంచి వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడంతో సహజంగానే విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ప్రారంభ తేదీకంటే ముందునుంచే ప్రయోగాత్మకంగా డిస్కంలు వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను సరఫరా చేశాయి. దానితో పోల్చితే ప్రస్తుత వినియోగం తక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా మంచు ప్రభావం కూడా అధికంగా ఉండటంతో రైతులు నీటిని అవసరాన్ని బట్టే పొలాలకు పెడుతున్నారని, దీనివల్లే ప్రయోగాత్మక రోజుల కంటే ఇప్పుడు విద్యుత్ వినియోగం తగ్గినట్టు అధికారులు చెప్తున్నారు. గడచిన ఏడాదితో పోల్చితే ఈనెల తొలి మూడు రోజుల్లో సరాసరిన దాదాపు 25 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యల కారణంగా 24గంటల విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం కలిగినట్టు టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. తమ సిబ్బంది తక్షణం మరమ్మతు పనులు చేపట్టి సరఫరాను ...9లో



(ఫైల్)

నవ తెలంగాణపై స్పందన ఫోన్ : 9490099016

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటి కప్పుడే మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99016 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ **మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల** మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా వుండేలా చూసుకోండి. **ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.** ఉత్తరాల ద్వారా మీ అభిప్రాయాలు పంపదలిస్తే చిరునామా: **స్పందన, నవ తెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, 1-8-664, అజామాబాద్, హైదరాబాద్ - 500020.** లేదా **spandana@navatelangana.com**కు మెయిల్ చేయొచ్చు.

మాల్యా 'ప్రకటిత నేరస్థుడు'

న్యూఢిల్లీ: లిక్కర్ డాన్ విజయ్‌మాల్యాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను ప్రకటిత నేరస్థుడిగా పేర్కొంటూ ఢిల్లీలోని పాటియాలా కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఫారెన్ ఎక్స్ఛేంజ్ రెగ్యులేషన్ యాక్ట్(ఫెరా) కేసులో ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినా మాల్యా స్పందించకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్టు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ వెల్లడించారు. ఫెరా నిబంధనలను ఉల్లంఘించిన వ్యవహారంలో మాల్యాపై 2016 నవంబర్ 4న నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. అంతేకాక.. గతేడాది ఏప్రిల్ 12న ఓపెన్ ఎండెడ్ నాన్ బెయిలబుల్ వారెంట్ సైతం జారీ అయ్యింది. చివరగా.. 30 రోజుల్లోగా మాల్యా న్యాయస్థానం ఎదుట హాజరు కావాలని, లేదంటే ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామని గతేడాది నవంబర్ 8న కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 30 రోజుల గడువు ముగిసినా మాల్యా.. కోర్టు ఎదుట హాజరు కాలేదు. పలు బ్యాంకుల వద్ద తీసుకున్న వేల కోట్ల రుణాలను తిరిగి చెల్లించకుండా మాల్యా.. విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే.

ముంబయిలో మరో అగ్ని ప్రమాదం



ముంబయి : వాణిజ్య రాజధాని ముంబయిలో మరో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున ముంబయి శివారు ప్రాంతం మరోల్ చర్చి రోడ్డు ఏరియా మైమూన్ అపార్ట్‌మెంటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చోటు చేసుకున్న ఈ ఘటనలో నలుగురు మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు సహా నలుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు. అలాగే మొత్తం తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. డిసెంబర్ 29న లోవర్ పరేల్ ప్రాంతంలో కమలా మిల్స్ కాంపౌండ్‌లోని పబ్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

వారు నాకేమీ హాని చేయలేదు: కులభూషణ్

న్యూఢిల్లీ: తనను నిర్బంధించిన జైలులో పాకిస్తాన్ అధికారులు తనకు ఎటువంటి హానీ చేయలేదని ప్రస్తుతం అక్కడ జైలులో వున్న భారత మాజీ నౌకాదళాధికారి కులభూషణ్‌జాదవ్ చెప్పారు. గత నెల 25న తనను కలిసిన తల్లి, భార్యను పాకిస్తాన్ అవమానించిందంటూ భారత్ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ విడుదల చేసిన వీడియో ప్రకటనలో కులభూషణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. వారు తనను జాగ్రత్తగానే చూసుకుంటున్నారని, తనకు ఎటువంటి హానీ చేయలేదని, కనీసం తాకను కూడా తాకలేదని ఆయన స్కైప్ ద్వారా ప్రసారమైన ఈ వీడియో ప్రకటనలో వివరించారు. జైలులో వున్న జాదవ్‌ను పాక్ సైన్యం చిత్రహింసలకు గురి చేసిందని, ఆయన శరీరంపై చిత్రహింసలకు సంబంధించిన గుర్తులను తాము ఫొటోలలో చూశామని భారత్ ఆరోపించిన విషయం తెలిసిందే.

ఉన్నత విద్యాసంస్థల్లో..

లక్షా 30 వేలమంది నకిలీ అధ్యాపకులు..!

ఆధార్ లింక్‌తో తేలిన లెక్క..

న్యూఢిల్లీ: ఆధార్‌ను లింక్ చేయడం వల్ల దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకుల్లో 10 శాతం నకిలీలని తేలింది. కళశాలలు, విశ్వవిద్యాయాల్లో మొత్తం 14 లక్షలమంది అధ్యాపకులు పని చేస్తుండగా, వారిలో 1,30,000మంది బోగస్ అని వెల్లడైంది. విద్యా సంస్థల్లో అర్హతలేని అధ్యాపకులతో పాఠాలు చెప్పిస్తున్నారంటూ పలు ఫిర్యాదులు మానవ వనరుల అభివృద్ధి(హెచ్‌ఆర్‌డీ)శాఖకు అందాయి. దాంతో,(2017లో) ఆధార్‌ను అనుసంధానం చేయాలని హెచ్‌ఆర్‌డీ ఆదేశించింది. మరోవైపు అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి 1:10 ఉండాలనేది లక్ష్యం. దీనిపై 2015-16లో లెక్కించగా 1:21గా తేలింది. అంటే..ఉండాల్సిన దానికన్నా అధ్యాపకుల సంఖ్య తక్కువని తేలగా, వారిలోనూ 10 శాతం బోగస్ అని స్పష్టం కావడంతో అర్హత గల అధ్యాపకుల సంఖ్య మరింత తక్కువని అర్థం చేసుకోవాలి. నకిలీ అధ్యాపకుల సంఖ్య సర్వ సాధారణమైందని కేరళకు చెందిన హోలీగ్రేస్ అకాడమీ ఛైర్మన్ రాజూడేవిస్ అన్నారు. అర్హత ఉన్న అధ్యాపకుల జాబితాను ఆయా విద్యాసంస్థలు తమ వెబ్‌సైట్లలో చూపుతారు. కానీ, వాస్తవంగా పాఠాలు చెప్పించేది మాత్రం తగిన అర్హతలులేని ఒప్పంద అధ్యాపకులతో అని ఆయన తేల్చేశారు. హోలీగ్రేస్ ఆధ్వర్యంలో గొలుసుకట్టు వృత్తి విద్యా సంస్థల్ని నిర్వహిస్తున్నారు.

భారత సైన్యం దాడుల్లో

12 మంది పాక్ రేంజర్లు హతం

శ్రీనగర్: సరిహద్దులో అదే పనిగా కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి జవాబు ఇచ్చింది. పాక్ సైనిక పోస్టులే లక్ష్యంగా భారత జవాన్లు జరిపిన దాడుల్లో 12 మంది పాక్ రేంజర్లు హతమైనట్టు సమాచారం. పాక్ సైన్యం కాల్పులు జరిపి బీఎస్ఎఫ్ జవాన్‌ను పొట్టన బెట్టుకున్నందుకు ప్రతీకారంగా భారత్ బుధవారం రాత్రి దాడులు చేసింది. సరిహద్దు ప్రాంతంలో మోర్టార్ పొజిషన్లు, ఔట్ పోస్టులు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. భారత సైన్యం దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన రెండు మోర్టార్ పొజిషన్లు, నాలుగు ఔట్ పోస్టులు ధ్వంసమైనట్టు ఐజీ రామ్ అవతార్ వెల్లడించారు. అంతేకాక దాదాపు 12 మంది పాక్ రేంజర్లు హతమై ఉంటారని ఆయన చెప్పారు. భారత సైన్యం దాడి విషయమై పాకిస్థాన్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. జమ్మూకాశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో బుధవారం పాక్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఆర్‌పి హజ్రా తన పుట్టిన రోజే ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరోవైపు గురువారం తెల్లవారుజామున ఆర్నియా సెక్టార్‌లోని నియంత్రణ రేఖ గుండా దేశంలోకి చొరబడేందుకు యత్నించిన ఓ ఉగ్రవాదిని బీఎస్ఎఫ్ జవాన్లు మట్టుబెట్టారు.


థియేటర్లలో కుంభమేళా లోగో ప్రదర్శన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అన్ని సినిమా థియేటర్లలో కుంభమేళా లోగోను ప్రదర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇదివరకే జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే అతి త్వరలోనే అన్ని థియేటర్లలో కుంభమేళా లోగోను విధిగా ప్రదర్శించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కుంభమేళా పండుగ ప్రాముఖ్యతను ప్రజలు ముఖ్యంగా యువత తెలుసుకోవాలన్న యోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతున్నది. చలనచిత్ర ప్రారంభానికి ముందు(జాతీయ గీతం ఆలపించిన తర్వాత) ఈ లోగోను ప్రదర్శించాలని థియేటర్ల యజమానులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ లోగోను యోగి ఆదిత్యనాథ్ సర్కారు. గత నెలలోనే విడుదల చేసింది. లోగోపై 'సర్వసిద్ధిప్రధ్ కుంభ్' అని రాసి ఉన్నది. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని మెటీరియల్స్(హోర్డింగులు, ప్రకటనలు....)పై కుంభమేళా లోగో ఉండాల్సిందేనని గతనెలలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 'కుంభమేళా' అంతర్జాతీయ వారసత్వ చిహ్నంగా గుర్తింపు పొందింది. యూపీలోని అలహాబాద్‌లో వచ్చే యేడాది జనవరిలో కుంభమేళా జరగనున్నది. ఈ ఉత్సవానికి 12 కోట్ల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. కుంభమేళా కోసం రూ.2,500 కోట్లను ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. చివరిసారి ఈ ఉత్సవాలు 2013లో జరగగా 10 కోట్ల మంది ప్రజలు దీనిలో పాల్గొన్నారు.

'అంబేద్కర్ సమానత్వ సూత్రానికి సంఘ్ వ్యతిరేకం'




న్యూఢిల్లీ : కేంద్రంలో బీజేపీ పాలనలో భారతీయులలో దళితులకు స్థానం లేకుండా చేస్తున్నారని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మహారాష్ట్రలో జరుగుతున్న అల్లర్లపై కేంద్రం స్పందించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. పాలక బీజేపీ చెబుతున్న నిర్వచనంలో భారతీయుల నుండి దళితులను మినహాయిస్తున్నారని ఆయన విమర్శించారు. దళితులను భారతదేశంలో భాగంగా చూస్తున్నారా లేదా అని ఆయన ప్రశ్నించారు. భారతీయుల నుండి దళితులను మినహాయిస్తున్నారని, మహారాష్ట్రలో జరుగుతున్న ఘటనలపై వారి మౌనం దీనిని స్పష్టం చేస్తున్నదని ఆయన చెప్పారు. రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన అంబేద్కర్ సమానత్వం అనే ఆలోచనను సంఘ్ సిద్ధాంతం వ్యతిరేకించిందని తన ట్వీట్లలో ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాతలలో ఒకరైన అంబేద్కర్ చెప్పిన సమానత్వ సూత్రానికి సంఘ్ సిద్ధాంతం వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి ఒకఓటు ఉంటుందని, ప్రతి ఓటుకూ ఒకే విలువ ఉంటుందని అంబేద్కర్ చెప్పాడు. ఆర్థిక, సామాజికంగా మనుషులందరికీ ఒకే విలువ లేకుండా అసమానతలు కొనసాగుతున్నంత కాలం పోరాటం కొనసాగుతుందని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. సమాజంలో చారిత్రకంగా అణచబడ్డ తరగతులు గొంతెత్తినపుడు వారిని నిందించటం అణచివేతతో కూడిన పాత సామాజిక వ్యవస్థపై ఆర్‌యస్‌యస్, బీజేపీల మౌలిక విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నదని అన్నారు. భీమా కొరేగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలో జరుగుతున్న ఘర్షణలపై స్పందిస్తూ ఏచూరి ఈ విషయాలను ట్వీట్ చేశారు.



ఐసీయూలో ఎన్డీయే..

అన్ని రంగాల్లోనూ విఫలం

- 2019తో మోడీ సర్కారు అంతం: రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

యూపీఏ సర్కారు 'విధానపరమైన పక్షవాతం'తో కొట్టుమిట్టాడితే.... ఎన్డీయే సర్కారు ఏకంగా ఐసీయూలో ఉన్నదని సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్ అన్నారు. 'ఐసీయూ నుంచి కోలుకునేలోగా 2019 ఎన్నికల్లో ఈ ప్రభుత్వం అంతమవుతుంది' అని చెప్పారు. ఎన్డీయే పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, వ్యవసాయ సంక్షోభం మరింత దిగజారిందని, నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. ప్రతి యేడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ సర్కారు.... గడిచిన మూడున్నరేండ్లలో కనీసం 50 లక్షల ఉద్యోగాలు సైతం సృష్టించలేకపోయిందని విమర్శించారు.

రాజ్యసభలో గురువారం దేశ ఆర్థిక వ్యవస్థపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో సీపీఐ(ఎం) నుంచి రంగరాజన్ పాల్గొన్నారు. 'యూపీఏ ప్రభుత్వం విధానపరమైనపక్షవాతంతో సతమతమైందన్న అధికార ఎంపీ వ్యాఖ్యలను సమర్థిస్తాను. యూపీఏ అవలంభించిన నయాసరళీకరణ ఆర్థిక విధానాలను పార్టీగా మేమూ వ్యతిరేకించాం. కానీ ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఐసీయూలో ఉంది. ఈ ఐసీయూ నుంచి వచ్చేలోగా 2019లో ప్రభుత్వం పడిపోతుంది' అని స్పష్టం చేశారు. ఎన్డీయే హయాంలో ఆర్థికవ్యవస్థ దిగజారిందని అన్నారు. 'వ్యాపార సులభతరం ర్యాంకింగ్‌లో భారత్ మెరుగైంది. కానీ ఎవరికోసం? ప్రపంచ ఆకలి సూచీలో భారత్ ర్యాంకు దిగజారింది' అని చెప్పారు. వ్యాపారం సులభతరం పేరిట ఉద్యోగాలు కల్పించకుండా దేశంలో ఆకలి కేకలు పెంచుతున్నారని విమర్శించారు. 'గత బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి చాలా నిధులు కేటాయించామని జైట్లీ చెప్పారు. కానీ ఒక్క తమిళనాడులో ఉపాధి పనుల కింద కేవలం 44 నుంచి 46 శాతం మాత్రమే పనిదినాలు కల్పించారు. ఇక ఉపాధి విషయానికొస్తే ప్రభుత్వ గణంకాల ప్రకారం.. 2014-15లో 1.15 లక్షలు, 2015-16లో 2.3 లక్షలు మాత్రమే ఉద్యోగాలు కల్పించారు. 2016-17లో ఆ సంఖ్య కొంత పెరిగింది. కానీ ప్రభుత్వం ప్రతియేడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. గడిచిన మూడేండ్లలో కనీసం 50 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు' అని వివరించారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని, నేటికీ రైతాంగం ఇబ్బందులు పడుతోందని తెలిపారు. కానీ కేంద్రం నుంచి సాయం లభించడం లేదని వాపోయారు.'వ్యవసాయం రాష్ట్ర అంశమని కేంద్ర పెద్దలు అంటున్నారు. కానీ 2014ఎన్నిల్లో స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని హామీనిచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ వాగ్దానాన్ని విస్మరించారు' అని అన్నారు. మోడీ సర్కారులో ఒక్క కార్పొరేట్లు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. అందువల్లే జీఎస్టీ, నోట్లరద్దును ఒక్క కార్పొరేట్లు మాత్రమే స్వాగతించారని అన్నారు.

పౌరుల జాతీయ రిజిస్ట్రేషన్ పేరుతో

మైనారిటీలను లక్ష్యం చేస్తున్నారు : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ, : పౌరుల జాతీయ రిజిస్ట్రేషన్ (ఎన్ఆర్‌సీ) పేరుతో అసోంలో బెంగాలీలు సహా భాషాపరమైన మైనార్టీలను లక్ష్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని సీపీఐ(ఎం) విమర్శించింది. ఈ సమస్యను రాజ్యాంగం ఆధారంగా స్నేహపూర్వకంగా ఈ సమస్యను పరిష్కరించాలి తప్ప, ఆర్ఎస్ఎస్-బీజేపీ కనుసన్నలలో కాదని తెలిపింది. అసోం ప్రజలను విభజించేందుకు మతం, భాషను ఒక పాధనంగా బీజేపీ ప్రభుత్వం వాడుకుంటుందని సీపీఐ(ఎం) ఆరోపించింది. 'ఈ సంక్షోభానికి ప్రధాన మంత్రి బాధ్యత వహించాలి. అసోంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ మతం, భాష అంశాలనే ప్రస్తావించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చినవారందరినీ వెనక్కి పంపించేస్తామని వాగ్దానం చేశారు. బెంగాలీ మాట్లాడే ప్రజలందరూ బంగ్లాదేశీయులుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి. మోడీ పాలనలో పరిస్థితి మరింత క్షీణించింది' అని సీపీఐ (ఎం) నేత మహమ్మద్ సలీం చెప్పారు. అస్సాం నుండి బెంగాలీలను బయటకు పంపివేయడానికి కుట్ర జరుగుతోందని విమర్శించారు. అసోం ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ప్రస్తావిస్తూ ఈ పౌరుల జాబితా నుండి తొలగించడం వెనుక కుట్ర వుందని అన్నారు.

వాట్సాప్‌లో 7,500 కోట్ల సందేశాలు

భారత్‌లోనే 2,000 కోట్లు..

- నూతన సంవత్సరం సందర్భంగా పంపించారన్న సంస్థ



న్యూఢిల్లీ: వాట్సాప్ అరుదైన ఘనత సాధించింది. కొత్త ఏడాది సందర్భంగా ఈ యాప్ ద్వారా ప్రపంచవ్యాప్తంతా యూజర్లు 7,500 కోట్ల సందేశాలు పంపించినట్టు ఆ సంస్థ ప్రకటించింది. వీటిలో ఒక్క భారత్ నుంచే 2000 కోట్ల సందేశాలుండటం గమనార్హం. ఎక్కువ శాతం సందేశాలు శుభాకాంక్షల రూపంలోనే వెళ్లినట్టు సంస్థ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పంపిన సందేశాల్లో 1,300 కోట్ల ఇమేజీలు, 500 కోట్ల వీడియోలు ఉన్నట్టు తెలిపింది. 2016 కొత్త ఏడాది సందర్భంగా మొత్తం 6,300 కోట్ల సందేశాలను వాట్సాప్ ద్వారా పంపించినట్టు గుర్తు చేసింది.

భారతీయులను నిరాశకు గురి చేసి..

సందేశాల పరంగా వాట్సాప్ రికార్డు సృష్టించినా.. భారతీయులకు మాత్రం చిరాకు తెప్పించింది. మిత్రులు, బంధువులకు వాట్సాప్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలు ఎప్పుడు దాటుతుందా? అని ఎదురుచూసిన భారత యూజర్లకు నిరాశ తప్పలేదు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత దేశవ్యాప్తంగా వాట్సాప్ సేవలకు గంటకు పైగా అంతరాయం కలిగింది. అయితే.. ఈ పరిస్థితికి గల కారణాలను సంస్థ వెల్లడించలేదు.

జిగ్నేశ్, ఉమర్ ఖాలిద్‌పై కేసు

పుణె : కొత్తగా ఎన్నికైన గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జేఎన్‌యూ) విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌పై పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. డిసెంబర్ 31న శనివార్వాదా పోర్టు వద్ద 'ఎల్గార్ పరిషత్' సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, రెండు వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలతో ఐపీసీ సెక్షన్ 153, 505, 117 క్రింద విషమ్‌భాగ్ వాడ పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేశారు. జనవరి 2వ తేదీన డెక్కన్ జింఖానా పోలీస్ స్టేషన్లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును దాఖలు చేశారు.

వ్యక్తిగత గోప్యతకు చెల్లు చీటీ..?

- రూ.500 చెల్లిస్తే ఎవరి వివరాలైనా తెలుసుకునే అవకాశం..?
- ఆధార్ డేటా లీకేజీపై 'ది ట్రిబ్యూన్' పరిశోధనాత్మక కథనం
- లీకేజీ నిజం కాదంటూ యూఐడీఏఐ వివరణ



జలంధర్: రూ.500తో దేశంలోని ఎవరి ఆధార్ వివరాలనైనా తెలుసుకోవచ్చునని ది ట్రిబ్యూన్ ఇంగ్లీష్ దినపత్రిక పరిశోధనలో వెల్లడైంది. ఛండీగఢ్ ప్రధాన కేంద్రంగా పని చేసే ది ట్రిబ్యూన్ తన బుధవారం సంచికలో దీనికి సంబంధించిన ఓ కథనాన్ని వెల్లడించింది. ఆధార్ వివరాలు లీక్ అయ్యే అవకాశంలేదని, పూర్తిగా సురక్షితమని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) గతేడాది నవంబర్‌లో భరోసా ఇచ్చింది. కాగా, ట్రిబ్యూన్ పరిశోధనలో ఆధార్‌లోని వ్యక్తిగత డేటా సురక్షితం కాదని తేలింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

ట్రిబ్యూన్ విలేకరి ఓ వాట్సాప్ గ్రూప్‌ను సంప్రదించడం ద్వారా ఆధార్ వివరాలను తెలుసుకోవడం సులభమేనని అర్థమైంది. వాట్సాప్ గ్రూప్‌నకు చెందిన వ్యక్తికి రూ.500 పేటీఎం ద్వారా చెల్లించగా విలేకరికి ఆధార్ వివరాలను లాగిన్ చేయడానికి ఓ ఐడీ నెంబర్, పాస్‌వర్డ్ ఇచ్చారు. దాంతో,ఓ పోర్టల్ ఓపెన్ అయింది. 100 కోట్లకుపైగా దేశ పౌరుల వివరాలను తెలుసుకునేందుకు విలేకరికి అవకాశం లభించింది. ఇదంతా పది నిమిషాల్లోనే జరిగిపోయింది. వందకోట్లమందికిపైగా పౌరుల వివరాలను ఆధార్ కార్డుల కోసం యూఐడీఏఐ ఇప్పటికే సేకరించిన విషయం తెలిసిందే. పేరు, అడ్రస్, ఫోటో, పోస్టల్ పిన్‌కోడ్, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ వివరాలను ఎవరివైనా తెలుసుకునేందుకు ఈ పోర్టల్ అవకాశం కల్పించింది. ఆ తర్వాత రూ.300 చెల్లించగా, ఆధార్ కార్డుల ప్రింటవుట్ తీసుకునే సాఫ్ట్‌వేర్ సౌకర్యాన్ని కూడా కల్పించారు.

ఆధార్ లీకేజీకి సంబంధించిన రాకెట్ ఆరు నెలల క్రితం ప్రారంభమైనట్టు ది ట్రిబ్యూన్ పరిశోధనలో వెల్లడైంది. కొంతమంది ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఈ రాకెట్‌ను ప్రారంభించినట్టు తేలింది. ఆధార్ డేటా యాక్సెస్ ఉన్న మూడు లక్షలమంది విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రైజ్(వీఎల్ఈ) ఆపరేటర్స్‌ను ఈ వాట్సాప్ గ్రూప్ తమ రాకెట్ కోసం ఎంచుకున్నది. కేంద్ర సమాచార,సాంకేతికశాఖ కింద కామన్ సర్వీస్ సెంటర్స్ స్కీం(సీఎస్‌సీఎస్) ద్వారా వీఎల్ఈ ఆపరేటర్లకు ఆధార్ డేటాను అందుబాటులోకి తెచ్చారు. అయితే, గత నవంబర్‌లో సీఎస్‌సీఎస్ ఆపరేటర్లను ఆధార్‌కు సంబంధించిన బాధ్యతల నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పించింది. అప్పటికే ఆధార్ డేటా భద్రతకు సంబంధించిన ఉల్లంఘనలపై కథనాలు రావడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. దాంతో,వారికి పని లేకుండా పోయింది. ఇక్కడే లీకేజీకి అవకాశం ఏర్పడినట్టుగా ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొన్నది. ఇప్పుడు ఆధార్ యాక్సెస్‌ను పోస్టాఫీసులు,బ్యాంకులకు పరిమితం చేశారు. అయితే,గతంలో ఆధార్ డేటా యాక్సెస్ పొందిన లక్షమందికిపైగా వీఎల్ఈలపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. చట్ట విరుద్ధంగా ఆధార్ డేటాను వారు ఎవరికైనా అమ్ముకునే వీలున్నదని ట్రిబ్యూన్ తన కథనంలో తెలిపింది. ఆధార్ లీకేజీతో ప్రయివసీ పరీక్షలో ఈ ప్రాజెక్ట్ విఫలమైనట్టేనని సిటిజెన్స్ ఫోరమ్ ఫర్ సివిల్ లిబర్టీస్ కన్వీనర్ గోపాల్‌కృష్ణ అన్నారు. ట్రిబ్యూన్ కథనం ద్వారా డేటా పరిరక్షణ చట్టం అర్థం లేనిదవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఉల్లంఘన జరిగిందని ఆయన అన్నారు. 2010లో ఆధార్ బిల్లును ప్రవేశ పెట్టే సందర్భంగా పార్లమెంటరీ కమిటీ ముందు గోపాల్‌కృష్ణ తన అభ్యంతరాలను వ్యక్తం చేయడం గమనార్హం. అయితే, ట్రిబ్యూన్ కథనాన్ని ఖండిస్తూ యూఐడీఏఐ గురువారం ఓ ప్రకటన చేసింది. ట్రిబ్యూన్ కథనంలో వాస్తవాల్ని వక్రీకరించినట్టుగా యూఐడీఏఐ ట్వీట్ చేసింది. ఎలాంటి బయోమెట్రిక్ డేటా ఉల్లంఘనకు గురి కాలేదంటూ సమర్థించుకున్నది. డేటాను ఎవరైనా దుర్వినియోగం చేసినా పసిగట్టగల సాంకేతికత తమకు ఉన్నట్టు తెలిపింది. అటువంటివారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్టు చెప్పింది. పేరు, కొన్ని వివరాలకు మాత్రమే యాక్సెస్ ఉంటుందని,బయోమెట్రిక్ డేటా లీకయ్యే అవకాశం లేదని తెలిపింది.

మహిళల ప్రవేశంపై నిషేధం లేదు

- రాజకుటుంబాల మహిళలు తరచుగా సందర్శించేవారు
- శబరిమల దేవాలయంలోకి మహిళల ప్రవేశంపై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి

తిరువనంతపురం: శబరిమల దేవాలయంలోకి మహిళలు ప్రవేశించటంపై నిషేధం లేదని, గతంలో మహిళలు, ప్రత్యేకంగా రాజకుటుంబాలకు చెందిన మహిళలు తరచుగా శబరిమల దేవాలయాన్ని సందర్శించేవారని కేరళ దేవాదాయశాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ చెప్పారు. శబరిమల దేవాలయంలోకి పది నుండి యాభై సంవత్సరాల వయసున్న మహిళల ప్రవేశాన్ని నిషేధించటం వివక్ష, రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందా అన్న అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్న సందర్భంలో దేవాదాయశాఖ మంత్రి ఈ ప్రకటన చేశారు. 1940లలో తనను ఒడిలో కూర్చోబెట్టుకుని తనతల్లి శబరిమల దేవాలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిందని తనకు చెప్పేవారని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సలహాదారుగా పనిచేసిన టి కె ఎ నాయర్ చెప్పారు. శబరిమలకు వచ్చే యాత్రికులకు సౌకర్యాలను సమకూర్చటం కోసం ఏర్పాటు చేసిన సలహా కమిటికి నాయర్‌ను గతవారం ఛైర్మన్‌గా నియమించారు.

హంతకులను చేరదీసి కాపాడుతున్న బీజేపీ

సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు గౌతమ్ దాస్

అగర్తల : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ .. హంతకులను, దోపిడీదారులను పార్టీలో చేర్చుకొని వారిని కాపాడుతున్నదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు గౌతమ్‌దాస్ అన్నారు. అగర్తలలోని సీపీఐ(ఎం) హెడ్‌క్వార్టర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్రిపురలో కొన్ని నెలల క్రితం జరిగిన జర్నలిస్టు హత్య కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని వెంటనే పోలీసులకు అప్పగించాలని బీజేపీని ఆయన డిమాండ్ చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇండిజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మందాయ్‌లో భారీ ఆందోళన జరిగింది. అయితే.. దీని కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టు శాంతనూ భౌమిక్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో 12 మంది పేర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గతనెల 16న చార్జిషీటు దాఖలు చేసింది. వీరిలో ఆరుగురు ఇప్పటికే అరెస్టుకాగా మిగిలిన వారు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్నవారిలో ఇద్దరు ఐపీఎఫ్‌టీ నాయకులు రామేంద్ర దెబ్బర్మ, పుషారీ దెబ్బర్మ ఇటీవల బీజేపీలో చేరారు. కాగా.. జర్నలిస్టు హత్య కేసు నుంచి బయట పడేందుకే వారిద్దరూ బీజేపీలో చేరారని గౌతమ్ దాస్ ఆరోపించారు. రామేంద్ర, పుషారీలను పోలీసులకు వెంటనే అప్పగించాల్సిన బాధ్యత.. వారిని బీజేపీలోకి ఆహ్వానించిన ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జి సునీల్ దీప్‌ధార్, కార్యక్రమంలో పాల్గొన్న ఇతర నేతలపై ఉందని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు సిట్.. తనకున్న అధికారాన్ని ఉపయోగించి ఏదైనా చేయొచ్చని గౌతమ్‌దాస్ ఈ సందర్భంగా తెలిపారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు

చట్టం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు



న్యూఢిల్లీ : పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు సంబంధించి కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు గురువారం నోటీసులు జారీచేసింది. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ నోటీసులు ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అనంతరం విచారణను నాలుగువారాలకు వాయిదావేసింది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 కింద అన్ని జిల్లాల్లో నోడల్ ఆఫీసర్లను నియమించాలని, స్థానిక, అంతర్గత కమిటీలను ఏర్పాటుచేయాలని స్వచ్ఛంద సంస్థ తన పిటిషన్‌లో కోరింది. ఈ చట్టం ప్రకారం పని ప్రదేశంలో లైంగిక వేధింపుల కేసులను విచారించేందుఉ అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి. 10 కంటే తక్కువ మంది ఉద్యోగులతో పనిచేసే సంస్థలు లేదా యజమానే నిందితుడైతే, జిల్లా అధికారులు చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ఫిర్యాదులను స్వీకరించడానికి 'స్థానిక కమిటీ'లను ఏర్పాటు చేయాలి.

లాలూ అనుచరుల నుంచి ఫోన్లు: న్యాయమూర్తి

రాంచీ : పశుదాణా కుంభకోణం కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివ్‌పాల్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడు, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ సన్నిహితులు, శ్రేయోభిలాషుల నుంచి తనకు ఫోన్లు వచ్చాయనీ, ఆయనకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని కోరుతున్నారనీ న్యాయమూర్తి శివ్‌పాల్ సింగ్ శిక్ష ఖరారుకు సంబంధించిన విచారణ సందర్భంగా చెప్పారు. కాగా, ఫోన్లు చేసిన వారి పేర్లను మాత్రం ఆయన ప్రస్తావించలేదు. ఈ కేసులో ఇప్పటికే కోర్టు లాలూను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అయితే ఆయన శిక్ష ఖరారుకు సంబంధించిన తీర్పును శుక్రవారానికి వాయిదావేశారు. లాలూకు, దోషులుగా తేలిన మరో 15 మందికి గరిష్ట శిక్షను విధించాల్సిందిగా సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. పశుగ్రాసం కేసుకు సంబంధించి లాలూ సహా ఐదుగురు నిందితుల తరపున వాదనలను న్యాయమూర్తి విన్నారు. శిక్ష ఖరారును వీడియో కాన్ఫరెన్స్ ద్వారానా లేదా కోర్టులోనా అనేది శుక్రవారం నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తన మద్దతుదారులు కోర్టు రూమ్‌లో ఎలాంటి నినాదాలు చేయరని లాలూ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

రైతులకు 24 గంటల కరెంటుతో...
కాంగ్రెస్ నేతలకు దిమ్మ తిరిగింది



టీఎన్జీవో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు, మండలి చైర్మెన్ స్వామిగౌడ్, దేవీప్రసాద్, దేశపతి శ్రీనివాస్ తదితరులు

- ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు
- రాష్ట్ర ఏర్పాటులోనూ కలిసిరాలేదు
- నాడు రాజీనామా చేయాలంటే జేఏసీ నుంచి పరార్
- జిరాక్స్ ప్రతులను స్పీకర్‌కు పంపిన ఇంకో పార్టీ
- విభజన చట్టంలో లొసుగులతో పలు సమస్యలు
- ఏపీ కార్యాలయాలున్నా వాడుకోలేని పరిస్థితి
- ఉద్యమ స్ఫూర్తితో బంగారు తెలంగాణ కోసం కృషి చేయాలి
- ఉద్యోగుల సమస్యలు సీఎంతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తాం : టీఎన్జీవో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుండడంతో కాంగ్రెస్ నేతలకు దిమ్మ తిరిగిందని, మైండ్ బ్లాంక్ అయ్యిందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు (టీఎన్జీవో) కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 24 గంటల ఉచిత కరెంటు ఘనత వారిదేనని, గతంలో చేపట్టిన చర్యల వల్లే సాధ్యమైందని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 24 గంటల కరెంటు ఎందుకివ్వ లేదని ప్రశ్నించారు. నాడు పరిశ్రమలకు పవర్ హాలిడే, పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా కరెంటు కోతలు, ఇక వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అని మ్యానిఫెస్టోలో పేర్కొన్నా సరిగ్గా 5,6 గంటలూ రాలేదని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ తొలి సమావేశాల్లో రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని మండిపడ్డారు. నాడు రాష్ట్ర ఏర్పాటులోనూ వారు కలిసి రాలేదని చెప్పారు. నేడు రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో రాజీనామా చేద్దామంటే ఒకరు (కాంగ్రెస్) టీజేఏసీ నుంచి పరారయ్యిందని, ఇంకొకరు (టీడీపీ) జిరాక్స్ ప్రతులను స్పీకర్‌కు పంపించారని ఎద్దేవా చేశారు. నాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ వేదికలుగా ఉన్నాయని, నేడు తెలంగాణ అభివృద్ధికి వేదికలుగా మారుతున్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యోగులు ఎదుర్కొంటున్న మూడు,నాలుగు సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సంప్రదించి త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

నిస్సహాయునిగా సీఎం కేసీఆర్ : స్వామిగౌడ్

విభజన కమిటీ అనుమతి లేకుండా బాత్రూమ్ తలుపు ముట్టుకునే అవకాశం లేదని శాసనమండలి చైర్మెన్ కె స్వామిగౌడ్ చెప్పారు. ఆ కమిటీ ఒప్పుకోకుండా ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగులను తెలంగాణకు తీసుకొచ్చేందుకు అధికారం లేదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిస్సహాయునిగా ఉన్నారని చెప్పారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవీప్రసాదరావు మాట్లాడుతూ పీఎఫ్‌ఆర్డీఏ చట్టం నుంచి వెనక్కి వచ్చి కేరళ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలవాలని కోరారు. సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రశ్నించేతత్వాన్ని సంఘాలు కోల్పోవద్దని సూచించారు. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే ఉద్యోగ సంఘం ఉంటుందని చెప్పారు.

సర్కారుకు తొత్తులమే : రాజేందర్

ఉద్యోగులకు అండగా ఉండే ప్రభుత్వాలకు తొత్తులుగానే ఉంటామని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. సమస్యల పరిష్కారం పట్ల రాజీలేదన్నారు. ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ఉద్యోగులను శాశ్వ త బదిలీలు చేపట్టాలని సూచించారు. 2018 ఉద్యోగుల హక్కుల సాధన సంవత్సరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రేచల్, 31 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల నిరసన

మంత్రి హరీశ్‌రావు వేదికపైకి రాగానే ఏపీలో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు రవీంద్రభారతిలో ముందుకొచ్చి నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూర్చోవాలని టీఎన్జీవో నేతలు ముజీబ్, రాజేందర్ విజ్ఞప్తి చేసినా వినలేదు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రి హరీశ్‌రావు కల్పించుకొని కూర్చోకపోతే ఇక్కడే ఉంటారని అన్నారు. నిలబడితే, నిరసన తెలిపితే సమస్యలు పరిష్కారమవుతాయా?అని ప్రశ్నించారు.

సమస్యలపై చర్చిద్దాం

నేడు, రేపు శంషాబాద్‌లో మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 5,6 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరగబోతున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభల్లో 31 జిల్లాల నుండి 400 మంది మత్స్యకార ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేలాదిమంది మత్స్యకారులతో 'మత్స్యకార మహాగర్జన సభ' నిర్వహించబోతున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మత్స్యవృత్తి అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమంపై మహాసభలో చర్చించి, తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేస్తామన్నారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్, బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ మురళీ మనోహర్, టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలు విమలక్క, టీ మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మత్స్యఫెడరేషన్ మాజీ చైర్మెన్ చేతి ధర్మయ్య, గంగపుత్ర, ముదిరాజ్ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.



(ఫైల్)



శ్రమిస్తే విజయం మనదే : ఎల్ రమణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని, శ్రమిస్తే విజయం మనదేనని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్. రమణ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ మండల అధ్యక్షులు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేతలు పార్టీని వీడినంత మాత్రాన కార్యకర్తలు మనో ధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. అలాగే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వ పనితీరును ఎండగడదామని అన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేద్దామని, వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ మీద టీడీపీ జెండా ఎగరేద్దామని అన్నారు. టీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు భిన్నంగా కేసీఆర్ పాలన నడుస్తున్నదన్నారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం పథకాలను ప్రవేశపెడుతున్నదని విమర్శించారు. గతంలో తెలుగుదేశం పాలన మూలంగానే తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిపథంలోకి నడిచాయని గుర్తు చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు ప్రజానుకూల విధానాల మూలంగా ఉమ్మడి రాష్ట్రం సమస్యల నుంచి బయటపడినట్టు చెప్పారు. శిక్షణా తరగతులు పది బ్యాచ్‌లుగా నిర్వహించనున్నట్టు చెప్పారు. గురు, శుక్రవారాల్లో తొలి బ్యాచ్ పూర్తయింద న్నారు. ఇరిగేషన్‌పై రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హౌజింగ్, డబుల్‌బెడ్‌రూమ్‌పై బండ్రు శోభారాణి, తెలుగుదేశం- ప్రస్తుత రాజకీయాలపై ఇ.పెద్దిరెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాసంపై వర్లు తదితరులు శిక్షణ ఇచ్చారు.

శరీర సౌందర్యం ఎంత ఉన్నా హృదయ సౌందర్యం లేకపోతే అది అంతా వ్యర్థమే. - వివేకానంద

సంపాదకీయం


ఉక్రెయిన్ అంతర్యుద్ధం!

ఉక్రెయిన్ సైన్యానికి అత్యంత ఆధునిక ఆయుధాలను సరఫరా చేయాలనే ప్రతిపాదన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆమోదించాడని వాషింగ్టన్ పోస్టు పత్రిక రాసింది. ఈ ఆయుధాల విలువ 41.5మిలియన్ డాలర్లనీ రాసింది. 2014 తరువాత అమెరికన్ కాంగ్రెసు సంపూర్ణ మద్దతుతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. ట్రంప్‌కు ముందరి అధ్యక్షుడైన ఒబామా తీసుకోవటానికి సంశయించిన నిర్ణయాన్ని ట్రంప్ తీసుకున్నట్టు కూడా వాషింగ్టన్ పోస్ట్ రాసింది.

ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం దొరకకపోగా ఆ దేశంలో కొనసాగుతున్న అంతర్యుద్ధం మరింత హింసాత్మకమౌతుంది. అంటే అమెరికా సరఫరా చేస్తున్న ఆధునిక ఆయుధాలు అంతర్యుద్ధం అనే రావణ కాష్టాన్ని ఉక్రెయిన్‌లో ఆరకుండా కొనసాగేలా చేస్తాయి.

అమెరికా అంతర్గత రాజకీయాల అవసరం కోసం ట్రంప్ ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు కనపడుతూనే పూర్తి స్థాయిలో తలపడటానికి సిద్ధపడకుండా ఉండటమే ట్రంప్ విధానంగా ఉన్నది. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను గుర్తించిన తరువాత కూడా అమెరికా తన రాయబార కార్యాలయాన్ని మార్చలేదు. నిజానికి దీనికోసం పశ్చిమ జెరూసలెంలో వున్న అమెరికా కాన్సలేట్ జనరల్ ఆఫీసు బోర్డు తీసివేసి రాజధాని టెల్‌అవీవ్‌లోని రాయబార కార్యాలయం బోర్డు తగిలిస్తే సరిపోతుంది. అలాగే ఇరాన్‌తో చేసుకున్న అణు ఒప్పందాన్ని 'ఆమోదించటం లేదు' అని ప్రకటించి ఆ ఒప్పందం నుంచి బయటకు రాకుండా ఉండటం ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఏ వర్గాలైతే ఒక ఏడాది కాలంపైగా తనను 'పుతిన్ తొత్తు'గా అభివర్ణిస్తున్నాయో ఆ వర్గాలే ఉక్రెయిన్‌ను సాయుధం చేస్తున్నందుకు పొగడటం ప్రారంభించాయి. పరిగణనలోకి తీసుకోబడని యుద్ధ వ్యతిరేకుల విమర్శలను పక్కనబెడితే అధునాతన ఆయుధాలను అందించటంలో మరింతగా ముందుకు వెళ్ళటం లేదనే విమర్శను పాలకవర్గ సెక్షన్ల నుంచి ట్రంప్ ఎదుర్కొంటున్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు రక్షణ మంత్రి జేమ్స్ మాట్టిస్‌ను అభినందిస్తూనే ఉక్రెయిన్‌కు ట్రంప్ చేయవలసినంత చేయటం లేదని ఒబామా పాలనలో డెప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన మైఖేల్ కార్‌పెంటర్ ట్వీట్ చేశారు.



సిరియా ప్రభుత్వ సేనలు రసాయన ఆయుధాలు ఉపయోగించాయనే అబద్ధపు సాకుతో గత ఏప్రిల్ నెలలో ఒక సిరియా స్థావరంపై క్రూయిజ్ మిసైల్స్‌తో దాడిచేయటానికి ట్రంప్ ఆమోదం తెలిపినప్పుడు ఆయన అందుకున్న ప్రశంసల తీరులో ఇది కూడా ఉన్నది. ఉదాహరణకు అప్పటిదాకా ట్రంప్ పాలనను 'సర్కస్‌లో కొయ్య గుర్రం'లా ఉందని తీవ్ర స్థాయిలో విమర్శించిన సీఎన్ఎన్ వార్తా సంస్థకు చెందిన ఫరీద్ జకారియా సిరియా మీద దాడిచేసిన మరుసటి రోజు ఇలా అన్నారు: 'డోనాల్డ్ ట్రంప్ గత రాత్రి అమెరికా అధ్యక్షుడయ్యాడని నేననుకుంటున్నాను'. ఇటువంటి ప్రశంసలే రాబోయే రోజుల్లో ట్రంప్‌కు అందనున్నాయి.

కార్పెంటర్ మాట్టిస్‌ను అభినందించటానికి ప్రాధాన్యత ఉన్నది. వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ప్రకారం రక్షణ మంత్రి మాట్టిస్, విదేశాంగ కార్యదర్శి రెక్స్ టిల్లర్‌సన్‌లు ఉక్రెయిన్‌కి ఆత్యాధునిక ఆయుధ సరఫరా చేయటంకోసం తయారు చేసిన మెమోరాండమ్‌ను ట్రంప్ ఆమోదించారు. జాతీయ భద్రతా సలహాదారు హెచ్ ఆర్ మెక్ మాస్టర్ ఆమోదంతోనే ఈ మెమోరాండమ్ తయారు చేశారు.

ఈ నిర్ణయంతో వచ్చే పర్యవసానాల గురించి ట్రంప్‌కు అవగాహన ఎంత ఉందనేది ఆయనకు తన అధికారులు ఇచ్చే వివరణ బట్టి ఉంటుంది. నిజానికి అధికారులు తమకు నచ్చినంత మేరకే అధ్యక్షుడికి వివరిస్తారని అమెరికన్లకు తెలుసు. అమెరికా జాతీయ భద్రతా వ్యూహం(ఎన్ఎస్ఎస్) విడుదలైన రెండు రోజులకు ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఆయుధాలను సరఫరా చేయాలనే నిర్ణయం జరిగింది. క్లుప్తంగా చెప్పాలంటే జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించటం, ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆమోదించకుండా ఉన్నట్టుగానే ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా చేయాలనే నిర్ణయం కూడా అమెరికాలోని రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేసినదే. రష్యాకు వ్యతిరేకంగావున్న అమెరికా పాలక వర్గాలను సంతృప్తి పరచటానికే ఉక్రెయిన్‌కు ఆధునిక ఆయుధాల సరఫరా చేయాలనే నిర్ణయాన్ని ట్రంప్ ఆమోదించారు.

అయితే ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేస్తే వచ్చే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. స్వీయ రక్షణ కోసం ఆయుధాలను సమకూర్చుకోవటం అనే భావన ఒక బూటకం. ఆయుధాలు జన హననం చేస్తాయి. ఉక్రెయిన్‌కు సరఫరా చేసే ఆయుధాలను ప్రజలపై కూడా ఉపయోగించవచ్చు. తూర్పు ఉక్రెయిన్‌లోని క్షేత్ర స్థాయి వ్యూహాత్మక పరిస్థితిని ఈ ఆయుధాలు మార్చలేవు. వాస్తవాధీన రేఖ ప్రాంతంలో ఈ ఆయుధాలను ఉపయోగించే అవకాశం ఉండటంతో మరింత ఎక్కువ సంఖ్యలో ప్రజలు చనిపోతారు దీనికి తిరుగుబాటు ప్రాంతాలైన డోనెట్స్క్, లుగాన్స్క్‌లను నుంచి ప్రతిఘటన ఉంటుంది.

రెండవ మిన్‌స్క్ ఒప్పందాన్ని అమలు చేయటంలో ఉక్రెయిన్ చూపుతున్న అలసత్వం కారణంగా ఆ దేశంలో హింస ప్రజ్వరిల్లుతూనే ఉన్నది. అమెరికా అందించబోతున్న అధునాతన ఆయుధాలతో సరిహద్దు వెంబడి ఉక్రెయిన్ మరింతగా హింసకు తెగబడే అవకాశం ఉంటుంది. దీనితో ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం దొరకకపోగా ఆ దేశంలో కొనసాగుతున్న అంతర్యుద్ధం మరింత హింసాత్మకమౌతుంది. అంటే అమెరికా సరఫరా చేస్తున్న ఆధునిక ఆయుధాలు అంతర్యుద్ధం అనే రావణ కాష్టాన్ని ఉక్రెయిన్‌లో ఆరకుండా కొనసాగేలా చేస్తాయి.

ప్రజావాణి

డాక్టర్ సుజాతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

"ప్రముఖ దళిత స్త్రీవాద మేధావి, ఆక్టివిస్ట్ డాక్టర్ సుజాత సూరేపల్లిపై ఏబీవీపీ, ఇతర బీజేపీ సంస్థలు పథకం ప్రకారం జరుపుతున్నదాడి మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆమె పట్ల సామాజిక మీడియాలో వారు వాడుతున్న కుల దురహంకార, పురుషాహంకార భాషని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆమె నిర్వాసిత సమస్య పట్ల ప్రభుత్వాలని నిలదీయటం, మనుస్మృతి దహనాన్ని సమర్థించటం లేదా అనేక స్థానిక సమస్యలలో ప్రజల అవసరాలను ముందుపెట్టటం వల్లే ఆమెపై దాడి జరుగుతోందని మేము భావిస్తున్నాం. రాజకీయ విభేదాలని పరిష్కరించుకోవటానికి అబద్ధపు ఫిర్యాదులు, సామాజిక మీడియాలో దాడులు ఏ మాత్రం పనికిరావని మా ఉద్దేశం. ప్రజాస్వామ్యంలో అటువంటి విభేదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుని, ఆమెకి రక్షణ కల్పించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం."

ప్రొ॥రమ మేల్కొటే, ప్రొ॥సూసీ తారు, డా॥ కె. లలిత, గీత రామస్వామి, డా॥ అస్మా రషీద్, డా॥ ఆర్.శ్రీవత్సన్, డా॥ స్వాతి మార్గరెట్, గోగు శ్యామల, కె. సజయ, డా. ఉమా భృగుబండ, డా॥ శ్యామసుందరి, డా॥ ఎ. సునీత, వసుధ నాగరాజ్, డా॥ ఉష సీతాలక్ష్మి, ఎస్. ఆశాలత (మక్కామ), డా. చల్లపల్లి స్వరూపరాణి, డా. ఎం. ఎం.వినోదిని, వి.సంధ్య(పీఓడబ్ల్యు), కొండవీటి సత్యవతి (భూమిక), సుమిత్ర అంకురం, డా॥ పద్మజ షా, మేరీ మాదిగ (దళిత ఉమెన్ నెట్‌వర్క్), ఝాన్సీ (పీఓడబ్ల్యు), అనిత (సీఎంఎస్), హిమబిందు (టీపీఎస్‌కే), ఆర్. ఇందిర (ఆమనవేదిక), విజయలక్ష్మి, దేవీ (కల్చరల్ ఎక్టివిటీస్) డా॥ రుక్మిణి రావు, విజయ బండారు (ప్రవే), ఆర్.కే (ప్రవతీంజావషిఅజవం), శంకర్ (డీబీఎఫ్), చైతన్య పింగళి (రైటర్), ఇంద్రవెల్లి రమేష్ (రైటర్) విజయలక్ష్మి, మాధవి మిరప, కట్ట కవిత (జర్నలిస్టు), హైమావతి (ఐద్వా), సుజన (ఎన్ఎఫ్ఐడబ్ల్యు), కవిత పులి, మంజుల (సావిత్రీబాయి అధ్యయన వేదిక).

కవులంటే ఎందుకంత చులకన?

ఒక దినపత్రిక (నవ తెలంగాణ కాదు) సాహిత్య పేజిలో వచ్చిన కార్టూన్ చూసి నివ్వెరపోయాను. ఆ కార్టూన్ వేసిన ఆ కార్టూనిస్ట్ ఎవరో మరి. కవులంటే ఎందుకంత చులకనో? పత్రిక సబ్ ఎడిటర్ లేదా ఎడిటర్ కూడా ఆలోచించలేదా? సాహిత్య పేజిలోనే కవులను ఇలా కించపరిచి కుక్కలతో పోల్చడం చూస్తే ఆ పత్రిక కవులకు, సాహిత్యానికి ఎంతటి విలువ ఇస్తున్నారో అర్థమవుతుంది. ఎంతైనా అవినీతి సొమ్ముతో ఎదిగిన పత్రిక కదా పిచ్చి గీతలు, ఇష్టం వచ్చిన రాతలు రాస్తున్నది. దీనిని అరికట్టాలి. కవులు, రచయితలు, మేధావులు దీనిపై పోరాడాలి. బేషరతుగా పత్రిక యాజమాన్యం కవులకు క్షమాపణ చెప్పాలి. ఓ సాహిత్య పత్రిక ఎడిటర్ గారూ...! అవును మేము కుక్కలమే, సమాజం పట్ల విశ్వాసంతో ఉంటాం. మీ పత్రిక యాజమాన్యం సమాజాన్ని దోచుకుతింటున్నదనే ఆరోపణలున్నాయి వాటిని కూడా మీ పత్రికలో రాయండి. ఒక మహిళా రచయితగా ఈ కార్టూన్, అక్కడ రాసిన రాతను ఖండిస్తున్నా...

- విరాజిత.

అవార్డు వాపసీతో మరో ధిక్కార స్వరం



డాక్టర్ దేవరాజు మహారాజు

మానవవాదుల్ని, హేతువాదుల్ని, రాజ్యాన్ని విమర్శించే మేధావుల్ని ఒక పద్ధతి ప్రకారం హత్య చేయడం ఈ దేశంలో 2015 నుండి జరుగుతూ ఉంది. ఏండ్లు గడుస్తున్నా హంతకుల జాడ తెలియకపోవడం పాలకుల వైఫల్యాన్ని తెలియజేస్తోంది. సామాన్యుడి నడ్డి విరగగొట్టే పథకాల గురించి అత్యుత్సాహంగా ప్రసంగించే జాతీయ నేతలు ఇలాంటి విషయాల మీద నోరు మెదపడం లేదు. వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని సామాన్యులు అనుకుంటున్నది అందుకే. భిన్నత్వంలో ఏకత్వం సాధించుకుని హాయిగా వేల ఏండ్ల నుండి సహజీవనం చేస్తున్న భారతీయుల్ని అధికారం అడ్డుపెట్టుకుని, బలవంతపు ఏకత్వంలోకి తీసుకు రావాలనుకోవడం ఒక పెద్ద తప్పిదం. అది రాజ్యాంగాన్ని అతిక్రమించడం.

పెన్నుతోనూ, గన్నుతోనూ ప్రత్యక్షంగా రాజ్యంతో పోరాడిన సాహితీ యోధుడు డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య ఉండేవారు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం భారతీయ రచయితలలోనే కాదు, ప్రపంచ సాహితీవేత్తలలోనే అరుదు. ఇక సమకాలీనంలో ఇంక్విలాబ్ లాంటి రచయితల వ్యక్తిత్వం తెలుసుకుని, తెలుగు సాహిత్య కారులంతా ఆత్మవిమర్శచేసుకోవడం అవసరం!

అందువల్లనే ఇటు సామాన్యుల, అటు మేధావుల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రచయితలు, శాస్త్రజ్ఞులు, సినీ నాటక రంగాలవారు మూకుమ్మడిగా తమ తమ అవార్డుల్ని, బిరుదుల్ని కేంద్ర ప్రభుత్వానికి తిప్పి పంపి, దేశంలో ఒక సంచలనం సృష్టించారు. డెబ్బైయేండ్ల స్వాతంత్ర్య భారతంలో అదొక చారిత్రాత్మక సంఘటన. ఆ నిరసనలోని తీవ్రతను, ఆర్ద్రతను, ప్రభుత్వం సహృదయంతో స్వీకరించలేకపోయింది. నివారణ చర్యలు చేపట్టలేక పోయింది. పైగా, అవార్డుల్ని తిప్ప కొట్టి నిరసన తెల్పినవారికే 'అసహనం' అన్నట్టు కొందరు పెద్దలు మాట్లాడారు. హత్యలు చేసినవారికి, చేయబోతున్న వారికీ ఆ మాట ప్రోత్సాహకారిగా పనిచేసింది. అది, మరీ దారుణమైన విషయం!

ఇటీవల ప్రకటించిన 2017 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లో కీర్తిశేషుడయిన తమిళకవి మక్కల్ పవలార్ ఇంకులాబ్ (ఇంక్విలాబ్) కూడా ఉన్నారు. ఆయన తన జీవితకాలంలో రాజ్యాన్ని దూరంగానే పెట్టారు. పైగా రచయితల, జర్నలిస్టుల హత్యలను ఆయన తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తీవ్రంగా నిరసిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆయన చనిపోయిన తర్వాత, కేంద్ర సాహిత్య అకాడమీ ఆయనకు అవార్డు ప్రకటించింది. దాన్ని స్వీకరించాలా వద్దా అన్నది ఆయన కుటుంబం నిర్ణయించాల్సి వచ్చింది. కవి ఇంక్విలాబ్ ఏ విలువల కోసం రచనలుచేశారో, ఏ విధానాల్ని అవలంబించారో, ఏ ఆలోచనా ధోరణిని పరివ్యాప్తం చేశారో బాగా తెలిసిన కుటుంబ సభ్యులు కేంద్ర అకాడమీ అవార్డును తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. ఒకవేళ ఆ అవార్డు స్వీకరిస్తే చనిపోయిన కవి ఆశయాలను నిర్దాక్షిణ్యంగా నీరుగార్చినట్టవుతుందని బాధపడ్డారు. కీర్తికోసమో, దానితో వచ్చే పారితోషికం కోసమో ఆశపడితే, సమాజం దృష్టిలో తాము హీనులమైపోతామనీ, అందువల్ల అవార్డు స్వీకరించకుండా, కవి ఆశయాల్ని నిలపడమే తమ ధ్యేయమని ప్రకటించారు.

డిసెంబర్ 21, 2017 కేంద్ర సాహిత్య అకాడమీ వెలువరించిన ప్రకటనలో తమిళకవి ఇంక్విలాబ్ పేరుంది. "కాంథల్ నాట్‌కల్" అనే శీర్షికతో వెలువడిన కవితా సంపుటికి ఆ గౌరవం దక్కింది. కవి మరణానంతరం ప్రకటింపబడింది గనక, ఆయన కూతురు ఆమైనా భారవిన్ దానిపై స్పందించారు. తన తండ్రి, కవి ఇంక్విలాబ్ మొదటి నుండి తాడితుల, పీడితుల పక్షాన నిలబడ్డవారని, అణగదొక్కబడిన, వెనకబడిన జాతుల గూర్చి ఆవేదన చెందుతూ రచనలు వెలువరించారని, అందుకు ఫలితంగా ప్రభుత్వాలు ఆయనపై ఆంక్షలు విధించి, అరెస్టులు చేసిన ఎన్నో ఇబ్బందులు పెట్టారని, అలాంటి ప్రభుత్వ అవార్డుల్ని తన తండ్రి బతికి ఉంటే స్వీకరించేవారు కదని, ఆయన లేకపోయినా, ఆయన కుటుంబమంతా ఆయన ఆలోచనా ధోరణికి కట్టుబడి ఉందని, అందుకే మేము ఆ అవార్డుని తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. కవి ఇంక్విలాబ్ బతికి ఉన్నంత కాలం, వేర్వేరు సమస్యల మీద జనం మనిషిగా స్పందిస్తున్న కాలం. ఈ ప్రభుత్వం మాటి మాటికీ ఆయనను అరెస్టు చేసింది. దర్యాప్తు పేరిట నిరంతరం వేధించింది. ఆయన చనిపోయాక ఇప్పుడు ఆయనకో అవార్డు ప్రకటించి, గొప్పపని చేశామని మురిసిపోతున్న... ప్రభుత్వ విధానాల్ని రచయిత కుటుంబం నిర్ద్వందంగా ఎండగట్టింది.

1980లో తమిళనాడు పెరంబలూర్ జిల్లాలోని కొలప్పడి గ్రామంలో నలుగురు దళితుల పిల్లలు ఊరి బావిలోంచి మంచినీరు తోడుకుని తాగినందుకు హత్యచేయబడ్డారు. మత ఛాందసులతో నిండి ఉన్న ఆ ఊర్లో ఎవరూ ఆ సంఘటన పట్ల దిగ్భ్రాంతి గానీ, సంతాపంగానీ ప్రకటించలేదు. చనిపోయిన పిల్లల కుటుంబాలు, వారి మద్దతుదార్లు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ, ఊరేగింపుగా వెళ్ళి అంత్యక్రియలు పూర్తిచేశారు. హత్యలు చేసిన వారిని వదిలిపెట్టి, పోలీసులు నిరసనలు తెలిపిన వారిని నానా రకాలుగా హింసించారు. దేశంలో జరుగుతున్న దేమిటీ? ఇదేం న్యాయం? అని కవి ఇంక్విలాబ్ "మనుసంగ దా" (మేమూ మనుషులమే) అనే పాట రాశారు. అది ఊరూరా పాకిపోయింది. చివరికి అది తమిళనాడులో దళితుల జాతిగీతమైంది. "కొలప్పడి బావినీరు మా దళిత పిల్లల్ని కాల్చేసింది. అవును! నీరే పిల్లల్ని కాల్చేసింది. దానికి అగ్రవర్ణాల వారు, ప్రభుత్వమూ, చట్టాల సహాయంతో అగ్నికి ఆజ్యం పోశారు. మా పిల్లల ఎముకలు, మాంసం అగ్నిచితిపై నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు." అన్నది ఆ పాటలోని సారాంశం! (ఆ బావి ఇప్పటికీ కొలప్పడిలో ఉంది. అయితే వాడుకలో లేదు.)

ఇదే కాకుండా, అంతకుముందు 1968లో కీజా వెన్మణి సంఘటనలో నలభై నాలుగుమంది దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు చంపేసినప్పుడు కూడా కవి ఇంక్విలాబ్ కోపంతో రగిలిపోయారు. తన రచనలతో విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఎన్నో రాజకీయ కారణాల వల్ల, ఎన్నెన్నో అంతర్గత సమస్యల వల్ల ఆ సంఘటనల వివరాలు ప్రధాన వార్తా స్రవంతిలో రాలేదు. కానీ, ఈ ఇంక్విలాబ్ రచన వల్ల విషయం బయట ప్రపంచానికి తెలిసింది. పైగా చరిత్రలో అది నమోదయ్యింది. ఈ సంఘటనపై కవి ఇంక్విలాబ్ రాసిన ఆ పాట "ఫేసెస్ ఆఫ్ ఛేంజ్" అనే అంతర్జాతీయ డాక్యుమెంటరీ చలనచిత్రంలో చిత్రీకరించబడింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ఒక ఐదుగురు మహానుభావుల గురించి తీసిన డాక్యుమెంటరీ అది! దళితుల హక్కుల కోసం పనిచేసే ఎవిడెన్స్ (రుజువు) అనే సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎ. ఖతీర్ చెప్పిన విషయమేమంటే..



'ఇంక్విలాబ్ రాసిన ఒకే ఒక్క పాట ప్రభుత్వాల్ని, రాజకీయాల్ని, కుల వ్యవస్థను, మీడియాను ఆలోచనలో పడేసింది. కదిలించింది కూడా!' అని! ప్రజాకవిగా అంతటి ఘన చరిత్రగల కవిని బతికి ఉన్నప్పుడు హింసించి, చనిపోయాక అవార్డులిచ్చే రాజకీయాలు మారాలి. ప్రభుత్వ విధానాలు మారాలి. వ్యవస్థే మారాలి.


'మను సంగదా' అనే పాట ఏదో ఒక రోజులో జరిగిన అద్భుతం కాదు. ఏండ్లకేండ్లుగా అణగారిన వర్గాలతో మమేకమై కవి నడుస్తూ వస్తున్న దానికి ఫలితం! ఒక చోట ఇంక్విలాబ్ ఇలా చెప్పుకున్నారు. "నావి స్వతంత్ర సృజనాత్మక రచనలు కావు. ఒక రకంగా అవి అనువాదాలు. అణగారిన వర్గాల జనం ఉచ్ఛ్వాస నిశ్వాసల్ని, పైకి లేచిన వారి కనుబొమల ప్రశ్నల్ని నేను సాహిత్యంలోకి అనువదించాను... అంతే! ముఖ్యంగా ఆ వర్గాల యువకుల కండ్లలోని ఆశల వెలుగుల్ని నేను కవితలుగా మలిచాను" అని! అదీ ఆయన నిజాయితీ... అసలు పేరు షహుల్ హమీద్ (72). 1944లో జన్మించారు. కమ్యూనిస్టు కార్యకర్తగా ఎదుగుతూ విద్యాభ్యాసం ముగించుకుని, చెన్నైలోని న్యూకాలేజీలో తమిళ ప్రొఫెసర్‌గా పనిచేశారు. పెరియార్‌ను అమితంగా అభిమానించే ఈయన, మార్క్స్‌ను, లెనిన్‌ను శ్రద్ధగా అధ్యయనం చేశారు. ఆ ఆలోచనా ధోరణితోనే రచనలు చేస్తూ వచ్చారు. కన్మణి రాజమ్, మణిమేఖలై, కురింజిపట్టు వంటివి ఆయన ప్రసిద్ధ రచనలు. ఈయన కవి మాత్రమే కాదు, కథారచయిత కూడా! రాజకీయ విశ్లేషకుడిగా కూడా మంచి పేరుంది. పురాణాల్లోని స్త్రీ పాత్రలతో ఆయన రాసిన నాటకాలు 'అవ్వాయ్' 'మణిమేఖలై' బహుళ ప్రజాదరణ పొందాయి. ఇందులో 'అవ్వాయ్' కళాశాల స్థాయిలో పాఠ్యపుస్తకమయ్యింది.

నరేంద్ర దబోల్కర్, పన్సారే వంటి వారి హత్యలు కొనసాగుతున్నప్పుడు అవార్డు వాపసీ నిరసన కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతున్నప్పుడు కలత చెందిన షహుల్ హమీద్ - ఇంక్విలాబ్ "మృతప్రాయుడిగా జీవించాలని అనుకునేవారే ఇలాంటి అవార్డులు స్వీకరించాలి!" అని తనకు అవార్డు రాకముందే... అవార్డు గురించి తన అభిప్రాయం ప్రకటించారు. డిసెంబర్ 1, 2016న కన్నుమూసిన ఈ కవి ఆకాంక్ష మేరకు, ఆయన కుటుంబం నడుచుకోదలిచింది. కవిస్థాయిని ఎన్నోరెట్లు పెంచింది. మహోన్నతుల స్థాయికి అవార్డులు, బిరుదులు ఎదగలేవని దీనితో తేటతెల్లమయ్యింది.

కేంద్ర సాహిత్య అకాడమీ స్వతంత్ర సంస్థ కదా.. అని అనుకునేవారున్నారు. నిజమే! కాని దానికి నిధులెక్కడి నుండి వస్తున్నాయ్? కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిందే కదా? కేంద్ర ప్రభుత్వానికి ఆదాయమెక్కడిదీ? ప్రజలు పన్నులు చెల్లిస్తేనే కదా దానికి ఆదాయం వచ్చేది? అంటే ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వాలూ, ప్రభుత్వ సంస్థలూ నడుస్తున్నాయన్నది ప్రజలు గ్రహించాలి. ప్రభుత్వంలో ఉండి అధికారం చలాయిస్తున్నవారేం చేస్తున్నారూ? ఎక్కువ మందిని దోచుకుని ఏ కొద్దిమందికో మేలు చేస్తున్నారు. అలాగే ఏ కొద్దిమందినో చంపించి లేదా చంపేవాళ్ళను వెనకేసుకొస్తూ, అధిక సంఖ్యాకుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శాంతి వచనాలు చాటున బీభత్సాలు సృష్టిస్తున్నారు. అందుకే జనం చైతన్యవంతులై వాస్తవాలు గ్రహించే దిశలో ప్రయాణించాలి. అవార్డువాపసీ అయినా, నోట్ల రద్దయినా, మేధావుల హత్యలైనా, దళితులపై దాడులైనా... ఏవైనా అవి ప్రభుత్వం ప్రజల్ని ఆటాడు కుంటున్న తీరు తెన్నుల్ని చూపెడుతున్నాయన్నది నిజం!

'ఇంక్విలాబ్' కున్న తెగువ, అలాంటి నిబద్ధత ఉన్న తెలుగు సాహిత్యకారులెవ్వరని ఆలోచించడం వృధా! గతంలో పెన్నుతోనూ, గన్నుతోనూ ప్రత్యక్షంగా రాజ్యంతో పోరాడిన సాహితీ యోధుడు డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య ఉండేవారు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం భారతీయ రచయితలలోనే కాదు, ప్రపంచ సాహితీవేత్తలలోనే అరుదు. ఇక సమకాలీనంలో ఇంక్విలాబ్ లాంటి రచయితల వ్యక్తిత్వం తెలుసుకుని, తెలుగు సాహిత్య కారులంతా ఆత్మవిమర్శచేసుకోవడం అవసరం!

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీ వేత్త, సైన్స్ ప్రొఫెసర్, సెల్: 9908633949



సారంపల్లి మల్లారెడ్డి

దేశాన్ని అంధకారంలోకి నెట్టిన 2017

భవిష్యత్తుపై ఆశతో 2018లోకి అడుగు పెట్టాము. కానీ ఇప్పటికీ 2017 చేదు జ్ఞాపకాలు మన సమాజాన్ని వదిలిపెట్టడంలేదు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పరిశీలిస్తే తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. భారతప్రభుత్వం వ్యవసాయ రంగానికి 2.5శాతం (రు.52 వేల కోట్లు) మాత్రమే బడ్జెట్ కేటాయింపు చేసింది. ఇందులో 50శాతం పంటల బీమా, వడ్డీ మాఫీకి కేటాయించారు. అమెరికా తన బడ్జెట్‌లో 4శాతం నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించింది. అమెరికా సాగు విస్తీర్ణం, దిగుబడి మనకన్నా తక్కువ. అయినప్పటికీ 8 రకాల సబ్సిడీలు ఇచ్చి రైతులకు అన్నివిధాలా రక్షణ కల్పించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, త్రిపుర, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో గిట్టుబాటు ధరలు కావాలని, రుణమాఫీ కోసం 2017లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. 2017 నవంబర్ 20, 21 తేదీలలో లక్షమందితో పార్లమెంటు ముందు ఆందోళన నిర్వహించారు. గత నవంబర్ 24న దేశవ్యాపితంగా నాలుగు కిసాన్ జాతాలు నిర్వహించారు. మహారాష్ట్ర, రాజస్థాన్ పోరాటాలు గణనీయమైన ఫలితాలు సాధించాయి. జనాభా ఏటా 1.9శాతం పెరుగుతుండగా అందుకు తగినవిధంగా వ్యవసాయోత్పత్తులు పెరగలేదు. ఒకవైపున సాగుభూమి విస్తీర్ణం తగ్గుతున్నది. అలాంటి పరిస్థితుల్లో ఉత్పాదకత పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కానీ అందుకు తగిన పరిశోధనలు జరగడంలేదు. రైతుల రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు వెనకడుగు వేశాయి. దేశంలోని బ్యాంకులలో 96 లక్షల కోట్లు డిపాజిట్లు ఉండగా అందులో 18శాతం, అనగా 16 లక్షల కోట్లు పంట రుణాలు ఇవ్వాలి. కానీ 8.5 లక్షల కోట్లు మాత్రమే రుణాలివ్వడం జరిగింది. రిలయన్స్, ఎల్ అండ్ టీ, టాటా, బిర్లా లాంటి సంస్థలు మైక్రో ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తున్నారు. బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో ఉత్పత్తి వ్యయంపై 50శాతం కలిపి కనీస మద్దతు ధర చెల్లిస్తానని ప్రకటించింది. ఈ చర్యను అమలు జరపాల్సిందిగా సుప్రీంకోర్టు కోరడంతో, తాను ఈ హామీ అమలుజరపలేనని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసి కేంద్రప్రభుత్వం తప్పుకుంది. ఎన్నికల హామీ బూటకమని తేలింది. కనీస మద్దతు ధర లేకపోవడంతో 2017లో 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంఖ్యను తగ్గించి చూపడానికి జాతీయ నేరాల గణాంక సంస్థ ఆత్మహత్యలలో 25శాతం మందిని వ్యవసాయ కూలీలుగా గ్రేడింగ్ చేసింది.

ప్రకృతి వైపరీత్యాల వల్ల ఒరిస్సా, ఉత్తరాఖండ్ బాగా దెబ్బతిన్నాయి. కేంద్రం ఇంతవరకూ ఎలాంటి పరిహారం చెల్లించలేదు. సహజంగానే రాష్ట్రాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయినప్పుడు కేంద్రం తన బృందాలను పంపి నివేదిక తెప్పించుకుని, జరిగిన నష్టంలో కనీసం 60శాతం ఇవ్వాలని అనేక కమిషన్లు చెప్పాయి. చివరికి 14వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన నిధులు కూడా రాష్ట్రాలకు సకాలంలో ఇవ్వడంలేదు. మరోవైపున పారిశ్రామికరంగం దినదినం కునారిల్లుతున్నది. గత రెండేండ్లలో 61,333 పరిశ్రమలను మూతవేసినట్టు మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్స్ ప్రకటించింది. లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోయారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తీసివేసింది. పారిశ్రామిక సరుకుల దిగుమతి బాగా పెరిగింది. వంటనూనెలు, పప్పులు, పంచదార తదితర ఆహార సరుకులు, దూది, ఎరువులు, రసాయనాలు, మెడికల్, ఫార్మా, వజ్రాలు, నాన్ ఫెర్రస్ మెటల్ దిగుమతులు బాగా పెరిగాయి. 2016-17లో 25,77,422 కోట్ల సరుకులు దిగుమతి చేసుకోగా 18,52,340 కోట్లు ఎగుమతి చేశాము. అనగా 7,25,082 కోట్లు లోటు ఏర్పడింది. దేశాన్ని స్వయంసమృద్ధి చేస్తానన్న మోడీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితంగా ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో హైదరాబాద్‌లో 2017 జులై 23 నుండి 29 వరకు "రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనమిక్ పార్టనర్‌షిప్" పేర సమావేశాలు జరిపారు. ఇందులో 16 ఎగుమతి దేశాలు పాల్గొన్నాయి. అంతకుముందే నాలుగు విడతలుగా 2009, 2011లో ప్రాంతీయ ఒప్పందాల ద్వారా 82 దేశాలతో పరస్పర ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. దీనికి విస్తరణగా మరో 72 దేశాలతో చర్చలు జరిపారు. డబ్ల్యుటీఓలో ఉన్న సుంకాలు విధించే నిబంధనలకు విరుద్ధంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో దిగుమతి సుంకాలను రద్దు చేశారు. ఫలితంగా భారతదేశ ఉత్పత్తులు తగ్గుతాయి. ఉపాధి దెబ్బతింటుంది.

సాంఘికంగా 2017 బలహీనవర్గాలపై దాడులతో ముగిసింది. ముఖ్యంగా అభివృద్ధికాముక రచయితలను హత్యచేయడం ద్వారా ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టకు మచ్చ తగిలింది. నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, ఎం.ఎం.కల్బుర్గీ, గౌరీలంకేశ్ లాంటివాళ్ళను హత్య చేయడంతో పాటు



గోరక్షణ పేరుతో అనేకమంది ముస్లింలు, దళితులపై దాడులు చేశారు. ఉమర్ మహ్మద్ ఖాన్, పెహ్లూఖాన్‌లను హత్యచేయడమే కాక గుజరాత్‌లోని ఉనాలో, యూపీలోని షహరన్‌పూర్‌లో దళితులపై దాడులు సాగాయి. నిరుద్యోగుల ప్రదర్శనపై కూడా దాడులు చేశారు. మధ్యప్రదేశ్‌లోని మంథసోర్‌లో కాల్పులు జరిపి 6గురు రైతుల ప్రాణాలు బలిగొన్నారు. జార్ఖండ్‌లో 7గురు, అస్సాంలో ఇద్దరు, పశ్చిమబెంగాల్‌లో ఇద్దరు కాల్పుల్లో మరణించారు. కేరళలో సీపీఐ(ఎం) కార్యకర్తలపై హత్యాకాండ కొనసాగించారు. శాంతిభద్రతలను కాపాడుతున్న ప్రభుత్వంపై తిరిగి వారే ఆరోపణలు చేశారు. వామపక్ష ప్రభుత్వాలను బలహీనపర్చడానికి కేరళ, త్రిపుర రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపడమే కాక ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీ అన్ని విచ్ఛిన్నకర శక్తులతో కలిసి శాంతిభద్రతలకు ప్రమాదం కల్పిస్తున్నది. కొద్ది రోజుల్లో జరగనున్న త్రిపుర ఎన్నికల్లో గెలుపు కోసం విచ్ఛిన్నకారులతో కలిసి కుట్రలు సాగిస్తున్నది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ (ఒకే పన్ను విధానం) చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి రేటు గణనీయంగా తగ్గింది. అనేకమంది నిరుద్యోగులయ్యారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఈరోజుకీ సంక్షోభం నుండి బయటపడలేదు. పశు వ్యాపార నిషేధ చట్టం, కార్పొరేట్లకు ఉపయోగపడే మార్కెట్ చట్టం, ఫ్యాక్టరీల సవరణ చట్టం తేవడం ద్వారా భూస్వాములకు, కార్పొరేట్లకు లాభం చేకూర్చారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన కార్పొరేట్లనుండి అప్పులు రాబట్టడానికి బదులు, కేంద్రం తిరిగి 2.11 లక్షల కోట్లు బ్యాంకులకు నిధులు సమకూర్చింది.

విద్య, వైద్య రంగంలో మార్పులు చేసే ప్రయత్నం జరిగింది. ప్రజలనుంచి నిరసన వెల్లువెత్తడంతో తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ కార్పొరేట్ సంస్థలకు ఈ రెండు రంగాలలో లాభాలను సాధించిపెట్టడానికి చట్టాన్ని మార్పు చేయడానికి ఇప్పటికీ కృషి చేస్తూనే ఉంది. వైద్యరంగం బిల్లు పార్లమెంటు సెలెక్టు కమిటీకి పంపినప్పటికీ ఎలాగైనా రాజ్యసభలో గెలిపించుకోవాలని ప్రయత్నిస్తున్నది.

2018లోనైనా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పథంలో నడపడానికి కేంద్ర ప్రభుత్వం తన గత విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలోని సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా విత్తన చట్టం, గిట్టుబాటు ధరల చట్టం చేయాల్సిన అవసరం ఉంది. రైతుల రుణాల రద్దు, ఉత్పత్తిదారుల కంపెనీలను ఏర్పాటు చేసే విధానాన్ని రద్దు చేసుకోవాలి. సహకార సంఘాలను పటిష్టవంతం చేయాలి. ముఖ్యంగా ఆహారధాన్యాల దిగుమతులపై ఆంక్షలు విధించి దేశాన్ని స్వయంసమృద్ధి చేసుకోవడానికి పథకాన్ని రూపొందించాలి. బడ్జెట్‌లో కనీసం 5శాతం నిధులు వ్యవసాయరంగానికి కేటాయించాలి. విత్తన రుణ, మార్కెట్ అంశాల నుండి కార్పొరేట్ సంస్థలను తొలగించాలి. కార్మికరంగంలో తెచ్చిన మార్పులను సవరించాలి. కార్మికరంగానికి కనీసవేతనాల అమలు, సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి జరిగితేనే దేశ అభివృద్ధి జరుగుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి 2018లో ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల విధానాలను మార్చుకుంటుందని ఆశిద్దాము.



మనది అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. విద్యా హక్కుగా నిర్బంధ ఉచిత విద్యను రాసుకున్న దేశం. కానీ ఇక్కడ విద్య చాలా ఖరీదైనది. అమ్మాయి చదువుకోవాలంటే ఎన్నో అడ్డంకులు. మన దేశంలో ఉన్న మూడు మిలియన్ల మంది ట్రాన్స్‌జెండర్స్‌కు అదో పెద్ద కల. చదువుకోవాలంటే ఎంతో మూల్యం చెల్లిస్తున్నారు. ఎన్నో చీత్కారాలు, అవమాన భారాల్ని మోస్తున్నారు. నిజానికి చదువు సంగతి తరువాత... మనుషులుగా సమాజం నుంచి అంగీకారం కోసం, గుర్తింపుకోసమే ఇంకా పోరాటం చేస్తున్నారు. ఇక ఈ క్రమంలో విద్య ఎక్కడో అడుగున పడిపోయింది. అందుకే ట్రాన్స్‌పర్సన్స్ ఎక్కువగా చదువు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఎన్నో ఆడ్డంకులను అధిగమించి పీజీ స్థాయికి వచ్చినా.. అక్కడ తమపై జరుగుతున్న మానసిక దాడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కు చదువుకునే హక్కు లేదా? ఉంటే ఎందుకు డ్రాపవుట్లుగా మిగిలిపోతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదికే ప్రయత్నమే ఈ కథనం!

అంగీకారం లేక, గుర్తింపునకు నోచుకోక

ఖమ్మం జిల్లాలో ఓ సంఘటన. వెంకటేశ్వర్రావు, శ్రీనివాస్ (పేర్లు మార్చాం) ఇద్దరు అన్నదమ్ముళ్లు. శ్రీనివాస్‌ది ఇంటర్ పూర్తయ్యింది. వేసవిలో ఓ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో చేరాడు. మగాడిగా పుట్టినా... తన లోపలి అస్తిత్వం వేరేదని తనకు అప్పుడప్పుడే అర్థమవుతోంది. ఈలోపే వాళ్లన్నకు పెళ్లయ్యింది. వాళ్ల బావమరిది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తాడు. ఆయన శ్రీనివాస్‌ను చూశాడు. 'వీళ్ల తమ్ముడు ఇలా ఉన్నాడంటే.. మా బావ కూడా ఇదేనా!?' అని అనుమాన పడ్డాడు. శ్రీనివాస్‌ను ఇంటికి పిలిపించుకుని అన్నీ అడిగాడు. అన్నకు ఎక్కడ ఇబ్బంది అవుతుందోనని శ్రీనివాస్ నిజమే చెప్పాడు. ఆ విషయం ఆ నోటా ఈ నోటా పాకి కొద్దిరోజుల్లోనే అందరికీ తెలిసిపోయింది. ఇనిస్టిట్యూట్‌లో అందరూ శ్రీనివాస్ గురించి వింతగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఇది తెలిసి అన్న కొట్టాడు. ఫలితం.. రెండు రోజుల తరువాత శ్రీనివాస్ రైల్వే ట్రాక్‌మీద శవమై కనిపించాడు. బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలని కలలుగన్న శ్రీనివాస్... తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలు కోకొల్లలు. చదువుకోవాలని ఉన్నా, మంచి ఉద్యోగాలు చేయాలని ఉన్నా... కేవలం అంగీకారం లేక, గుర్తింపునకు నోచుకోక ప్రతిక్షణం చస్తూ బతుకుతున్నవాళ్లు అనేకం.

పదో తరగతి వరకు ఓకే...

ట్రాన్స్‌జెండర్స్ అంటేనే చిన్నచూపు. రకరకాల అవమానపు మాటలు. గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వచ్చినవాళ్లు, వివిధ కమ్యూనిటీస్‌లో చదువుకుంటున్న మొదటి తరం వాళ్లు. అందుకే బాగా చదివించాలని తల్లిదండ్రుల ఆలోచన. కానీ పాఠశాలలో 'వాడు చూడు ఎలా నడుస్తున్నాడో? ఎలా ప్రవర్తిస్తున్నాడో? అమ్మాయిలాగా చేస్తున్నాడు, చక్కగానిలా ప్రవర్తిస్తున్నాడు' అంటూ ఎగతాళి. పదో తరగతి వరకు అంతగా ఇబ్బందులుండవు. ఎందుకంటే అప్పటిదాకా హార్మోన్లలో అంత తేడాలుండవు.

అపనమ్మకంమొదలైంది...



ఇంట్లో ఉన్నంతవరకు కొంత చదువుకున్నా. కానీ అప్పుడు కూడా అనేక ఇబ్బందులు. స్కూల్ టైమ్‌లో బాగా చదివేది. బాగా చదివేవాళ్లతో ఎక్కువగా ఉండేదాన్ని. మా దగ్గర అమ్మాయిలే బాగా చదివేవారు. ఎక్కువగా అమ్మాయిలతో ఉండేదాన్ని. దాంతో అందరూ హేళన చేసేవారు. దాంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి... టెంత్‌లో పాసవుతానా లేదా అన్న అపనమ్మకం మొదలైంది. అసలు స్కూలుకు వెళ్లాలా, వద్దా? అని ఆలోచించేది. వెళ్తే సార్లు 'అమ్మాయిలా ఉంది నీ ముఖం, నీ మాటతీరు' అనేవాళ్లు. ఈ మాటలు పడలేక వెనక బెంచీలోకి వెళ్లి కూర్చునేది. ఇంటర్‌లోనూ అవే ఇబ్బందులు. దాంతో ఇంటర్ మధ్యలో ఆపేశాను. తరువాత కమ్యూనిటీలో చేరాక డిస్టెన్స్‌లో డిగ్రీ చేశాను. సోషియాలజీలో పీజీ కూడా పూర్తి చేశాను. నా వెనుక కమ్యూనిటీ వాళ్లు ఉన్నారు అన్న ధైర్యం ఉంది. ఇలాంటి మనోధైర్యం మాకు ప్రభుత్వం కల్పించాలి. మేమున్నాం అనే భరోసా ఇవ్వాలి.

– స్నేహ

సాధారణంగా టీజింగ్...

టెంత్ అయిపోయి ఇంటర్మీడియట్. ట్రాన్స్‌పర్సన్స్‌కి ఇది కీలకమైన వయసు. శరీరంలో, మానసికంగా మార్పులు వస్తుంటాయి. వాటిని గుర్తించేంత జ్ఞానం ఉండదు. సమస్య ఏంటో అర్థం కాదు. తమలోని బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. తల్లిదండ్రులకు చెప్పినా అర్థం చేసుకునే స్థాయి వాళ్లకు ఉండదు. స్నేహితులకు చెబితే నవ్వుతారు, ఏమంటారోనని భయం. 'నా మనసులో ఇలాంటి ఆలోచన వస్తుంది' అని ఎవ్వరితో పంచుకోలేని స్థితి. మానసిక సంఘర్షణ మొదలవుతుంది. అందుకే టెంత్, ఇంటర్‌లోనే చదువు ఆపేస్తున్నారు ట్రాన్స్‌జెండర్స్. గ్రామ స్థాయిలో ఇలాంటి కథలు అనేకం. కొంతమంది మీద స్టెప్ తీసుకుని డిగ్రీలో జాయిన్ అయితే... ఆ బాధలు వర్ణనాతీతం. శరీరం ఒకటి ఉంటుంది... కానీ మనసు చెప్పే లైంగికత మరోటి ఉంటుంది. వయసు పెద్దదవుతుంది. ఆ ఐడెంటిటీ పడగానే దూరంగా పెడతారు. తోటి విద్యార్థులు అసభ్యంగా ప్రవర్తిస్తారు. టీచర్స్ నుంచి సైతం వేధింపులు మొదలవుతాయి. అన్ క్వాలిఫైడ్ టీచర్స్ జెండర్ సెన్సిటైజేషన్ తెలియని ఉపాధ్యాయులు ఉంటారు. ఓవైపు టీచర్స్ వ్యాఖ్యలు, మరోవైపు తోటి విద్యార్థుల వేధింపులు వారికి నిత్యకృత్యం అయిపోతుంది.

అవమానభారం మోయలేక...

గేమ్స్ ఆడించే దగ్గర పక్కకు పెట్టేస్తారు. వారికి ఆటలు రావా? అంటే అద్భుతంగా ఆడతారు. అయినా కేవలం వాళ్లు ట్రాన్స్‌జెండర్స్ అయిన కారణంగా పక్కకు పెట్టేస్తారు. కాలేజీల్లో పిక్నిక్స్ అప్పుడు ఎంతో మనోవేదన. వాళ్ల వెంట ఎవరైనా వెళ్తే... 'ఫలానా వాడి వెంట పోతున్నవ్ జాగ్రత్త' అంటూ హెచ్చరిక లాంటి ఎగతాళి. ప్రతి ట్రాన్స్‌జెండర్ కచ్చితంగా ఎదుర్కొనే పరిస్థితి ఇది. బాల్యం నుంచి ఇన్నేండ్ల దాకా మంచి స్నేహితుడితో ట్రాన్స్‌జెండర్ గుర్తింపు వచ్చాక మాట్లాడాలన్నా భయపడాల్సిన పరిస్థితి. ఏదో సంబంధం ఉన్నట్టు, వాళ్లిద్దరి మధ్య ఏదేదో జరిగిపోతున్నట్లు పుకార్లు. అందుకే భయపడి వారితో ఎవ్వరూ స్నేహం చేయరు. ఫలితం ఒంటరి అయిపోతారు. డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. అలా ఇంటర్ స్థాయిలోనే ఆత్మహత్య చేసుకున్నవాళ్లు ఎంతో మంది. చదువుకోవాలన్న కోరిక బలంగా ఉన్నవాళ్లయితే... ఎన్ని అడ్డంకులెదురైనా డిగ్రీ, పీజీ వరకు చదువుతున్నారు. కానీ అవమాన భారం మోయలేనివాళ్లు ఆత్మహత్యల పాలవుతున్నారు. పెద్ద పెద్ద ఇనిస్టిట్యూట్స్, విశ్వవిద్యాలయాల్లో సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలివైన విద్యార్థులే చనిపోతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న విద్యార్థులు సైతం చనిపోతున్నారు. కారణం చదవలేకపోవడమో, ఆర్థికంగా ఇబ్బందులుండటమో కాదు... బయటికి కనిపించే శరీరం ఒకటి. మనసు మరోటి కావడం. దాన్ని ఈ సమాజం అంగీకరించకపోవడం. వాళ్లను మనుషులుగా గుర్తించకపోవడం. అడుగడుగునా అవమానాల పాల్జేయడం.

చట్టాలు లేవు...

తమలో జరుగుతున్న సంఘర్షణను గుర్తించి ఆడగానో, మగగానో జెండర్ మార్చుకుని, కమ్యూనిటీ అండ దొరికాక కూడా అనేక ఇబ్బందులు. ఇప్పుడు చదువుకుందామంటే.. చేర్చుకునే సంస్థలు లేవు. యూనివర్సిటీలు లేవు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీ చేయాలని బలంగా ఉంటుంది. కానీ పీజీ ఎగ్జామ్స్ రాసేటప్పుడే ఎన్నో కష్టాలు. ఎగ్జామ్ హాల్‌కి పంపించడానికి సవాలక్ష ప్రశ్నలు. వెలివేసినట్టుగా... అందరూ లోపలికి వెళ్లాక, అన్ని చెప్పిన తరువాతగాని లోపలికి పంపించరు.

పాఠ్యాంశం చేయాలి...

ఇక తెలంగాణ రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్స్ చదువుకునే అవకాశాలు చాలా తక్కువ. నల్సార్ జడ్జిమెంట్ తరువాత కొంత అంగీకారం లభిస్తోంది. అయినా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు శూన్యం. సుప్రీం జడ్జిమెంట్ తరువాత కేరళ కొన్ని ముందడుగులు వేసింది. ఓ రెసిడెన్షియల్ విద్యాసంస్థను నెలకొల్పింది. తమిళనాడు రాష్ట్రం ముందు నుంచే ఒక చట్టం తెచ్చుకున్నది. వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసుకున్నది. చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్నది. ఒరిస్సా ప్రభుత్వం చదువు, ఉపాధి కాకుండా ఇతర విషయాల్లో సహకారాన్ని అందిస్తున్నది. కానీ ఎక్కడా జీవోలు తీసుకు రావడం లేదు. చట్టాలు తేవడం లేదు. భవిష్యత్ తరాలైన ట్రాన్స్‌జెండర్స్‌ను సాటి మనుషులుగా చూడాలంటే ప్రభుత్వం ముందడుగు వేయాలి. తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చాలా మార్పులు తెస్తోంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి కొత్త పాఠ్యాంశాలు చేర్చింది. 'హిజ్రాలు అంటే ఎవరు? వాళ్లు ఎలా జీవిస్తారు? ఏ కారణం చేత ఇలా పుడతారు? వాళ్లతో ఎలా ఉండాలి? ఎలా మాట్లాడాలి?' వంటివి పాఠ్యాంశంగా పెడితే.. భవిష్యత్ తరాల్లో మార్పు వస్తుంది.

పిల్లలను సైతం



కేవలం మేమే కాదు... మా పిల్లలను కూడా చదివించలేని పరిస్థితి. నేను ఒక పాపను, తరువాత ఒక బాబును దత్తత తీసుకున్నాను. స్నేహ మరో బాబును దత్తత తీసుకుంది. వాళ్లను స్కూల్‌లో చేర్పించడానికి ఎన్నో తంటాలు. ఫోన్‌లో మాట్లాడితే మగవ్యక్తేమో అనుకుంటారు. నేరుగా వెళితే చూసి... మీరా అని ఒక విచిత్రమైన హావభావాలు పెట్టి... సీట్లు లేవని చెబుతారు. ఇక ఏ స్కూల్‌కు వెళ్లినా... తండ్రి పేరేంటని అడుగుతారు. మేం తండ్రి పేరు ఎక్కడినుంచి తీసుకొస్తాం. తల్లి పేరు రాయండి అని చెబితే... కనీస అవగాహన ఉండదు వాళ్లకు. ఎన్నో స్కూళ్లు నిరాకరించిన తరువాత... ఒక స్కూల్లో వేశాం. ఎంతో పోరాటం తరువాత అవకాశం ఇస్తారు. ఆ క్రమంలో అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు, పిల్లలు అందరూ మమ్మల్ని వింతగా చూస్తారు. తరువాత రోజునుంచి పాఠశాలల్లో పిల్లలను చులకనగా చూడటం మొదలువుతంది. ఇక హాస్టల్స్‌లో వేసిన పిల్లలను చూడటానికి నేరుగా వెళ్లలేని పరిస్థితి. ఎవరి సహాయంతోనో వెళ్లి.. పిలిపించుకుని మాట్లాడాలి. పిల్లలకు ఏం అవసరాలు ఉన్నాయో కనుక్కోవాలన్నా... ఎవరో ఒకరిని తీసుకుని వెళ్లాలి. ఫీజు కట్టడానికి నేరుగా మేం వెళ్లలేని స్థితి. ఎప్పుడైనా వెళ్తే... తెల్లారి నుంచే పిల్లలను ఎగతాళి చేయడం ప్రారంభం అవుతుంది.

- లైలా

కట్ట కవిత

ఆనందానికి ఆర్థిక సూత్రాలు

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు. కొత్త దంపతులు డబ్బుకు సంబంధించిన విషయాల గురించి కొన్నేళ్లపాటు పట్టించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఆధునిక కాలంలో పరిస్థితులు మారిపోయాయి. ఆదాయం, ఖర్చు, పొదుపు, పెట్టుబడి.. ఇలా సొమ్ముకు సంబంధించిన విషయం ఏదైనా కొత్త దంపతులే ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఒకరి వ్యక్తిగత అలవాట్లు మరొకరికి అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. ఆర్థిక అలవాట్ల గురించీ అంతే. ఆస్తులు, ఆదాయాలు, ఖర్చు పెట్టే విధానం, పొదుపు, పెట్టుబడి ఇలా ప్రతి విషయంలోనూ ఒక్కో వ్యక్తి అభిప్రాయం ఒక్కో తీరుగా ఉంటుంది. ముందుగా ప్రణాళికలు చేసుకుంటేనే భవిష్యత్‌లో బాగుంటారు.



దంపతులుగా మారబోయే ముందే ఎన్నో విషయాల్లో ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుంటున్నారు. కానీ డబ్బు విషయాలకు ప్రాధాన్యం ఇవ్వరు. డబ్బు మనిషి అనుకుంటారేమోనన్న భయంతో. కానీ 'డబ్బుకు సంబంధించిన అలవాట్ల గురించి ముందే తెలుసుకోవడం అవసరం' అంటున్నారు ఆర్థిక నిపుణులు. మున్ముందు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా సర్దుకుపోవడానికి ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఎవరి ఆర్థిక లక్ష్యాలు ఎలా ఉన్నాయో.. తెలుసుకోవడం వల్ల.. వారి లక్ష్యాన్ని చేరుకోవడానికి మీరు మీ వంతుగా సాయం చేయడానికి వీలవుతుంది.

పరిశీలన మంచిదే...

మీ జీవిత భాగస్వామి ఆర్థిక అలవాట్లను తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు ఇప్పుడు ఎంతో సులువుగా లభిస్తాయి. దీని ఆధారంగా అప్పులేమన్నా ఉన్నాయా? క్రెడిట్ కార్డును ఎలా వాడుతున్నారు? తీసుకున్న రుణాలను క్రమశిక్షణతో చెల్లిస్తున్నారా? తదితర అనేక వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. వీటిని పరిశీలించడం మంచిది. ఎందుకంటే అప్పటి వరకూ వచ్చిన ఆదాయాన్ని ఒక్కరే ఖర్చు చేస్తే ఇప్పుడు ఇద్దరి కోసం వ్యయం చేయాల్సి ఉంటుంది. పైగా అనుకోని ఖర్చులూ వస్తుంటాయి. భవిష్యత్‌లో పిల్లలు. ఇవన్నీ కూడా ద ష్టిలో పెట్టుకొని ఆర్థిక ప్రణాళిక ఉండాలి. లేకపోతే సంపాదించందంతా వృథా ఖర్చులకే ఎక్కువగా పోవచ్చు. సాధించాలనుకున్న లక్ష్యాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చు.

స్పష్టత రావాలి...

అమ్మాయిలకు షాపింగ్ అంటే ఇష్టం ఉండొచ్చు. అదే సమయంలో వారు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తారు. అబ్బాయిలకు ఈ విషయం అంతగా పట్టదు. కొన్నిసార్లు డబ్బు ఖర్చవుతుందని భావిస్తారు కూడా. కానీ, డబ్బును మాత్రం ఎలాంటి ప్రణాళికా లేకుండా వృథాగా ఖర్చు చేస్తారు. డబ్బు గురించి ఎవరు ఏం అనుకుంటున్నారో.. మీకు ఇద్దరికీ స్పష్టత రావాలి. డబ్బు కూడబెట్టాలంటే కొన్నిసార్లు త్యాగాలు చేయక తప్పదు. అప్పుడే భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం రాదు.

అత్యవసర నిధి...

పెళ్లయిన కొత్తలో ఇంట్లోకి కావాల్సినవి కొనడం, వినోదం తదితర అవసరాలకు సొమ్ము అధికంగానే ఖర్చవుతుంది. డబ్బు ఎప్పుడు ఎంత అవసరం అవుతుందో చెప్పలేం. అందుకే, కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధిగా బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. అనుకోని పరిస్థితుల్లో చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి, కొత్త దాన్ని వెతుక్కోవాల్సి రావచ్చు. ఇద్దరి సంపాదన ఒక్కరి సంపాదనగా మారొచ్చు. అలాంటప్పుడు ఈ నిధి ఆదుకుంటుంది.

బీమా అవసరం...

పెళ్లికి ముందు చాలామంది బీమా పాలసీల గురించి పట్టించుకోరు. కానీ, ఇప్పుడు ప్రాధాన్యం ఇవ్వాల్సిన మొదటి పని ఇద్దరూ సరైన మొత్తానికి బీమా తీసుకోవడం. తక్కువ మొత్తానికి ఎక్కువ రక్షణ కల్పించే టర్మ్ పాలసీని తీసుకోవడం తప్పనిసరి. జీవిత భాగస్వామి గృహిణి అయినా, ఆమె పేరుమీద కూడా తగిన బీమా పాలసీ తీసుకోవాలి. దీంతోపాటు ఆరోగ్య, వ్యక్తిగత ప్రమాద బీమా కూడా ముఖ్యమే. పిల్లలు పుట్టిన తర్వాత, తల్లిదండ్రులను కూడా పోషించాల్సిన బాధ్యత వచ్చినప్పుడు జీవిత బీమా మొత్తాన్ని పెంచుకోవాలి. ఇప్పుడు ప్రతి సంస్థ ఉద్యోగులకు ఆరోగ్య బీమా పాలసీ సౌకర్యాన్ని కల్పిస్తోంది. అయితే, దీనిమీదే పూర్తిగా ఆధారపడకుండా సొంతంగా మరో పాలసీ తీసుకోవడం మంచిది. వ్యక్తిగత ప్రమాద బీమా ఉండాలి. వివాహం కాగానే సాధ్యమైనంత వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలి. విదేశాలకు వెళ్లాలనుకుంటే వివాహ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అంతేకాకుండా భవిష్యత్తులో మీ పెట్టుబడులకు ఆస్తులకు, వారసత్వానికి సంబంధించి ఎలాంటి వివాదాలూ రాకుండా ఉంటాయి.

ఒక నిర్ణయానికి రావాలి...

ఇప్పటి వరకూ ఆదాయాలు, బ్యాంకు ఖాతాలు వేర్వేరుగా ఉంటాయి. వివాహ బంధంతో ఒక్కటైన తర్వాత వాటిని కలపాలా వద్దా అనేది చాలామందికి వచ్చే సందేహం. దీనికి కచ్చితంగా ఇలా చేయాలన్న నియమం ఏదీ లేదు. కాకపోతే దీనిగురించి కూడా దంపతులిద్దరూ ఒక అభిప్రాయానికి రావడం ముఖ్యం. ఎవరి ఆదాయాన్ని ఎలా ఖర్చు చేయాలి? ఎవరి సంపాదనను పొదుపు/మదుపులకు కేటాయించాలన్నది నిర్ణయించుకోవాలి. ఇంటి నిర్వహణ కోసం ఎవరెంత కేటాయించాలన్నది కూడా ముఖ్యమే. డబ్బును ఎవరు నిర్వహిస్తున్నా.. ఎప్పటికప్పుడు ఏం చేస్తున్నామన్న విషయాన్ని భాగస్వామికి చెప్పడం తప్పనిసరి. అనుకోని నష్టాలు ఎదురయినప్పుడు ఒకరిమీద ఒకరు నిష‌ఉ'రమాడటం ఎట్టి పరిస్థితుల్లోనూ తగదు. కొత్త ఇల్లు కొనడం.. విదేశీ విహార యాత్రలకు వెళ్లడం.. ఇవన్నీ కొత్త జంట కనే కలలు. వీటిని నిజం చేసుకోవడానికి ఇద్దరూ కలిసి ఒక నిర్ణయానికి రావాలి. దానికి తగ్గట్టుగా సొమ్ముకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలి. అందుకోసం ఎంత మొత్తం ప్రత్యేకించాలి అనేది తెలిస్తే.. దానిని బట్టి మీ ఖర్చులను తగ్గించుకోవడం లాంటి విషయాలపై దృష్టి పెట్టడానికి వీలవుతుంది. ❄

ఇట్లచేద్దాం

అటుకులను నీళ్ళలో పదినిమిషాలు నానపెట్టండి. ఆ తర్వాత పాలు మరిగించి అందులో అటుకులు, చక్కెర, డ్రైఫ్రూట్స్ వేస్తే చాలు, క్షణాల్లో కమ్మనైనా ఖీర్ రెడీ.

డల్‌గా కనిపిస్తున్నారా!

కొంతమంది ఎంత బాగా రెడీ అయిన సరే ముఖం డల్‌గా కనిపిస్తుంది. దీని కారణం చలి, ఆహారం అంటున్నారు నిపుణులు. ఇది సాధారణంగా అందరిలో కనిపించే లక్షణం. ముఖం డల్‌గా కనిపిస్తుందని వివిధ రకాల ప్రొడక్ట్సును వాడకూడదు. సహజమైన వాటిని ఉపయోగిస్తే చాలు ముఖం సౌందర్యంతో వెలిగిపోతుంది.



- ముఖాన్ని శుభ్రంగా కడిగి తేనెను అప్లై చేయాలి. ఇలా చేసిన పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇది చర్మానికి క్లీన్సర్‌లా పని చేస్తుంది. ఇలా శుభ్రం చేసుకున్న తర్వాత మాయిశ్చరైజర్ రాసుకుంటే ముఖం ప్రకాశవంతగా మెరుస్తుంది.
- ముఖం నిర్జీవంగా, పాలిపోయినట్టు కనిపిస్తే ఒక చెంచా ఓట్స్ పొడిలో ఒక చెంచా పెరుగు, సగం చెంచా తేనె కలిసి ముఖానికి రాసుకోవాలి. ఇలా పది నిమిషాలు పట్టించిన తర్వాత కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక చెంచా తేనెలో ఒక చెంచా గులాబీ నీటిని, కొద్దిగా పెరుగు కలుపుకొని ముఖానికి, మెడకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే ముఖం కాంతివంతంగా తయారవుతుంది.
- సగం చెంచా గ్రీన్ టీ పొడిలో మూడు చుక్కల ఆపిల్ సిడర్ వెనిగర్, నారింజ రసం కలుసుకొని ముఖానికి, మెడకు పట్టించాలి. ఇలా పది నిమిషాలు పట్టించిన తర్వాత చల్లటి నీటితో కడిగితే ముఖం తాజాగా, మృదువుగా తయారవుతుంది. ఇది చర్మానికి మంచి యాంటీ ఆక్సిడెంట్‌లా పని చేస్తుంది.
- జిడ్డు చర్మం ఉన్నవారు చలికాలంలో ఇలా చేస్తే సరిపోతుంది. టమాటా గుజ్జును ముఖానికి పట్టించాలి. ఇలా పది నిమిషాలు పట్టించి తర్వాత చల్లటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇది సహజ సిద్ధమైన స్క్రబ్ లా కనిపిస్తుంది. ❄

ముత్యాల ముగ్గులు

21 చుక్కలు
11వచ్చే వరకు
మధ్యచుక్క





రామిడి కోమలారెడ్డి
లక్ష్మారెడ్డి పల్లి





జి. నిఖిత
ఎస్.ఆర్.టి367,
సంతోష్ నగర్ హైదరాబాద్

23 చుక్కలు
12 వరకు మధ్యచుక్క


ఓ తెల్ల కాగితంపై ముగ్గు వేసి, చక్కటి రంగులతో నింపి మాకు పంపండి. ముగ్గు వేసే విధానం అర్థమయ్యేలా ఉండాలి. ముగ్గులోని చుక్కల సంఖ్య, ఇతర వివరాలను కూడా చేర్చండి. మీ పేరు, చిరునామాతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా జతచేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్: navamaanavi@gmail.com



ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో ఎల్వీ సుబ్రహ్మణ్యంపై కేసు కొట్టివేత



హైదరాబాద్ : ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టి వేసింది. ఏపీ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో ఆయన పని చేస్తున్నారు. మౌలిక సదుపాయల కల్పన సంస్థ ఎండీ ఉండగా ఎమ్మార్‌కు భూముల కేటాయింపుల్లో ఆయనపై పాత్రపై సీబీఐ దాఖలు చేసిన కేసులో ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి శివశంకర్‌రావు గురువారం తీర్పు చెప్పారు. భూ కేటాయింపుల్లో ఎండీగా ఆయన పాత్ర లేదని, ప్రభుత్వమే భూకేటాయింపులు జరిపిందని 170 పేజీల తీర్పులో హైకోర్టు పేర్కొంది. చాముండేశ్వరినాథ్‌కు విల్లా కేటాయింపునకు ఎల్వీ సిఫార్సు చేశారన్న అభియోగానికి కూడా ఆధారాలు లేవని పేర్కొంది. ఐఎఎస్ అధికారుల ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, రాష్ట్రం ఎలా అనుమతి ఇస్తుందని న్యాయమూర్తి ప్రశ్నించారు.

గవర్నర్‌తో కొత్త డీజీపీ భేటీ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం మాలకొండయ్య గురువారం హైదరాబాద్‌లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా డీజీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్యను గవర్నర్ అభినందించారు. గవర్నర్ కార్యాలయంలో జరిగిన భేటీలో వీరిరువురు పలు అంశాలపై చర్చించారని, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను డీజీపీ గవర్నర్‌కు వివరించారని సమాచారం.

నరసరావుపేట కేంద్రంగా కిడ్నీ రాకెట్ ?

నరసరావుపేట: గుంటూరు జిల్లా నరసరావుపేట కేంద్రంగా కిడ్నీల రాకెట్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. కొన్ని నెలలుగా జరుగుతున్న కిడ్నీల మార్పిడి వ్యాపారంలో సూత్రదారులు రాష్ట్ర బులియన్ మర్చంట్ అసొసియే షన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు కపిలవాయి విజయ్‌కుమార్ పాత్రధారిగా ఉన్నారు. బాధితులంతా తండాల్లోని గిరిజనులే. మారుమూల గ్రామాలు, తండాలలోని గిరిజనుల పేదరికం, నిరక్షరాస్యతే పెట్టుబడిగా వారి కిడ్నీలతో వ్యాపారం చేస్తూ కొంత మంది నాయకులు లక్షలు గడిస్తున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలోని కొందరు దళారులు, టీడీపీ నాయకులు ఇందులో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ దళారులకు రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు ఉన్నట్లు నేటి సంఘటనతో తేటతెల్లమైంది. ఇప్పటికే ముగ్గురి కిడ్నీలను మార్పిడి చేయగా మరో పేరుతో కిడ్నీ మార్పిడి విషయంలో పోలీసులు నకిలీ ధ్రువపత్రాల దళారుల ముఠా గుట్టు రట్టు చేశారు. జిల్లాలోని దుర్గి మండలం ముటుకూరు తండాకు చెందిన మూడావత్ వెంకటేశ్వరనాయక్‌కు సంబంధించిన కిడ్నీలు తొలగించి గుంటూరుకు చెందిన శివనాగేశ్వరరావుకు అమర్చేంచేందుకు పట్టణానికి చెందిన దళారి రావూరి రవి చౌదరి ఆసుపత్రి వైద్యులతో రూ.లక్షల్లో బేరం కుదుర్చు కున్నట్లు తెలిసింది. అయితే నిబంధనల ప్రకారం కిడ్నీలు దానంగా ఇచ్చే వ్యక్తి సంబంధిత రోగికి బంధువై ఉండాలి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించాలి. లేదా ఇతరులెవరైనా


నకిలీ ధృవపత్రాలతో ఆపరేషన్లు



దానం చేయాల్సి వస్తే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఆమోదం పొందాలి. గుంటూరులోని వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శివనాగేశ్వరరావుకు తాను బంధువునంటూ, తన కిడ్నీని ఆయనకు దానం ఇచ్చేందుకు ఫ్యామిలీ మెంబర్, రెసిడెన్సీ సర్టిఫికెట్ కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. అయితే ఈ అర్జీని స్థానిక బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్ స్వయంగా తహశీల్దార్‌తో ఫోనులో సంప్రదించి డ్రైవర్ ద్వారా అందజేసినట్లు తహశీల్దార్ విజయజ్యోతికుమారి మీడియాకు తెలిపారు. గుంటూరులోని వేదాంత ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ చింతా రామకృష్ణ కపిలవాయి విజయ్‌కుమార్‌కు స్వయాన అల్లుడు. ఇదిలా ఉండగా తహశీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ కోసం అందజేసిన అర్జీలోని ఆధార్ కార్డులో రావూరి రవిచౌదరి ఫొటోకు బదులు వెంకటేశ్వర్ల నాయక్ ఫొటోను మార్ఫింగ్ చేసి అందజేశారు. యథాతథంగా తహశీల్దార్ కార్యాలయం వారు ఆ సర్టిఫికెట్‌ను పరిశీలించినట్లు రికార్డుల్లో నమోదు చేసుకొని జారీ చేశారు. కిడ్నీ మార్పిడికి సంబంధించిన ఈ సర్టిఫికెట్లను పోలీ సులూ ధ్రువీకరించాల్సి ఉంది. రెవెన్యూ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా పనిచేయిం చుకున్న దళారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ధ్రువీకరణకు వెళ్లారు. పోలీసులు తమ వద్ద ఉన్న ఆధార్ బార్ కోడింగ్ యాప్‌లో దరఖాస్తుదారుని పేరు, చిరునామాలను పరిశీలించగా అది తప్పుడు ధ్రువీకరణని తేలింది. ఈ విషయాన్ని పోలీసులు తిరిగి తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించగా ఆత్మరక్షణలో పడ్డ తహశీల్దార్ విజయ జ్యోతికుమారి సదరు అర్జీదారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇప్పటికే నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో గుంటూరులోని వేదాంత ఆసుపత్రిలో ముగ్గురికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి వరుసగా సర్టిఫికెట్లు జారీ కావడం, వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కిడ్నీ రాకెట్‌తో వేదాంత హాస్పటల్‌కు సంబంధం లేదని ఎండీ డాక్టరు చింతా రామకృష్ణ తెలిపారు.

దేశం తిరోగమనం వైపు పయనిస్తోంది

- బళ్లారి రాఘవ ఉత్సవాల్లో సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ



అనంతపురం : నేటి పరిస్థితులు చూస్తే దేశం తిరోగమనం వైపు పయనిస్తోందని సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆందోళన వ్యక్తం చేశారు. బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక మూడో రోజు ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భరద్వాజ మాట్లాడుతూ దేశంలో నేటి పరిస్థితులు చూస్తే ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని చెప్పారు. ప్రజలను జాగురూకత చేసి వారిలో చైతన్యం నింపే బాధ్యత ప్రజాకళాకారులపై ఉందని సూచించారు. మరోమారు ప్రజానాట్యమండలి ద్వారా ప్రజాకళాకారులు నడుం బిగించి ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. సిఆర్‌డిఎ సంస్థ ప్రతినిధి సత్యబోస్ మాట్లాడుతూ 80వ దశకంలో జన నాట్యమండలి, ప్రజానాట్యమండలి తదితర పేర్లలో ప్రజా కళాకారులు ప్రజలను జాగృతం చేయడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న ఆఖరి రోజు ప్రదర్శనలు...

బళ్లారి రాఘవ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు చేపట్టిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన కళాకారులు ప్రభుత్వ పథకాల్లోని లోపాలను ఎత్తిచూసే నృత్యరూపం ఆకట్టుకుంది. వీటితోపాట కర్నూలు జిల్లా కళాకారులు 'ఏది నిజం' అనే వీధి నాటికను, నెల్లూరు జిల్లా కళాకారులు ఏ కులం నీది నాటిక ఆలోచింపజేసే విధంగా సాగింది.

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా కనకయ్య

- 30 మందితో నూతన కమిటీ



నవతెలంగాణ-భద్రాచలం

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా కార్యదర్శిగా అన్నవరపు కనకయ్య ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. భద్రాచలంలో రెండ్రోజుల పాటు జరిగిన పార్టీ జిల్లా మహా సభలో గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శి వర్గ సభ్యులుగా సున్నం రాజయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, యలమంచి రవికుమార్, గుగులోత్ ధర్మా, కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 22 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

గోవాలో టీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

- సంగారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది...
- మద్యం మత్తులో స్థానికులపై దాడి
- హత్యాయత్నం కింద కేసు నమోదు

నవతెలంగాణ - అమీన్‌పూర్

నూతన సంవత్సర సంబరాలు చేసుకునేందుకు గోవా వెళ్లిన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల టీఆర్ఎస్ నాయకులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి వారిపై దాడి చేసినట్టు ఫిర్యాదు అందడంతో అటెంప్ట్ మర్డర్ కింద పలు కేసులు నమోదు చేశారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలువురు తెలిపిన సమాచారం మేరకు... 15 మంది నాయకులు టీఆర్ఎస్ నూతన సంవత్సర వేడుకలను గోవాలో జరుపుకునేందుకు ఆదివారం వెళ్లారు. అక్కడ ఓ హోటల్‌లో బసచేశారు. వేడుకల్లో భాగంగా మద్యం తాగారు. ఆ సమయంలో వారు రాత్రి హోటల్ వద్ద వాహనం పార్క్ చేసే విషయంలో స్థానికులతో గొడవ పడ్డారు. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. అక్కడి వారు పోలీసులకు ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు దక్షిణ గోవాకు చెందిన రెమి రెబెల్లో అనే వ్యక్తి స్థానికేతరులు తమపై హత్యాయత్నం చేసినట్టు ఫిర్యాదు చేశాడు. దీంతో కె.దర్శన్, ఎ.శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ బదీరుద్దీన్, పురుషోత్తం రెడ్డి, నర్సింహారెడ్డి, ఎస్.అజయ్, డి.శ్రీనివాస్, సి.కృష్ణ, ఎం.కిరణ్, బి.ఆంజనేయులు, గోపాల్, దేవానంద్ అంజయ్య, బాలయ్యతోపాటు మొత్తం 15 మందిని అరెస్టు చేశారు. వీరిపై సెక్షన్ 143, 147, 148, 149, 323, 307 కింద కేసులు నమోదు చేశారు. వీరు తీసుకెళ్లిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగి 4 రోజులు కావస్తోంది. బెయిల్ కోసం జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

లైంగికదాడులు

- బాలికపై ఘటన సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ
- సోషల్ మీడియాలో అప్‌లోడ్
- మరోచోట యువతిపైనా...

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి/ జగిత్యాల

అడవికి కట్టెల కోసం వెళ్లిన బాలికపైనా, ఒంటరిగా వెళ్తున్న యువతిపైనా దుండగులు అటకాయించి లైంగిక దాడి చేశారు. బాలికపై ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ ఘటనలు గురువారం వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలో మార్కండేయ కాలనీకి చెందిన దళిత బాలిక(16) తల్లిదండ్రులతో కలిసి కూలీ పనులకు వెళ్లేది. డిసెంబర్ ఒకటో తేదీన మధ్యాహ్నం బాలిక సుల్తానాబాద్ పక్కనే ఉన్న కనుకగుట్టల వద్ద అడవికి కట్టెల కోసం వెళ్లింది. ఇదే మండలంలోని కదంబాపూర్ గ్రామానికి చెందిన పెద్ది నగేష్, బండి శ్రీనివాస్ బాలికను వెంబడించారు. అడవి లోపలికి వెళ్లాక మాయమాటతో ఆమెకు కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి తాగించారు. అనంతరం సామూహిక లైంగికదాడి చేశారు. ఆ ఘాతుకాన్ని వారి సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. ఆ తర్వాత విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బాలికను బెదిరించారు. ఆ వీడియోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఇంకా వారు బాధితురాలిని వేధిస్తుండటంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పిం ది. దీనిపై ఆ ఊరి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కానీ బాధితురాలికి న్యాయం జరగలేదు. దీంతో తల్లిదండ్రులు ఈనెల రెండో తేదీ రాత్రి సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సుల్తానాబాద్ పోలీసులు బాలికను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీడియోను పరిశీలిం చారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేశారు. నిర్భయ, గ్యాంగ్ రేప్, ఫొటో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు సుల్తా నాబాద్ సీఐ రాములు తెలిపారు. వారు పరారీలో ఉన్నట్టు చెప్పారు. ఏసీపీ హబీబ్‌ఖాన్ బాలిక ఇంటిని, ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువతిపై లైంగికదాడి

జగిత్యాల మండలం వెల్దుర్తి బాబాజీపల్లి గ్రామానికి చెందిన యువతి(22) బుధవారం తన స్నేహితురాలి వద్దకు బీడీలు చేసేందుకు వెళ్లింది. రాత్రి 10 గంటలకు తిరిగి వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన మేకల ప్రసాద్ ఆమెను బలవంతంగా నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి లాక్కెళ్లాడు. అక్కడ లైంగిక దాడి చేశాడు. గురువారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితున్ని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

వ్యవసాయం, విద్యుత్‌పై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : పొంగులేటి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ, విద్యుత్ సమస్యలపై చర్చించడానికి అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తిపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై మంత్రి జగదీష్‌రెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతు న్నారని చెప్పారు. వాస్తవాలను చెప్పితే అంత ఉలుకెందుకని ప్రశ్నించారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమాలను అడ్డుకుంటున్నారనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఐఏఎస్ అధికారులను బదిలీ కానుకగా ఇచ్చారని విమర్శించారు.

పట్టా భూములు ముట్టుకోవద్దు


- అధికారులను అడ్డుకున్న రైతులు
- వందల ఎకరాలున్నోళ్లు కన్పిస్తలేరా?
- రెండెకరాలున్న పేదోళ్ల భూములే కావాలా?
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓను నిలదీసిన రైతులు



అధికారులను అడ్డుకుంటున్న రైతులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

"ఏ కంపెనీ మా ఊరికి వద్దు... పట్టా భూములు ముట్టుకోవద్దు.. కాదని మా భూముల జోలికొస్తే కుటుంబ జీవనోపాధి కోసం ఆత్మహత్య చేసుకోవడానికైనా వెనుకాడం.. వందల ఎకరాలున్న పెద్దోళ్లు కనిపించడం లేదా..? చిన్న రైతులే కనిపిస్తున్నరా..?" అని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కప్పాడు గ్రామ రైతులు గురువారం అధికారులను అడ్డుకున్నారు. విమాన విడిభాగాల తయారీ కంపెనీ లేదా రైస్ హబ్ కంపెనీల కోసం వెల్మినేడుతోపాటు, కప్పాడులోని 166, 167, 170, 187 సర్వే నంబర్లలోని 281.05 ఎకరాల పట్టా భూములను పరిశీలించేందుకు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత, టీఎస్ఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ పద్మజా, ఆర్డీఓ మధుకర్‌రెడ్డి, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మాజిద్, మాణిక్యంతో కూడిన అధికారుల బృందం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో పట్టా భూముల్లోకి రావద్దంటే ఎందుకు వస్తున్నారని రైతులు అధికారులను నిలదీశారు. రైతుల సమ్మతి లేకుండా ఎలాంటి భూములు తీసుకోబోమని ఆర్డీఓ చెప్పడంతో.. తాము సమ్మతించనప్పుడు మరెందుకు వచ్చారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము భూములను ఇవ్వబోమని టీఎస్ఐఐసీకి, జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో గతంలోనే ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. అయినా ఎందుకు సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రామంలో వంద కుటుంబాలు సాగు చేసుకుంటున్న 300 ఎకరాలను సేకరిస్తే తమ బతుకులు ఏం కావాలని ఆందోళన వ్యక్తం చేశారు.



జీవనాధారం పోగొట్టొద్దు : రైతు శ్రీనివాస్‌రెడ్డి

జీవనాధారమైన భూములను తీసుకుని మా బతుకులను ఏం చేయాలనుకుంటున్నారు. పెద్దల భూములను కాపాడుతూ.. పేదల భూములను గుంజుకోవడమే అభివృద్ధా? వ్యవసాయ పొలాల్లో లక్షల రూపాయలు వెచ్చించి బోర్లు వేసుకున్నాం. సాగు చేసుకుంటున్నాం. ఇప్పుడు ఆ భూములను గుంజుకుంటే ఏం చేసి బతకాలి.



మా భూముల జోలికి రావొద్దు : రైతు యాదగిరిరెడ్డి

తాము ఈ భూములనే నమ్ముకుని ఉన్నం. పిల్లలకు ఈ భూములే చూపిస్తున్నం. లక్షల రూపాయలు వచ్చే ఉద్యోగాలు తమ పిల్లలకు లేవు. 600 ఎకరాల పట్టాదారుల భూములు తీసుకోకుండా మా భూముల జోలికి ఎందుకు వస్తుండ్రు? పట్టా భూములు తీసుకోబోమని చెప్పిన అధికారులు సర్వే పేరుతో మళ్లీ ఎందుకు వస్తుండ్రో అర్థమైతలేదు.

రైతుల సమ్మతితోనే భూసేకరణ : ఆర్డీఓ

రైతుల సమ్మతితోనే భూసేకరణ జరుగుతుందని ఆర్డీఓ మధుకర్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆందోళనచెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రాథమిక సర్వే మాత్రమే చేస్తున్నామన్నారు.

మహిళల ప్రవేశంపై నిషేధం లేదు

- రాజకుటుంబాల మహిళలు తరచుగా సందర్శించేవారు : శబరిమల దేవాలయంలోకి మహిళల ప్రవేశంపై కేరళ దేవాదాయశాఖ మంత్రి



తిరువనంతపురం: శబరిమల దేవాలయం లోకి మహిళలు ప్రవేశించటంపై నిషేధం లేదని, గతంలో మహిళలు, ప్రత్యేకంగా రాజకు టుంబా లకు చెందిన మహిళలు తరచు గా శబరి మల దేవాల యాన్ని సందర్శించేవారని కేరళ దేవాదా యశాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ చెప్పారు. శబరిమల దేవాలయం లోకి పది నుండి యాభై సంవత్సరాల వయసున్న మహిళల ప్రవేశాన్ని నిషేధించటం వివక్ష, రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందా అన్న అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్న సందర్భంలో దేవాదాయశాఖ మంత్రి ఈ ప్రకటన చేశారు. 1940లలో తనను ఒడిలో కూర్చోబెట్టుకుని తనతల్లి శబరిమల దేవాలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిందని తనకు చెప్పేవారని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సలహాదారుగా పనిచేసిన టి కె ఎ నాయర్ చెప్పారు. శబరిమలకు వచ్చే యాత్రికులకు సౌకర్యాలను సమకూర్చటం కోసం ఏర్పాటు చేసిన సలహా కమిటికి నాయర్‌ను గతవారం ఛైర్మన్‌గా నియమించారు.

కాంగ్రెస్‌కు విజ్ఞత లేదు



- మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా విషయంలో రైతులు విజ్ఞతగా ఉన్నారని, కాంగ్రెస్‌పార్టీనే విజ్ఞత కోల్పోయిందని విద్యుత్‌శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. 1104 విద్యుత్ కార్మికసంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారంనాడిక్కడి మింట్ కాంపౌండ్‌లో జరిగింది. టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకర రావు, టీఎస్ఎ స్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ గోపాల్‌రావు, 1104 యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మారెడ్డి, సాయిబాబు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలం గాణ వస్తే అసలు కరెంటే ఉండదని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేసినప్పుడు, ఇప్పటి పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నోటివెంట మాటలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ డిమాండ్ ఉదయం పూట 9,300 మెగావాట్లు, మధ్యాహ్నానికి 8వేల మెగావాట్లుకు తగ్గుతున్న విషయాన్ని కాంగ్రెస్‌నేతలు గుర్తించాలని చెప్పారు.

ఎంప్లాయీస్ యూనియన్ క్యాలండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 2018 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆ సంఘం గౌరవాధ్యక్షులు టి నరసింహన్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోటారు వాహన చట్టం సవరణ బిల్లును పార్లమెంటులో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లును నిరసిస్తూ శుక్రవారంనాడు అన్ని డిపోల వద్ద భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ జరగకపోవడానికి గుర్తింపు కార్మికసంఘం టీఎమ్‌యూ అసమర్థతే కారణమని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ డైరీ, కేలండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఖైరతాబాద్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జె శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వై కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంఘం ఆవిర్భవించి 70 వసంతాలు పూర్తి చేసుకుందని చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయు హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావు కమిటీ సిఫారసులను తిరస్కరించాలి: టీపీఏ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు బడుల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ చేసిన సిఫారసులను ప్రభుత్వం తిరస్కరించాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం కోరింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగటి నారాయణ, రాముగౌడ్, కోశాధికారి లక్ష్మీప్రియా, ప్రతినిధులు ప్రసాద్‌గౌడ్, అజయ్‌బాబుల బృందం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆచార్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ...ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఖర్చుల ఆధారంగా మూడేండ్లసారి ఫీజులు నిర్ణయించే పద్ధతి పాటించాలని సూచించారు.

'ప్రయివేటు' టీచర్లకు కనీస వేతనాలివ్వాలి: టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బందికి కనీస వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రయివేటు టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షబ్బీర్‌అలీ నేతృత్వంలో టీచర్లు మంత్రి నాయినీ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ లాంటివి యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఆ సంఘం నేతలు తెలిపారు.



మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం

మహిళల పదవులతో 'పతుల' పాలన

- మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తలదే పెత్తనం
- సాంఘిక, ఆర్థికాభివృద్ధితోనే మహిళా సాధికారత

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం

నవతెలంగాణ- వికారాబాద్ రూరల్

రాష్ట్రంలో మహిళా ప్రజాప్రతినిధుల పదవుల్లో భర్తలు జోక్యం చేసుకొని పాలన సాగిస్తున్నారని తెలంగాణ మహిళా కమిషన్ అధ్యక్షురాలు త్రిపురాన వెంకటరత్నం అన్నారు. 'మహిళలు-చట్టాలు' అంశంపై గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు స్థానిక సంస్థల్లో గెలుపొందిన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తలు కూర్చొని రాజకీయంగా పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు. ఫలితంగా మహిళలు రాజకీయంగా వెనుకబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు సాంఘిక, ఆర్థిక రాజకీయంగా అభివృద్ధి చెందినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉన్నా వారు పూర్తి స్వేచ్ఛతో పాలనను కొనసాగించలేక పోతున్నారని అన్నారు. వికారాబాద్ జిల్లాలో వెనుకబడిన బషీరాబాద్, పెద్దేముల్, కుల్కచర్ల, పరిగి, గండీడ్ వంటి మండలాల్లో ఇప్పటికీ శిశు విక్రయాలు సాగుతున్నాయన్నారు. శిశు విక్రయాలు, బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమచారం ఇచ్చినా పోలీస్ శాఖ సకాలంలో స్పందించని కారణంగా ఇలాంటి ఘటనలు ఇంకా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ముందుస్తు పెట్టుబడితో రైతులకు ఎంతో ప్రయోజనం

- మహిళా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి పోచారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

24 గంటల నిరంతర విద్యుత్, ముందుస్తు పెట్టుబడి ఎకరాకు నాలుగువేలు, ప్రాజెక్టుల ద్వారా కోటి ఎకరాలకు సాగునీరు, నాణ్యమైన విత్తనాల సరఫరాతో వ్యవసాయ శాఖకు ఎంతో ప్రాధాన్యత పెరిగిందని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం సచివాలయంలో తన చాంబర్‌లో వ్యవసాయ శాఖ పలు విభాగాలకు చెందిన క్యాలెండర్లు, డైరీలను ఆయన ఆవిష్కరించారు. రైతులు అప్పుల బారిన పడకుండా గౌరవంతో సంతోషంగా బతకడానికి ముందుస్తు పెట్టుబడి అందిస్తున్నట్టు తెలిపారు. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారధి, కమిషనర్ జగన్మోహన్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, విత్తన ధృవీకరణ ఏజెన్సీ డైరెక్టర్ కేశవులు పాల్గొన్నారు.

17న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

- వెట్టిచాకిరీ చేయిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలి: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమ



నవతెలంగాణ- సిద్దిపేట టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి 17న దేశవ్యాప్త సమ్మె తలపెట్టినట్టు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ తెలిపారు. ప్రభుత్వాలు వారిచేత వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. వారికి కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీంలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన, సాక్షరభారత్, ఐకేపీ, కస్తూర్బా, సెర్ప్, మెప్మా, 104, 108 తదితర ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందే కొద్దిపాటి సేవలనూ మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ.. పేదల సంక్షేమ పథకాలను మాత్రం నిర్వీర్యం చేయాలని చూస్తున్న ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా స్కీం వర్కర్లందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రం ఒక వైపు స్కీంలకు బడ్జెట్‌లో కోతలు పెట్టడంతోపాటు స్వచ్ఛంద సంస్థలైన అక్షయపాత్ర, ఇస్కాన్ సంస్థలకు పనులు అప్పగించడం సరికాదన్నారు. స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రేవంత్‌కుమార్, అధ్యక్షులు గోపాలస్వామి, నాయకులు హేమలత, నాగరాజు, రాములు, భాస్కర్ పాల్గొన్నారు.

ట్రంప్ అసమర్థుడు



అమెరికా అధ్యక్షుడి పాలనలో అవినీతి : వైట్‌హౌస్ మాజీ ఉద్యోగి స్టీవ్ బన్నోన్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసమర్థుడంటూ వైట్‌హౌస్ మాజీ ఉద్యోగి స్టీవ్ బన్నోన్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. ట్రంప్ పాలనపై బన్నోన్ రచించిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ : ఇన్‌సైడ్ ద ట్రంప్ వైట్‌హౌస్' పుస్తకం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అధ్యక్షభవన సమాచారాన్ని ట్రంప్ బహిర్గతం చేశారంటూ బన్నోన్ విమర్శించారు. ట్రంప్ పాలనలో భారీ అవినీతి జరుగుతోందని, ఆయనది అసమర్థత పాలన అంటూ ఫైర్ అండ్ ఫ్యూరీ పుసక్తంలో బన్నోన్ విమర్శించారు.

ఫైర్ అండ్ ఫ్యూరీలోని వివరాల ప్రకారం...అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో రష్యా న్యాయవాదితో ట్రంప్ తనయుడు జూనియర్ ట్రంప్ భేటీ అయ్యారని.. అది ముమ్మాటికీ దేశవ్యతిరేక చర్యేనని బన్నోన్ అందులో పేర్కొన్నారు. ఈ విషయమై ప్రతిపక్ష నేతలు, బిలియనీర్లు ట్రంప్‌ను నిలదీసినప్పుడు ట్రంప్ స్పందించారని అన్నారు.

బన్నోన్ వ్యాఖ్యలను ట్రంప్ తాజాగా ఖండించారు. 'స్టీవ్ బన్నోన్ నన్ను, నా అధ్యక్ష పదవిని ఏం చేయలేడు. అతడు ఉద్యోగం మాత్రమే కాదు.. మతిని కూడా పోగొట్టుకున్నాడు. అతన్ని పట్టించుకోకండి. వాడొక పిచ్చోడు' అంటూ ట్రంప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెన్నోన్ రచించిన ఫైర్ అండ్ ఫ్యూరిని మైకేల్ వోల్ఫ్ అనే జర్నలిస్ట్ ప్రకటించారు.

ఈ పుసక్తంలో ట్రంప్ నోటి నుంచి వచ్చిన కొన్ని సంచలన వ్యాఖ్యలను ఆర్టికల్స్ రూపంలో ప్రచురిస్తామని అన్నారు. బెన్నోన్‌పై మనీలాండరింగ్ ఆరోపణలు రావటంతో గత ఆగస్టులో ఆయనను పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన ఎఫ్‌బీఐ నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు.

బన్నోన్‌పై చట్టపరమైన చర్యలు : బన్నోన్‌పై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రంప్ తరుపు న్యాయవాది హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడి ప్రతిష్టను దిగజార్చాలనే లక్ష్యంతో ఆయన ఈ పుస్తకాన్ని ముద్రించారని విమర్శించారు. బన్నోన్‌పై పరువు నష్టందావా వేస్తామని అన్నారు.



ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌కు మద్దతుగా కిమ్ -2 సంగ్ స్క్వేర్ ప్రాంతం వద్ద పార్టీ కార్యకర్తలు, మద్దతు దారులు భారీ ర్యాలీ తీశారు. 'కిమ్.. లాంగ్ లీవ్ కామ్రేడ్' అంటూ ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు.

అక్రమ వలసదారులకు 25 ఏండ్ల జైలు

కైరో: ఈజిప్టులో సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రవేశించిన ఐదుగురు అక్రమ వలసదారులకు అలెగ్జాండ్రియా క్రిమినల్ కోర్టు 25ఏండ్ల జైలుశిక్ష విధించింది. మరో నలుగురికి నాలుగేండ్ల శిక్ష విధించింది. పడవ యజమానికి మూడేండ్ల శిక్షతో పాటు 92,400 డాలర్లు (రూ. 58,59,957) జరిమానా విధించింది. దేశ భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఈ తీర్పు వెల్లడించినట్టు న్యాయమూర్తి తెలిపారు. కాగా, ఇటీవలి కాలంలో ఈజిప్టులో అక్రమ వలసదారుల సంఖ్య పెరిగిపోయింది. మధ్యధరా సముద్రం గుండా లిబియా నుంచి ఐరోపా దేశాలకు తరలివెళ్తున్న వలసదారులు ఈజిప్టులోకి ప్రవేశిస్తున్నారు. అక్రమ వలసదారులను కట్టడిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఈజిప్టు విదేశాంగ మంత్రి సమే శౌక్రీ పేర్కొన్నారు.

బ్రిటన్ వైదొలిగినా పుంజుకుంటాం

- ఫెడరికా మోగెరినీ



హవానా : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగినా తామంతా పుంజుకోగలమని ఈయూ విదేశాంగ విధానాల ప్రతినిధి ఫెడరికా మోగెరినీ ధీమా వ్యక్తం చేశారు. క్యూబా పర్యటనలో ఉన్న మోగెరినీ స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈయూ నుంచి బ్రిటన్ విడిపోయినా (బ్రెగ్జిట్) యూరోపియన్ యూనియన్ బలోపేతం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రెగ్జిట్ నేపథ్యంలో ఈయూ బలోపేతం కావాలని ప్రపంచ దేశాలన్నీ ఆకాంక్షిస్తున్నాయని అన్నారు. ఈయూను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలన్నీ చేపడతామన్నారు. 2016, జూన్‌లో ఈయూ నుంచి బ్రిటన్ వైదొలిగిన సంగతి తెలిసిందే. ఈయూ నుంచి విడిపోవాలని 52శాతం మంది పౌరులు ఓటు నమోదు చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించి బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్ తన పదవికి రాజీనామా చేశారు. 2019నాటికి బ్రెగ్జిట్ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రస్తుత బ్రిటన్ ప్రధాని థెరిసా మే ప్రకటించిన సంగతి తెలిసిందే.

వెనీస్ ప్యాలెస్ నుంచి భారత ఆభరణాల చోరీ

రోమ్ : ఇటలీలోని వెనీస్ ప్యాలెస్‌లో ప్రదర్శనకు ఉంచిన విలువైన భారత ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అపహరణకు గురైన ఆభరణాల్లో నెక్లెస్‌తో పాటు మొఘల్స్ కాలంనాటి విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. వీటి విలువ బిలియన్స్ యూరోస్ ఉంటుందని ఎగ్జిబీషన్ నిర్వాహకులు తెలిపారు. ఇటలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌టీ మార్క్ స్క్వేర్‌లో అల్‌థానీ కలెక్షన్స్ సంస్థ నిర్వహించిన ప్రదర్శనలో భారీ చోరీ జరిగింది. ఈ ప్రదర్శన చివరిరోజున సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఇదే అదనుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడి పారిపోయారు. కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నట్టు వెనీస్ ఎస్పీ వీటో గాగ్లియార్డీ తెలిపారు. వెనీస్ ప్యాలెస్ పరిసర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశామని అన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు.

దక్షిణ ఆఫ్రికాలో ఘోర రైలు ప్రమాదం

- 14 మంది మృతి, 268 మందికి గాయాలు



ప్రిటోరియా: దక్షిణ ఆఫ్రికాలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. దాదాపు 268 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవ కాశ ముంది. రవాణా మంత్రి జో మాస్వాం గనీ తెలి పిన వివరాల ప్రకారం...పోర్ట్ ఎలిజబెత్ నుంచి జోనెస్‌బర్గ్‌కు బయలుదేరిన ప్యాసింజర్ రైలు ప్రమాదానికి గురైంది. లెవల్‌క్రాసింగ్ వద్ద ఓ లారీ, కారు పట్టాలపైకి వచ్చాయి. దీంతో, అప్రమత్తమైన ట్రైన్ డ్రైవర్ సడన్ బ్రేక్స్ వేశారు. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

ఇరాన్‌లో ముగ్గురు సైనికాధికారులు మృతి

టెహ్రాన్ : ఇరాన్‌లోని పిరాన్‌షహర్ నగరంలో తిరుగుబాటుదారులు జరిపిన మెరుపుదాడిలో ముగ్గురు సైనికాధికారులు మృతి చెందారు. ఇరాన్ ఆర్మీ తెలిపిన వివరాల ప్రకారం....తిరుగుబాటుదారులు పిరాన్‌షహర్ ప్రాంతంలోకి చొరబడి సైనికులపై కాల్పులకు తెగబడ్డారు. తిరుగుబాటుదారులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు సైనికులు చనిపోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. ఓ ఉగ్రవాదిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సైనికాధికారులు తెలిపారు.

' తప్పుడు వార్తలను అరికట్టేందుకు చట్టం '

పారిస్: తప్పుడు వార్తలను అరికట్టేందుకు కొత్త చట్టాన్ని రూపొందించాలని యోచిస్తున్నట్టు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రన్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పలు మీడియా సంస్థలు అసత్య కథనాలు ప్రసారం చేస్తున్నాయని ఆరోపించారు. తప్పుడు వార్తలను కట్టడిచేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ఎలీస్ ప్యాలెస్ ప్రాంగణంలో మీడియాతో మాక్రన్ మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే లక్ష్యంతో నూతన బిల్లు రూపొందించనున్నామని అన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే తప్పుడు వార్తా ప్రసారాలపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ చేపట్టేందుకు వీలుంటుందన్నారు.

అమెరికా గజగజ..



వాషింగ్టన్: అమెరికా గజగజ వణికిపోతోంది. దేశంలోని వివిధ ప్రాంతాలు దట్టంగా కురిసిన మంచుతో నిండిపోయాయి. మరోవైపు గురువారం మంచు తుపాను విరుచుకుపడుతుందన్న హెచ్చరికతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 'బాంబ్ తుఫాను'గా వ్యవహరిస్తున్న ఈ తుపానుతో అమెరికా ఈశాన్య ప్రాంతంలో 6 నుంచి 12 అంగుళాల మేర మంచు పడుతుందని, గంటకు 64 నుంచి 96 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం (ఎన్‌డబ్ల్యూఎస్) పేర్కొంది. ప్రస్తుతం అమెరికాలోని సగ భాగం పూర్తిగా మంచు దుప్పట్లోనే ఉంది. ధృవప్రాంతమైన అంటార్కిటికా కంటే కూడా చల్లటి వాతావరణ అమెరికా నగరాలలో నెలకొంది. న్యూయార్క్‌లో ఉష్ణోగ్రత మైనస్ 35 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అంటార్కిటికాలో ఇది మైనస్ 16 డిగ్రీలే కావడం గమనార్హం.

మోడీకి స్పెషల్ గిఫ్ట్ ఇవ్వనున్న నెతన్యాహూ



జెరూసలేం : తన స్నేహితుడు ప్రధాని నరేంద్రమోడీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఒక ప్రత్యేకమైన బహుమతి ఇవ్వనున్నారు. త్వరలో ఆయన భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఆ విలువైన గిఫ్ట్‌ను మోడీకి అందించనున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల (జనవరి) 14న నెతన్యాహూ పర్యటన ప్రారంభం కానుంది. ఆ రోజే మోడీకి గాల్ మొబైల్ వాటర్ డిసాలినైజేషన్-ప్యూరిఫైడ్ జీప్‌ను అందిస్తారు. ఈ జీప్‌నకు ఓ ప్రత్యేకత ఉంది. గత ఏడాది (2017) జులై నెలలో మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు వారిద్దరు కలిసి ఈ జీపులోనే సముద్రపు తీరంలో షికారు చేశారు. దీంతో వారి స్నేహానికి గుర్తుగా ఆయన మోడీకి ఆ జీపునే బహుమతిగా ఇవ్వనున్నారు. ఈ జీపు ఖరీదు దాదాపు లక్షా పదకొండువేల డాలర్లు ఉంటుందని అంచనా. సముద్రపు నీటిని శుద్ధిపరిచే సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు ఇజ్రాయెల్ అందించేలా ఒప్పందం అయిన విషయం తెలిసిందే. దీనికి గుర్తుగానే ఓల్గా బీచ్‌లో మోడీ, నెతన్యాహూ కలిసి సముద్రపు నీటిని శుద్ధి పరిచే జీపులో కాసేపు సరదాగా గడిపారు.

ఆఫ్ఘన్‌లో ఆత్మాహుతి దాడిలో 20 మంది మృతి

అమెరికా రాయబారి కార్యాలయం సమీపంలో..

కాబుల్.ఆఫ్ఘన్‌లోని కాబూల్ జరిగిన ఆత్మాహుతి దాడిలో 20 మంది చనిపోగా,పలువురికి తీవ్రగాయాలయ్యాయి. కాబుల్‌లోని బనోఈ ప్రాంతంలో అమెరికా రాయబారి కార్యాలయానికి సమీపంలో ఈ దాడి జరిగింది. ఆఫ్ఘన్ హెూం శాఖ అధికారి నజీబ్ దానియా మాట్లాడుతూ..ఆత్మాహుతి దాడిలో 20 మంది చనిపోయారని వెల్లడించారు.భద్రతా వద్దకు వెళ్లి మరీ ఆత్మాహుతి దళ సభ్యుడు అమర్చుకున్న బాంబులను పేల్చుకున్నట్టు గుర్తించారు. పేలుడు శబ్దం చాలా దూరం వరకు వినిపించిందని స్థానికులు తెలిపారు. చనిపోయిన వారిలో ఎక్కువగా పోలీసులే ఉన్నారని భద్రతదళాలు తెలిపాయి..

ఎస్సీ వర్గీకరణను సర్కారే సాధించాలి

మోత్కుపల్లి, సంపత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీవర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకపోవడంతోపాటు వర్గీకరణను కూడా రాష్ట్ర ప్రభుత్వమే సాధించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. మందకృష్ణను జైల్లో పెట్టడమంటే మాదిగలను జైల్లో పెట్టడమేనన్నారు. వర్గీకరణపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ ఆవరణలోని మీడియాపాయింట్‌లో ఇంటిపార్టీ రాష్ట్ర నాయకులు యెన్నం శ్రీనివాసరెడ్డితో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరితే మందకృష్ణను అరెస్టు చేసిన జైల్లో పెడతారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మాదిగలను కేసీఆర్ అణచివేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి శాశ్వతం కాదని, ఇప్పటికైనా కేసీఆర్ వైఖరి మార్చుకొకపోతే ప్రభుత్వం కూలిపోతుందని హెచ్చరించారు. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లడం కాదని, వర్గీకరణను సాధించుకుని రావాలని సూచించారు. టీఆర్ఎస్ దళిత వ్యతిరేక ప్రభుత్వమని, మందకృష్ణపై సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఆయన దీక్ష చేస్తే ప్రభుత్వం అప్రజాస్వామికంగా అరెస్టు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలు నిన్ను గద్దెదించుతారని హెచ్చరించారు. కేసీఆర్ రాజకీయంగా అంతం చేసి మాదిగ వర్గీకరణను సాధించుకుంటామన్నారు. తెలంగాణ ఇంటిపార్టీ నేత యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తమ పార్టీ మందకష్ణ అరెస్టును ఖండిస్తుందన్నారు. కేసీఆర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మాదిగల డిమాండ్ న్యాయమైంది అసెంబ్లీ తీర్మానం చేసిన కేసీఆర్ చేతులు దులుపుకోకుండా వర్గీకరణ సాధించాలని డిమాండ్ చేశారు.

వెంకట్రామ్‌రెడ్డికి చట్ట విరుద్ధంగా ప్రమోషన్

- కొనగాల మహేశ్
- కేసీఆర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉద్యాన వన శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ వెంకట్రామ్‌రెడ్డి పదవీ విరమణ చేసినప్పటికీ ఆయనకు చట్ట విరుద్ధంగా డైరెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చి సెరికల్చర్ శాఖను అప్పగించారని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ ఆరోపించారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వియ్యంకుడు కావడం వల్లే ఆయనకు ప్రమోషన్ ఇచ్చారని విమర్శించారు. చట్ట విరుద్ధంగా ప్రమోషన్ కట్టబెట్టిన ఈటలను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవీ విరమణ రోజే ప్రభుత్వ పెద్దలు ఉత్సాహంతో డైరెక్టర్‌గా ప్రమోషన్ ఇవ్వటమే కాక, హార్టికల్చర్‌కు అదనంగా సెరికల్చర్ విభాగానికి అధిపతిగా నియమించడంతో పాటు మూడేండ్లు సర్వీస్ పొడగించారని విమర్శించారు. నాబార్డు నిధులు స్వాహా చేయటానికే ఈటెల, వెంకట్రామిరెడ్డి కలిసి ఈ నాటకానికి తెర లేపారని, దీనిపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసుల్లో కొనసాగించకూడదని ఆర్థిక శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ తన వియ్యంకుని కోసం తన శాఖ ఆదేశాలను పక్కన పెట్టి ఈటల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. కేసీఆర్‌కు నచ్చితే ప్రమోషన్... నచ్చకపోతే డిమోషన్ ఇస్తున్నారన్నారు. తెలంగాణలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కేసీఆర్‌కు పట్టదన్నారు. అడగనోనికి సిగ్గు లేకపోయినా...జీవో ఇచ్చిన వాళ్ళకైనా సిగ్గుండాలి కాదా? అని ప్రశ్నించారు. ఇదంతా జరుగుతుంటే గవర్నర్ ఏం చేస్తున్నారన్నారు.

చివరి భూములకు నీరందించకపోతే దీక్షలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- ఎస్ఈ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

ఆయకట్టు చివరి భూములకు నీరందించకపోతే రైతులను సమీకరించి దీక్షలు చేపడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎడమకాల్వ పరిధిలో చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపి చివరి భూములకు నీరందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎన్నెస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు రెండు విడతలుగా సాగునీరు విడుదల చేసినా 40 శాతం చివరి భూములకు అందడం లేదన్నారు. నార్లు ముదిరిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. ముల్కలకాల్వ, వజీరాబాద్, రాజవరం, ముదిమాణిక్యం మేజర్ల పరిధిలో చివరి భూముల రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అధికారులు మేజర్లకు నీరందే విధంగా పర్యవేక్షించాలని కోరారు. రెండో విడత నీటి విడుదలను ఈనెల 26 వరకు పొడిగించినట్టయితే చివరి భూములకు అందే అవకాశముంటుందన్నారు. అనంతరం ఎన్నెస్పీ సీఈ సునీల్‌తో ఫోన్లో మాట్లాడారు. నీటి విడుదల పొడిగింపు విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఈ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కలిసి రండి సత్తా చాటుదాం..

ఈ నెల 6, 7 తేదీలల్లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

- రాష్ట్ర 2వ మహాసభలు
- 6న ర్యాలీ, బహిరంగసభ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభలు ఈ నెల 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో కామ్రేడ్ తిరందాస్ నగర్‌లో జరగనున్నాయి. మొదటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు గొల్కొండ క్రాస్‌రోడ్ నుంచి ఎస్‌వీకే పార్కు వరకు భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతున్నది. ఈ సభకు టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సాయిబాబు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ రమ తదితరులు పాల్గొంటారు. మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున్న తరలి రావాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కమర్ అలీ, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్రంలో రెండు గ్రేటర్ కార్పొరేషన్లు, 43 మున్సిపాల్టీలు, 22 నగర పంచాయతీల్లో 45వేల మంది కాంట్రాక్టు పద్ధతుల్లో పని చేస్తున్నారని పేర్కొన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు కూడా పని చేస్తున్నారని తెలిపారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యం రాష్ట్రాన్ని శుభ్రపర్చుతూ స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను జయప్రదం చేయడంతో కీలకపాత్ర పోషిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థ రద్దు అవుతుందని, కాంట్రాక్టు పద్ధతుల్లో పని చేస్తున్న కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు పర్మినెంట్ అవుతారని చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఈ ప్రభుత్వం పట్ల ఎన్నో ఆశలతో ఉన్న కార్మికులకు మూడున్నరేండ్లలో నిరాశే మిగిలిందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచామని 2015 జూలై, ఆగస్టు నెలల్లో 40 రోజులు సమ్మె చేశారన్నారు. సమస్యల్ని పరిష్కారించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసి, నిర్బంధం ప్రయోగించిందన్నారు. సమ్మెను బలహీనపర్చడానికి కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే వేతనాలు పెంచిందన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న వారికి ఇంత వరకు వేతనాలు పెంచకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి పోరాట కార్యచరణను ప్రకటించబోతున్నట్టు వారు పేర్కొన్నారు.

సహకార ఎన్నికలపై స్పష్టమైన ప్రకటన చేయండి

- సీఎంకు చాడ లేఖ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సహకార సంఘాల ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. వాటిని ఎందుకు వాయిదా వేయాలనుకుంటున్నారో చెప్పాలంటూ ప్రశ్నించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం లేఖ రాశారు. ఫిబ్రవరి నాలుగు నాటికి సింగిల్ విండో సంస్థల పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది. వీటి ఎన్నికల నిర్వహణపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి స్పష్టత వెలువడలేదు. పత్రికల్లో మాత్రం సహకార ఎన్నికలు వాయిదా పడుతున్నాయనే విధంగా లీకేజీ వార్తలు వచ్చాయి. సహకార వ్యవస్థ ప్రజల ఆర్థిక పునాదులకు బాటలు వేసింది. కానీ సహకార రంగంలో రాజకీయాల జోక్యం వల్ల వ్యవస్థ కలుషితమై పోయింది. తెలంగాణ ప్రభుత్వం సహకార రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతుందని మేం భావించాం. కానీ అలాంటి ఆలోచనలకు ప్రభుత్వం తిలోదకాలు ఇస్తున్నది. గత ప్రభుత్వం లాగానే టీఆర్ఎస్ కూడా సహకార ఎన్నికలను వాయిదా వేయడం అన్యాయమని చాడ తన లేఖలో పేర్కొన్నారు.

నవచిత్రం

ప్రేమకు, అభిమానానికి ధన్యవాదాలు

- పవన్‌కళ్యాణ్



కీర్తి సురేష్, పవన్‌కళ్యాణ్, అను ఇమ్మాన్యుయేల్

'నాపై ప్రవాస భారతీయులు చూపిస్తున్న ప్రేమకు, అభిమానానికి శిరస్సు వంచి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నా' అని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'అజ్ఞాతవాసి'. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రంలో పవన్ సరసన కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలుగా నటించారు. ఇందులో పవన్ పాడిన 'కొడకా కోటేశ్వరరావు' అనే పాటకు మంచి స్పందన లభిస్తోంది. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ఓవర్సీస్‌లో అత్యధిక థియేటర్లలో తొలి భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ప్రవాస భారతీయులను ఉద్దేశించి స్పెషల్ వీడియో క్లిప్‌లోమాట్లాడుతూ, 'ప్రవాస తెలుగువారందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఉన్న ఊరిని వదిలి పక్క ఊరికి వెళ్ళి పనిచేయడం ఎంతో కష్టం. అలాంటిది రాష్ట్రాన్ని, దేశాన్ని వదిలి, దేశం కాని దేశంలో చదువుకోవడం, అక్కడ పనిచేయడం చాలా కష్టం. ఆత్మ గౌరవం దెబ్బతినకుండా అక్కడ ఓ జీవితాన్ని ఏర్పర్చుకోవడం, స్థానికతను సంపాదించడం ఎంత కష్టమో నాకూ తెలుసు. అందుకే మీరంటే నాకు గౌరవం. మీరెక్కడున్నా మీ వెనుక మీతో పాటే నేనున్నా. అక్కడ మీకు చిన్న సమస్య వచ్చినా ఇక్కడ కోట్ల గొంతులు మీకు అండగా నిలుస్తాయి. 18ఏండ్ల క్రితం 'బద్రి' సినిమా అమెరికాలోని కొద్ది సెంటర్లలో విడుదలైతే అదో పెద్ద విజయంగా చెప్పారు. అలాంటిదిప్పుడు 'అజ్ఞాతవాసి' చిత్రానికి ఏ భారతీయ చలన చిత్రానికి ఇవ్వనంత భారీ విడుదల ఇస్తున్నందుకు నాకు నిజంగా ఆశ్చర్యంగా, సంతోషంగానూ ఉంది' అని అన్నారు. మన దేశంలో కంటే ఒక్క రోజు ముందుగా ఈనెల 9న ఈ చిత్రాన్ని అమెరికాలోని 209 ప్రాంతాల్లో విడుదల చేయబోతున్నారు.

మాలోనే దొంగలున్నారు..



సి.కళ్యాణ్

'థియేటర్‌లో సినిమా ప్రదర్శనకు సంబంధించిన క్యూబ్, యుఎఫ్‌ఓల విషయంలో నిర్మాతలను దోచుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మాలోనే దొంగలున్నారు' అని అంటున్నారు నిర్మాత సి.కళ్యాణ్. బాలకృష్ణ, నయనతార, హరిప్రియ, నటాషా జోషి ప్రధాన తారాగణంగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో 'జై సింహా' చిత్రాన్ని సి.కళ్యాణ్ నిర్మించారు. ఈ నెల 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ గురువారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఆ నలుగురు కీలకం..

బాలకృష్ణ హీరోగా కె.ఎస్.రవికుమార్‌తో సినిమా చేద్దామనుకున్నప్పుడు ముందు మరో కథ అనుకున్నాం. ఇందులో బాలకృష్ణ పాత్ర నెగటివ్ షేడ్‌లో ఉంటుంది. ఆయన్ని అలా చూడటం ఇష్టం లేక కథలో మార్పులు చేశాం. ఇందులో ప్రకాష్‌రాజ్, నయనతార పాత్రలు కీలకం. వారు నటిస్తేనే ఈ సినిమా చేద్దామనుకున్నాం. ప్రకాష్‌రాజ్ కాల్షీట్లు ఖాళీ లేకపోయినప్పటికీ ఫోన్‌లో కథ విని రాత్రికి రాత్రి వచ్చేశారు. అలాగే హీరోయిన్ పాత్ర కోసం అనుష్క, నయనతార అనుకున్నాం. అనుష్క బిజీగా ఉన్నారు. నయనతార ముందు చేయనన్నారు. కథ విన్నాక ఓకే చెప్పారు. విలన్ పాత్రకు తొలుత రాజశేఖర్, శ్రీకాంత్ అనుకున్నప్పటికీ ఫైనల్‌గా పంజాబీ నటుడ్ని తీసుకున్నాం. ఎమోషనల్ యాక్షన్ డ్రామా చిత్రమిది. బాలకృష్ణ, నయనతార, ప్రకాష్‌రాజ్, హరిప్రియల పాత్రలు సినిమాకు కీలకం. ఈ సంక్రాంతికి బాలయ్య అభిమానులను అలరించే చిత్రమవ్వడం ఖాయం. బేసిక్‌గా బాలకృష్ణ సినిమాకు ఫ్లాష్‌బ్యాక్, బ్యాక్‌గ్రౌండ్ సెట్ అయితే ఆ సినిమా సూపర్‌హిట్ అయినట్టే. ఈ చిత్రానికి అవి బాగా కుదిరాయి.

హైలైట్‌గా నిలుస్తాయి..

సినిమాలో బాలకృష్ణ పాత్ర హైలైట్‌గా నిలుస్తుంది. ప్రతి భార్య ఇలాంటి భర్త ఉండాలని, ప్రతి ప్రియురాలు ఇలాంటి ప్రియుడు ఉండాలనుకుంటారు. పెళ్ళి సందర్భంలో వచ్చే సన్నివేశాలు మహిళలకే కాదు, మగవారికి కూడా నచ్చుతాయి. ఇక చిరంజీవి, బన్నీ, రామ్‌చరణ్ వంటి హీరోలు చేసే డాన్సు స్టెప్పులు బాలయ్య చేశారు. ఈ వయసులో అలాంటి స్టెప్పులేసినందుకు బాలయ్యకు హ్యాట్సాప్ చెప్పాలి. యాక్షన్ ఎపిసోడ్స్ కూడా హైలైట్‌గా నిలుస్తాయి. ట్రైలర్‌లో బాలయ్య మార్క్ యాక్షన్, డైలాగ్‌లకు మంచి స్పందన లభించింది. చిరంతన్ భట్ మ్యూజిక్ మరో అసెట్. కుంభకోణంలో చిత్రీకరించిన ధర్నా ఎపిసోడ్స్, వైజాగ్‌లో చిత్రీకరించిన సన్ని వేశాలు సినిమాకు ప్రాణం. ఇందులో బ్రహ్మణులకు సంబంధించి ఓ ఎపిసోడ్ ఉంటుంది. సినిమా చూశాక బ్రహ్మణులు గర్వపడతారు. ఇక క్లైమాక్స్‌లో బాలకృష్ణ, ప్రకాష్‌రాజ్‌ల మధ్య వచ్చే సన్నివేశాలకు ప్రతి ఒక్కరూ లేచి క్లాప్స్ కొడతారు. బాలయ్య కెరీర్‌లో ఇలాంటి సినిమా చేయలేదు. కె.ఎస్.రవికుమార్ మరోసారి తానేంటో నిరూపించుకుంటారు. బడ్జెట్ అనుకున్న దానికంటే పెరిగింది. అయినప్పటికీ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. భవిష్యత్‌లో అందరూ 'జై సింహా'లాంటి సినిమా చేయమని బాలయ్యను కచ్చితంగా అడుగుతారు.

బంద్ గ్యారంటీ..

చిత్ర పరిశ్రమలో క్యూబ్, యుఎఫ్‌ఓలతో కొందరు పెద్దలు చిన్న నిర్మాతలను దోచుకుంటున్నారు. అధిక రెంట్లు తీసుకుంటూ అన్యాయం చేస్తున్నారు. చిత్ర పరిశ్రమకు కొత్త నిర్మాతలు, చిన్న నిర్మాతలు ముఖ్యం. వాళ్ళతోనే పరిశ్రమ మనుగడ సాధిస్తుంది. వాళ్ళే లేకపోతే ఇండస్ట్రీ మూసేసుకోవాల్సి వస్తుంది. పెద్ద హీరోల సినిమాల వల్ల ఇండస్ట్రీ నిలబడదు. వర్కర్లకు, థియేటర్‌కి పని కావాలంటే చిన్న సినిమాల వల్లే సాధ్యం. కానీ చిన్న నిర్మాతలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఇది ఇలానే కొనసాగితే ఇండస్ట్రీ మనుగడ దెబ్బ తింటుంది. కేవలం పెద్ద హీరోలే సినిమాలు తీసుకోవాల్సి వస్తుంది. వీటికి సంబంధించిన దొంగలు మా చిత్ర పరిశ్రమలోనే ఉన్నారు. వారంతా దిగి రావాలి. క్యూబ్, యుఎఫ్‌ఓల విషయంలో జరుగుతున్న అన్యాయంపై మార్చి 1 నుంచి చిత్ర పరిశ్రమకు బంద్‌కు పిలుపునిస్తున్నాం. సౌత్ ఇండస్ట్రీస్ మొత్తం బంద్ నిర్వహించనున్నాం.

ఈసారి ఫుల్ బిజీ..

వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిస్తున్న చిత్రానికి 'ఇంటెలిజెంట్' అనే టైటిల్ ఫిక్స్ చేశాం. ఫుల్ యాక్షన్, ఎంటర్‌టైనర్ చిత్రమిది. క్లైమాక్స్‌తోపాటు రెండు సాంగ్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. కోటిన్నర రూపాయలతో వేసిన ప్రత్యేక సెట్‌లో ఓ పాటను చిత్రీకరించబోతున్నాం. ఫిబ్రవరి 9న విడుదల చేస్తాం. సాయి ధరమ్ తేజ్‌కి మంచి హిట్ సినిమా అవుతుంది. దీంతోపాటు రానా, రెజీనా జంటగా '1945' చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీలో తెరకెక్కిస్తున్నాం. ఈ సినిమాకి తెలుగులో నేను, హిందీలో రానా నిర్మాతలం. రానా మార్క్ భిన్నమైన కథతో ఈ చిత్రం ఉంటుంది. 'సంఘమిత్ర'లో లీడ్‌రోల్‌కి దిశాపటానీని అనుకుంటున్నాం. ఇంకా ఫైనల్ కాలేదు. ఈనెలలోనే అన్ని ఒక కొలిక్కి వస్తాయి.



'ఇంటెలిజెంట్'లో సాయి ధరమ్ తేజ్

ఈ ఏడాది బెంచ్ మార్క్ సినిమా



లగడపాటి శ్రీధర్

'తెలుగు చిత్ర పరిశ్రమను 'బాహుబలి' మరోస్థాయికి తీసుకెళ్ళింది. ఆ తర్వాత 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' మన పరిశ్రమ స్థాయిని పెంచే చిత్రమవుతుంది' అని అంటున్నారు నిర్మాత లగడపాటి శ్రీధర్. అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఇటీవల విడుదలైన ఫస్ట్ ఇంపాక్ట్‌కు కోటికిపైగా వ్యూస్ వచ్చాయి. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ, 'బన్నీని ఎంత మంది అభిమానులు, ప్రేక్షకులు ప్రేమిస్తారో ఫస్ట్ ఇంపాక్ట్‌కు వచ్చిన స్పందన చూస్తుంటే అర్థమవుతుంది. కేవలం 29 గంటల్లోనే కోటి వ్యూస్‌ను దాటింది. బన్నీపై ఫ్యాన్స్‌కున్న ప్రేమకు అవధుల్లేవు. ఇంపాక్ట్ అనే ఆలోచన దర్శకుడు వక్కంతం వంశీది. బన్నీ గత చిత్రాలతో పోలిస్తే రెట్టింపు ఉత్సాహంతో, కొత్త కథతో వస్తున్నారు. ఈ ఏడాది ఈ సినిమా బెంచ్ మార్క్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులపై ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తుందో తెలుస్తుందనే ఉద్దేశంతో దీనికి ఈ పేరు పెట్టారు. సినిమాకు యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయి. బ్యాంకాక్ యాక్షన్ డైరెక్టర్ కిచ్చాతోపాటు రవి వర్మ, పీటర్ హెయిన్స్, రామ్-లక్ష్మణ్ మాస్టర్లు ఫైట్స్‌ని కంపోజ్ చేశారు. దేనికదే భిన్నంగా ఉంటూ సినిమాకు ప్రధాన ఆకర్షణ అవుతాయి. ఫైట్స్ కూడా ఓ బెంచ్‌మార్క్‌లా నిలుస్తాయి. దేశభక్తి, రొమాన్స్, ఫ్యామిలీ, సోసైటీ అనే నాలుగు అంశాల ప్రధానంగా సినిమా సాగుతుంది. అదే సందర్భంలో స్ట్రాంగ్ ఎమోషన్స్ కూడా ఉంటాయి. సినిమా తీస్తే ఇంటర్వెల్‌తోనే హిట్ అనిపించుకునే సినిమా తీయాలనుకునే నిర్మాతని నేను. ఈ సినిమా చూస్తే అలా అనిపిస్తుంది. ఇక 'రేసుగుర్రం', 'టెంపర్' వంటి చిత్రాలకు మంచికథ అందించిన వక్కంతం వంశీ మరో అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దర్శకుడిగా కొత్త అయినా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఆయన బ్రిలియెంట్ డైరెక్టర్. కెమెరామెన్ రాజీవ్ వర్మ విజువల్‌గా ఆకట్టుకునేలా తెరకెక్కించారు. అమీర్ ఖాన్ తన సినిమాలతో ఇండియన్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఆ తర్వాత బన్నీ ఈ చిత్రంతో మరో లెవల్‌కి తీసుకెళ్తాడు. ఈ సినిమా విజయంతో ఈ ఏడాది తెలుగు పరిశ్రమలో స్టయిలీష్ స్టార్ సంవత్సరంగా చెప్పుకుంటారు. సినిమా అవుట్‌పుట్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. బన్నివాసు, నాగబాబు ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. సినిమా 70శాతం చిత్రీకరణ పూర్తయ్యింది. మరో 40రోజుల్లో షూటింగ్ కంప్లీట్ అవుతుంది. ఏప్రిల్ 27న విడుదల చేయబోతున్నాం. సమ్మర్‌కి మంచి వినోదాన్ని పంచే చిత్రమవుతుంది' అని అన్నారు.

మరెక్కడా దొరకదు..



రకుల్ ప్రీత్ సింగ్

'సినిమానే నా ఫస్ట్‌లవ్. ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తాను. ఆ తర్వాతే మరేదైనా' అని అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు చిత్ర పరిశ్రమలో వరుస విజయాలతో రాణిస్తోంది రకుల్. ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. న్యూ ఇయర్ నేపథ్యాన్ని పురస్కరించుకుని రకుల్ మాట్లాడుతూ, 'సినిమా ప్రపంచంలోకి రావాలన్నది నాకల. నాకు నచ్చిన రంగంలోనే ఉన్నందుకు హ్యాపీగా ఉంది. కెమెరా ముందు ఎంత సేపు ఉండాలన్నా ఉంటాను. కెమెరా ముందు నిలబడితే నాకు కలిగే ఆనందం ప్రపంచంలో మరెక్కడా దొరకదు. సినిమాలే నా ఫస్ట్ లవ్. నా మాతృ భాష పంజాబీ. కానీ ఇప్పుడు పంజాబీ కంటే తెలుగు బాగా మాట్లాడ గలుగుతున్నాను. 2018 నూతన సంవత్సరంలో నేనో నిర్ణయం తీసుకున్నా. ఇక నుంచి నేను నటించే తెలుగు సినిమాలకు సొంతంగా డబ్బింగ్ చెప్పాలనుకుంటున్నా' అని తెలిపింది. రకుల్ తమిళంలో కార్తీ, సూర్య సరసన నటిస్తూ బిజీగా ఉంది.



'కర్తవ్యం' చిత్రంలో ఒక దృశ్యం

కలెక్టర్‌గా నయనతార కర్తవ్యం

నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'ఆరమ్' చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. గోపీ నైనర్ దర్శకత్వం వహించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఆర్.రవీంద్రన్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత శరత్ మరార్‌తో కలిసి ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుని క్లీన్ యు సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా నిర్మాత ఆర్.రవీంద్రన్ మాట్లాడుతూ, 'పొలిటికల్ డ్రామా చిత్రమిది. ఇందులో నయనతార జిల్లా కలెక్టర్‌గా నటిస్తున్నారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించడంలో కలెక్టర్‌గా నయనతార అత్యద్భుతంగా నటించింది. ఇందులోని ఆమె నటనకు తమిళ ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. తమిళంలో విడుదలైన ఈ చిత్రం నయనతారకు ఎంతో కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులోనూ మంచి హిట్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం. అంతేకాదు పవర్‌ఫుల్ కంటెంట్ ఉన్న ఓ మంచి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో వస్తున్న మా బ్యానర్‌కు ఈసినిమా మంచి పేరు తీసుకురావడం ఖాయం. పవన్ కళ్యాణ్‌తో 'గబ్బర్ సింగ్', 'సర్దార్ గబ్బర్ సింగ్' వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించిన నిర్మాత శరత్ మరార్‌తో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: ఓం ప్రకాష్.

ఇండిపెండెంట్ మ్యూజిక్‌ని ప్రోత్సహించాలి



అనుదీప్, ఆర్.పి.పట్నాయక్, సత్యయామిని, కోటి

'కొత్త కాన్సెప్ట్, కొత్త రకమైన పాటతో ఆర్పీ పట్నాయక్ తిరిగి మ్యూజిక్ డైరెక్టర్‌గా మారుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. సింగర్స్ అంతా ఇండిపెంటెండ్ సాంగ్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది' అని సంగీత దర్శకుడు కోటి అన్నారు. 'నీతో ఏదో చెప్పాలని ఉంది' పేరుతో ఆర్పీ పట్నాయక్ ఓ ఇండిపెంటెండ్ ఒరిజినల్ వీడియో సాంగ్‌ను రూపొందించారు. సత్య యామిని ఆలపించిన ఈ వీడియో సాంగ్‌లో సత్యయామిని, అనుదీప్ జంటగా నటించారు. ఈ పాటను ఆదిత్య మ్యూజిక్ సహకారంతో నేడు(శుక్రవారం) విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ, '2004లో జరిగిన ఓ సంఘటన కారణంగా నేను సంగీత దర్శకుడిగా సినిమాలు మానేస్తున్నానని ప్రకటించారు. ఆ మాట విని ఎందుకు మానేస్తున్నావని కోటి క్లాస్ పీకారు. నన్ను, నా మ్యూజిక్‌ను ఇష్టపడే వ్యక్తి ఆయన. నా మ్యూజిక్ మిస్ అవుతున్న వారి కోసం తిరిగి రాబోతున్నాను. మ్యూజిక్ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అయితే దర్శకుడి పనిలో నేను ఇన్‌వాల్వ్ అవుతుంటాననే విమర్శ ఉంది. దర్శకుడిని గౌరవిస్తూ సంగీత దర్శకుడిగా నా పరిధి మేరకు మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తాను. నచ్చే కథలకు, నచ్చిన సినిమాలకే మ్యూజిక్ చేస్తా. గతంలో నా మ్యూజిక్‌కి చాలా మంది ప్రేమలో పడ్డారు. ఇకపై కూడా ప్రేమలో పడేయాలనుకుంటున్నా. ఈ పాట చేయడానికి కారణం హైదరాబాద్‌లో కూడా మంచి సాంగ్స్ పాడేవారు, వీడియోలు చేసే సింగర్స్, టెక్నీషియన్స్ ఉన్నారని చెప్పడానికి చేశా. సింగర్స్ అంతా ఇతర సంగీత దర్శకుల వద్ద పాడుతున్నారు. కానీ ఇండిపెండెంట్ మ్యూజిక్ ద్వారా ప్రతి సింగర్ సొంత ఆల్బమ్ చేసుకోవచ్చు. అలా చేయాలనుకునే వారికి నా సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది' అని చెప్పారు. 'ప్రపంచంలోని 70శాతం దేశాల్లో ఇండిపెండెంట్ మ్యూజిక్ వేరుగా ఉంది. కానీ మన దేశంలోనే అది సినిమాతో మిళితమై పోయింది. ఇప్పుడు సోషల్ మీడియా చాలా విస్తరించింది. దాన్ని ఉపయోగించుకుని తమ పాటలతో సొంత ప్రతిభ చాటుకుంటూ ప్రేక్షకులకు చేరువ కావచ్చు' అని రఘు కుంచె తెలిపారు. 'ఈ పాట పాడటంతోపాటు ఇందులో నటించే ఛాన్స్ ఇచ్చిన ఆర్పీ పట్నాయక్‌కు ధన్యవాదాలు' అని సత్య యామిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుదీప్, జెమిని సురేష్, మనీషా, రమణ, రవివర్మ, లక్ష్మి తదితరులు పాల్గొని ఆర్పీ పట్నాయక్‌ను అభినందించారు.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



రాజ్ తరుణ్

'ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన లవ్ స్టోరీ చిత్రం 'రంగులరాట్నం. జీవితం ఎక్కడ ప్రారంభమవుతుందో తిరిగి అక్కడికే వస్తుందనే కాన్సెప్ట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రానికి 'రంగులరాట్నం' అనే టైటిల్ పెట్టాం' అని అంటున్నారు హీరో రాజ్ తరుణ్. మహిళా దర్శకురాలు శ్రీరంజని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చిత్రా శుక్లా కథానాయిక. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజ్ తరుణ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, 'ఓ రోజు సుప్రియ కాల్ చేసి ఈ కథ వినమన్నారు. బాగా నచ్చింది. కొత్తగా ఉంది. అందరికీ కనెక్ట్ అయ్యే స్టోరీ కావడంతో చేసేందుకు ఒప్పుకున్నా. ఇందులో నేను మిడిల్ క్లాస్ అబ్బాయిగా నటించాను. లుక్ పరంగా కాస్త కొత్తగా కనిపిస్తాను. నా గత చిత్రాలతో పోల్చితే చాలా సెటిల్డ్‌గా ఉండే పాత్రను పోషించాను. నా పాత్రతోపాటు సినిమా రియలిస్టిక్‌గా ఉంటుంది. శ్రీరంజని మహిళా దర్శకురాలైనా చాలా బాగా డీల్ చేశారు. మేల్ డైరెక్టర్స్‌తో కంపేర్ చేస్తే శ్రీరంజనిలో ఎలాంటి డిఫరెన్స్ కనిపించలేదు. ప్యాషనేట్ డైరెక్టర్ ఆమె. లేడీ డైరెక్టర్ అయి ఉండి మేల్ క్యారెక్టర్‌ను అంత బాగా రాస్తుందని ఊహించలేదు. ప్రేమకథా చిత్రమిది. మదర్ సెంటిమెంట్ ఆకట్టుకుంటుంది. కామెడీ కూడా కావాల్సినంత ఉంటుంది. హీరోయిన్ చిత్రా శుక్లా చాలా బాగా నటించింది. లిప్ లాక్‌లు వంటి సన్నివేశాలుండవు. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సంగీతం సినిమాకు ప్లస్ అవుతుంది. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల ఆరు పాటలకు అత్యద్భుతమైన బాణీలను అందించారు. సినిమాలో రిలీక్స్ విని విని పాట రాయలనిపించింది. అలా అనుకోకుండా ఓ పాట రాశాను. అది మ్యూజిక్ డైరెక్టర్‌కి ఇచ్చాను. కట్ చేస్తే రీరికార్డింగ్ రోజు వచ్చి పాట పెడుతున్నామని చెప్పారు. నేను షాక్ అయ్యాను. 'ఉయ్యాల జంపాల' తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ స్టూడియోలో పనిచేస్తే ఓ ధైర్యం ఉంటుంది. నటుడికి కావాల్సినంత భరోసా ఇచ్చే సంస్థ ఇది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అవి పూర్తయ్యాక రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. ఈ సంక్రాంతికి వస్తున్నాం. పండక్కి రెండు భారీ చిత్రాలున్నాయి. అయినప్పటికీ మా సినిమా రావడం సర్‌ప్రైజ్. కథ బాగుంటే సంక్రాంతికి ఎన్ని సినిమాలైనా ఆడుతాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. సినిమాకు కూడా ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. నా తదుపరి చిత్రాల్లో 'రాజుగాడు' చిత్రీకరణ పూర్తి చేసుకుని రిలీజ్‌కు రెడీగా ఉంది. బహుశా ఫిబ్రవరిలో ఆ చిత్రం విడుదలయ్యే ఛాన్స్ ఉంది. 'లవర్స్' అనే సినిమా ఇటీవలే ప్రారంభోత్సవం జరుపుకుంది. సూర్య ప్రతాప్‌తో సినిమా ఈ ఏడాది సెకండాఫ్‌లో సెట్స్‌పైకి వెళ్తుంది. బేసిగ్గా నేను ఏ సినిమాను ప్లాన్ చేసుకోను. కథ నచ్చితే ఎలాంటి జోనర్ చిత్రమైనా చేస్తాను' అని చెప్పారు.



ఆండ్రియా, వసంత్ కుమార్

నేటి యువత ప్రవర్తనకు అద్దం

అంజలి, ఆండ్రియా, వసంత్ కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'తారామణి'. రామ్ దర్శకత్వం వహించిన ఈ తమిళ హిట్ చిత్రాన్ని డి.వి.సినీ క్రియేషన్స్ పతాకంపై యస్వంత్ మూవీస్ సమర్పణలో నిర్మాత డి.వెంకటేష్ తెలుగులో అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత డి.వెంకటేష్ మాట్లాడుతూ, 'తమిళంలో విడుదలైన ఈ సినిమా అత్యధిక వసూళ్లను సాధించింది. నేటి యువత ప్రవర్తనకు అద్దం పట్టేలా ఈ చిత్ర కథాంశం ఉండటంతో ప్రేక్షకులు బాగా ఆదరించారు. అందుకే ఇంత మంచి సందేశం ఉన్న ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలనే ప్రయత్నం చేస్తున్నాం. అందుకు గర్వంగానూ, సంతోషంగానూ ఫీల్ అవుతున్నాం. తమిళంలో కంటే తెలుగులో ఇంకా పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. ఈ సినిమా పేరుకే డబ్బింగ్ అయినా తెలుగు యువతను బాగా ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం సెన్సార్ పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికెట్ పొందింది. ఫిబ్రవరి నెలాఖరులో సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.

గిరిజనులపై ఫారెస్టు అధికారుల దౌర్జన్యం

- భూముల స్వాధీనానికి యత్నం
- ఎదురు తిరిగిన గిరిజనులు
- వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా
- కందకాలు తవ్వడానికి యంత్రాలు సిద్ధం
- ఫారెస్టు అధికారుల జోలికి వెళ్తే కేసులు: ఆర్డీఓ
- అడ్డుకొని తీరుతాం: కేవీపీఎస్ కార్యదర్శి మహిపాల్



నవతెలంగాణ-వికారాబాద్ రూరల్

భూపాలపల్లి జిల్లాలో గిరిజనులపై ఫారెస్టు అధికారులు చేసిన దాడి మరువకముందే వికారాబాద్ జిల్లాలో గురువారం ఫారెస్టు అధికారులు గిరిజనులపై దౌర్జన్యం చేసి వారి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. గిరిజనులు ఎదురుతిరిగి అడ్డుకోవడంతో రెండు తండాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. న్యాయం చేయాలని గిరిజనులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నాకు దిగారు.. బాధితుల వివరాల ప్రకారం...ధారూర్ మండలంలోని గురుదొట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని శేరిగడ్డ తండా, అంపల్లి తండాల్లో తరతరాలుగా సాగుచేసుకుంటున్న గిరిజన భూములను గురువారం ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. శేరిగడ్డ తండాల్లోని సర్వే నెంబర్ 20లో 50 ఎకరాల భూమి, అంపల్లి తండా సర్వే 43లో 55 ఎకరాల భూమిని గిరిజనులు దాదాపు 60 సంవత్సరాలుగా నుంచి సాగు చేసుకుని జీవనోపాధి పొందు తున్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు జారీ చేసింది. పాసుబుక్కులివ్వడంతో వారంతా బ్యాంకుల్లో రుణాలు పొంది పొలాల్లో బోరులు వేసుకొని వరి, కంది, వేరుశెనగ సాగుచేసుకుంటున్నారు. అయితే ధారూర్ ఫారెస్టు అధికారులు గిరిజనులు సాగు చేస్తున్న భూములు ఫారెస్టు ఏరియాని అంటూ భారీ యంత్రాల సహాయంతో రెండు తండాలను కలుపుకుని కందకాలు తీయడానికి యంత్రాలను సిద్ధం చేశారు. దీంతో రెండు తండాలకు చెందిన గిరిజనులు సామూహికంగా ఫారెస్టు అధికారులు దింపిన యంత్రాలు పనిచేయకుండా అడ్డుకొని ఎదురుతిరిగారు. ప్రస్తుతం గిరిజనులు వేసుకున్న బోర్ల కింది పొలంలో వరి, పల్లి పంటలు సాగులో ఉన్నాయి. అయినప్పటికీ ఫారెస్టు అధికారులు పంటలను పరిగణలోకి తీసుకోకుండా కందకాల తవ్వడానికే ప్రాధాన్యత ఇచ్చి రెండు తండాలు, వారి పొలాలను కలుపుకుని కందకాలు తవ్వడానికి పూనుకున్నారు. ఈ పనులను గిరిజనులు అడ్డుకోవడంతో ఫారెస్టు అధికారులు గిరిజనులు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక్క రోజులో పంచాయితీ తేల్చుకోవాలని లేకపోతే శుక్రవారం నుంచి కందకాల తవ్వకం పనులు ప్రారంభిస్తామని బీట్ అధికారి అనిత గిరిజనులను హెచ్చరిం చారు. కందకాల తవ్వకం పనులను అడ్డుకుంటే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని కూడా బెదిరించారు. గతంలో గిరిజనుల భూములను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఫలితంగా ఫారెస్టు అధికారులు ఆగ్రహంతో గిరిజన మహిళ జట్టును కత్తిరించి దౌర్జన్యానికి పూనుకున్నారు. దీంతో ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. గిరిజనులకు ఇచ్చిన భూముల పంచాయతీ తేల్చడానికి రెవెన్యూ, ఫారెస్టు అధికారులు 2006లో జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ అధికారులు గిరిజనులకు పట్టా పాసుపుస్తకాలను అందజేశారు. మళ్లీ 12 ఏండ్ల తరువాత ఫారెస్టు అధికారులు అవే భూములను మళ్లీ స్వాధీనం చేసుకోవడానికి తండాల్లోకి భారీ యంత్రాలను తరలించారు. దీంతో తండాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు న్యాయం చేయాలని శేరిగడ్డ తండా, అంపల్లి తండా గిరిజనులు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆర్డీఓ విశ్వనాథం అందుబాటులో లేకపోవడంతో కేవీపీఎస్ నాయకుడు మహిపాల్ ఫోన్‌లో ఆర్డీఓను సంప్రదించి విషయం వివరించారు. ఆర్డీఓ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఫారెస్టు అధికారుల జోలికెళ్తే కేసులు తప్పవని శుక్రవారం భూముల విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రతిఘటిస్తాం: కేవీపీఎస్,వ్యకాస

గిరిజనులపై ఫారెస్టు అధికారుల దౌర్జన్యం ఘటనపై కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మహిపాల్, వ్యకాస జిల్లా కార్యదర్శి వెంకయ్య ఆగ్రహించారు. జైలుకు వెళ్లడం కోసం తాము భయపడమని, గిరిజన భూములను ఆక్రమించాలని ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. గతంలో గిరిజనులపై ఫారెస్టు అధికారులు దాడులు చేసిన కారణంగా తీవ్ర మనస్తానికి గురై ఇద్దరు గిరిజన రైతులు తాము భూములు కోల్పోతున్నామని ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృత్తం అయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు.



జూన్ నాటికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు

- 9వ ప్యాకేజీ పనుల్లో నాణ్యత పాటించాలి :కేటీఆర్

నవతెలంగాణ - తంగళ్లపల్లి / కోనరావుపేట

డబుల్‌బెడ్‌రూం ఇండ్లను జూన్ 2న సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం ఆకస్మికంగా పర్యటించిన ఆయన తొలుత తంగళ్ళపల్లి మండలంలోని మండేపల్లి శివారులో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం మే చివరి కల్లా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ ఇండ్లకు సంబంధించి డంపుయార్డ్, గ్రీన్ యార్డ్, పార్కులు, ఓపెన్ జిమ్ తదితర గ్రూపు వేయాలన్నారు. ఆయా గ్రామాల్లో గృహనిర్మాణ కమిటీ ఏర్పాటు చేసి నిర్మాణ బాధ్యతలు వారికే అప్పగించాలన్నారు. డ్రైవింగ్ స్కూల్ పనులు, ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కోనరావుపేట మండలంలోని మల్కపేట, నిజామాబాద్ గ్రామ శివారులో రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ప్రాణహిత చేవెళ్ల 9వ ప్యాకేజీ మల్కపేట వద్ద నిర్మిస్తున్న సొరంగాన్ని మంత్రి సందర్శించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న భూనిర్వాసితులు మంత్రిని కలిసి పరిహారం విషయమై మాట్లాడారు. వారికి వెంటనే పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట మండలంలో మోడల్ ఠాణాను ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీ బాల్కసుమన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ కృష్ణభాస్కర్, డీఆర్వో శాంప్రసాద్‌లాల్, ఆర్డీవో పాండురంగా ఉన్నారు.

17న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 స్కీం వర్కర్లు దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నారు. ఈ సమ్మెలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న స్కీం వర్కర్లందర్లూ పాల్గొంటారని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదానాయక్, బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ రెకమండేషన్ అమలు చేయాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పదో పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలని, స్కీంలను ప్రయివేటీకరణ చేయరాదని, బడ్జెట్‌లో స్కీంలకు అవసరమైన నిధులు కేటాయించాలని, రెండో ఏఎన్ఎంలకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని ఆ వినతిపత్రం పేర్కొన్నారు.

మైనారిటీ కార్యదర్శిగా దానకిశోర్ బాధ్యతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనారిటీ సంక్షేమ ద్వారా వివిధ పథకాలను అల్ప సంఖ్యాక వర్గాలకు అందేలా కృషి చేస్తానని ఎం.దానకిశోర్ అన్నారు. గురువారం సచివాలయంలో మైనారిటీస్ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా చేస్తానని అన్నారు. అల్పసంఖ్యాక ప్రజలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు.

దళితుడితో బూట్లు నాకించారు

మొదటిపేజీ తరువాయి

జాదవ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేసి డిసెంబరు 28న అమ్రయివాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. స్టేషన్‌కు తీసుకెళ్లిన తర్వాత పోలీసులు తన కులం గురించి ప్రశ్నించారు. తాను దళితుడినని చెప్పడంతో వినోద్‌భాయ్‌కు క్షమాపణ చెప్పాల్సిందిగా ఒత్తిడి చేశారు. వారు చెప్పినట్టు చేసిన తర్వాత కూడా వారి ఆగ్రహం చల్లారలేదు. అక్కడున్న దాదాపు 15 మంది పోలీసుల బూట్లను నాకించారు. డిసెంబరు 29న హర్షద్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం ఈ నెల 1న స్థానికులతో కలిసి పోలీస్ స్టేషన్‌ను ఘెరావ్ చేయడంతో ఉన్నతాధికారులు కల్పించుకొని అమానవీయంగా ప్రవర్తించిన పోలీసులపై కేసు నమోదుచేశారు. మరోవైపు జాదవ్ ఫిర్యాదుతో కానిస్టేబుల్ వినోద్‌పై ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసినట్టు అమ్రయివాడి పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఓఎం దేశాయ్ చెప్పారు.కానీ ఇంతవరకు హర్షద్‌పై అక్రమంగా కేసులో ఇరికించిన పోలీసుపై ఇంతవరకూ ఎలాంటి చర్యా తీసుకోలేదని దళితసంఘాలు ఆరోపిస్తున్నాయి.

కొత్తగా ఫీజులు పెంచొద్దు

మొదటిపేజీ తరువాయి

వెబ్‌సైట్‌లో ఎల్‌కేజీ,యూకేజీ, ఒకటో తరగతి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, 12న ఫైనల్ లిస్టు ప్రకటించాలనీ ఆదేశించింది. అయితే ఈ సందర్భంగా ఫీజులకు సంబంధించి ఎలాంటి ప్రకటనా ప్రభుత్వం చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా యాజమాన్యాలు పెంచుకునేందుకు అవకాశమిచ్చినట్లైంది. తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే అడ్మిషన్స్ నోటిఫికేషన్ ఇచ్చిదనే విషయాన్ని'నవతెలంగాణ' తన కథనంలో వివరించింది. సర్కారు నిర్ణయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు ఆర్థిక సహాయం
అందజేసిన మంత్రి నాయిని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవన మరియు ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న పలువురు కార్మికులకు కార్మిక శాఖ మంత్రి నాయినీ నర్సింహారెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందించారు. 15 మంది కార్మికులకు ప్రసూతి సహాయం కింద రూ.4.10లక్షలు, ఐదుగురు సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.3.70లక్షలు, ప్రమాదంలో మరణించిన నలుగురు కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.25.10లక్షలు, నలుగురు కార్మికుల కుమార్తెల వివాహ కానుకగా రూ.1.10లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ హన్మంతరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంసెట్ స్కాంలో జేఎన్‌టీయూకూ పాత్ర?

- త్వరలోనే చార్జిషీట్ వేసే దిశగా సీఐడీ దర్యాప్తు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఎంసెట్ 2 స్కాంపై విచారణ జరుపుతున్న సీఐడీ తాజాగా ఇందులో జేఎన్‌టీయూకు చెందిన కొందరి పాత్రపైనా సీరియస్‌గా విచారిస్తున్నట్టు తెలిసింది. జెఎన్‌టీయూ నుంచి వివరణ తీసుకున్న సీఐడీ అధికారులు అందులోని కొన్ని అంశాల ఆధారంగా మరింత క్షుణ్ణంగా విచారణ సాగిస్తున్నట్టు సమాచారం. 2016లో ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీక్‌కు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 66 మందిని సీఐడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. స్కాంపై దర్యాప్తు మొదలై ఏడాది దాటి పోయింది. ఎస్‌బీ సింగ్ అనే వ్యక్తి ఢిల్లీ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఎంసెట్ పేపర్ బయటికి వచ్చేలా వ్యూహరచన చేసి తర్వాత దాని ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం చేసినట్టుగా సీఐడీ తుది నిర్ణయానికి వచ్చింది. ఆమేరకు త్వరలోనే చార్జిషీట్‌ను కూడా వేస్తారని అందరు ఊహించారు. అయితే, తాజాగా ఎంసెట్-2 పరీక్ష నిర్వహించిన జెఎన్‌టీయూ సంబంధిత విభాగం అధికారుల నుంచి ఇటీవలే సీఐడీ మరింతగా వివరణ కోరింది. ఈ మేరకు స్పందించిన జెఎన్‌టీయూ అధికారులు సీఐడీ కోరిన సమాచారాన్ని అందచేశారు. పేపర్‌ను రూపొందించడం మొదలుకొని దీనిని అత్యంత రహస్యంగా ఢిల్లీ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించే వరకు తీసుకున్న చర్యలు, అనుసరించిన నిబంధనలు, రహస్యంగా ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు తదితర అంశాలను సీఐడీ డీజీ గోవిందసింగ్ ఆదేశాల మేరకు ఐజీ శిఖాగోయల్ నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తుతో పాటు తాజాగా జెఎన్‌టీయూ ఇచ్చిన వివరణ, అందులో ఎక్కడైనా సందేహాలకు తావిచ్చే అంశాలు ఉన్నాయా అనేదానిపై కూడా విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. మొత్తంమీద ఇప్పటివరకు అరెస్టు చేసిన వారితోపాటు కొత్తగా మరో ఇద్దరు లేక ముగ్గురు నిందితులను జాబితాలో చేర్చే అవకాశాలు లేక పోలేదని సీఐడీ దర్యాప్తు వర్గాలను బట్టి తెలుస్తోంది. కాగా, జెఎన్‌టీయూ నుంచి వచ్చిన వివరణపైనా నిశితంగా పరిశీలన జరుపుతున్నామని, త్వరలోనే ఛార్జీషిట్ వేస్తామని గురువారం నవ తెలంగాణతో మాట్లాడుతూ సీఐడీ డీజీ గోవిందసింగ్ తెలిపారు.

కోటి క్వింటాళ్ల పత్తి నష్టం

- రైతులను నిండా ముంచిన బీటీ-3 విత్తనాలు
- రైతులను పట్టించుకోని సర్కార్ :

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగారెడ్డి



నవతెలంగాణ-వికారాబాద్ రూరల్

రాష్ట్రంలో బీటీ-3 పత్తి విత్తనాల వల్ల దిగుబడి రాక దాదాపు కోటి క్వింటాళ్ల పత్తి పంటను రైతులు నష్టపోయారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగారెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీటీ-2 పత్తి విత్తనాలు అమ్ముకోవడానికి ప్రభుత్వ అనుమతి ఉంది కానీ, కంపెనీలు బీటీ-3 విత్తనాలను విక్రయించి రైతులను దగా చేశాయన్నారు. బీటీ-3 నాసిరకం విత్తనాలను కనిపెట్టిన కర్నాటక ప్రభుత్వం ఆ కంపెనీలపై కేసు నమోదు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.3700 చెల్లించిందని గుర్తు చేశారు. అదే కంపెనీలు తెలంగాణలో విత్తనాలను విక్రయించి రైతులను దగా చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఏడేండ్లలో దేశ వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పంట దిగిబడి రాక, గిట్టుబాటు ధర లేక, బ్యాంకు రుణాలు.. ప్రయివేట్ అప్పులు చెల్లించలేక 3500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కొందరికే ఎక్‌గ్రేషియా చెల్లించి చేతులు దులుపుకుందన్నారు. కనీసం మద్దతు ధరైనా ఇవ్వాలని రైతులు పంటలను దహనం చేసి, రోడ్లపై వేసి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రాష్ట్రంలో రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో రూ.13 వేల కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయని చెప్పారు. మిగతా 45 శాతం డబ్బులు వడ్డీ కింద బ్యాంకర్లు జమ చేసుకున్నట్టు వివరించారు. ఒక్కొక్క రైతుకు బ్యాంకు వడ్డీ కింద ప్రభుత్వం రూ.44 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 2017 నాటికి భూప్రక్షాళన సర్వే పూర్తి చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి చేయలేదని, అనేక లోటుపాట్ల వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు జి.నర్సిములు, పరిగి మండల అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రయోజనం అంతంతే..

మొదటిపేజీ తరువాయి

త్వరగానే పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారని పేర్కొన్నారు. 2017 డిసెంబర్ 30వ తేదీ ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను సరఫరా చేసినప్పుడు మొత్తంగా 190 మిలియన్ యూనిట్ల వినియోగం (9,524 మెగావాట్లు) జరిగింది. ఈ సీజన్‌లో ఇదే గరిష్ట విద్యుత్ వినియోగంగా నమోదైంది. 2016 డిసెంబర్ 30వ తేదీ ఇదే సీజన్‌లో 153 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. అంటే 2016తో పోల్చితే దాదాపు 37 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. 2017 డిసెంబర్ 31వ తేదీ విద్యుత్ వినియోగం 184 మి.యూ., గా నమోదైంది. అంతకు ముందు ఏడాది అదే రోజు విద్యుత్ వినియోగం 154 మి.యూ., మాత్రమే. ఈ లెక్కలన్నీ ప్రభుత్వం 24గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరాను అధికారికంగా ప్రకటించక ముందువి. ఈనెల 1వ తేదీ నుంచి అధికారికంగా 24గంటల విద్యుత్ సరఫరాను ప్రకటించాక క్రమేణా విద్యుత్ వినియోగం తక్కువ అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. 1వ తేదీ విద్యుత్ వినియోగం 180 మి.యూ., కాగా 2, 3 తేదీల్లో 183 మి.యూ.,గా నమోదైంది. అయితే రాబోయే రోజుల్లో ఈ వినియోగం మరింత తక్కువయ్యే అవకాశాలున్నట్టు టీఎస్ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతానికి 1వతేదీ నుంచి 3వ తేదీ నాటికి మూడు మిలియన్ యూనిట్లు పెరిగినా...అది స్థిరంగా ఉండే పరిస్థితి లేదని...వాతావరణ పరిస్థితుల్ని బట్టి కూడా హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నట్టు ఆ అధికారి వివరించారు.

కరెంటు అందుబాటులో ఉన్నా భూగర్భజలాలు క్రమేణా తగ్గుతుండటంతో రైతులు పొలాలకు నీరు పెట్టుకోలేకపోతున్నట్టు సమాచారం. విద్యుత్ వినియోగంపై డిస్కంలు వేసిన అంచనాలకు భిన్నంగా డిమాండ్ తగ్గుతుండటంతో గ్రిడ్ నిర్వహణ కష్టంగా మారుతున్నట్టు అధికారులు తెలిపారు. 11వేల మెగావాట్ల మేరకు డిమాండ్ పెరిగినా గ్రిడ్‌ను సమర్థవంతంగా నిర్వహించగలమని విద్యుత్ సంస్థలు ప్రకటించాయి. అయితే డిమాండ్-సరఫరా-వినియోగం అంచనా విషయంలోనే ఇబ్బందులు తలెత్తుతున్నట్టు గ్రిడ్ అధికారులు చెప్తున్నారు.

తేదీ	ప్రస్తుత వినియోగం	2016లో అదే రోజు
30/12/2017	190 మి.యూ.,	153 మి.యూ.,
31/12/2017	184 మి.యూ.,	154 మి.యూ.,
01/01/2018	180 మి.యూ.,	144 మి.యూ.,(2017లో అదే రోజు)
02/01/2018	183 మి.యూ.,	152 మి.యూ., („)
03/01/2018	183 మి.యూ.,	155 మి.యూ., („)

ట్రిపుల్ తలాక్ రద్దు బిల్లు పై వీడని సస్పెన్స్

మొదటిపేజీ తరువాయి

ఆనంద్‌శర్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అధికార పక్షం తిరస్కరించింది. దాంతో, అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదాలతో రాజ్యసభ శుక్రవారం 11 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభలో చర్చ సందర్భంగా.. ట్రిపుల్ తలాక్ రద్దు బిల్లుకు కాంగ్రెస్ అడ్డుపడుతున్నదని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆరోపించారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ రాజ్యసభలో వ్యతిరేకించడం ఆ పార్టీ అనుసరించే ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. వారంరోజుల క్రితం ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. రాజ్యసభలో సంఖ్యా బలం తక్కువగా ఉన్న బీజేపీకి గతంలో మద్దతు తెలిపిన ఏఐఏడీఎంకే, బిజూ జనతాదళ్‌వంటి పార్టీలు కూడా సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాలతో గొంతు కలపడం గమనార్హం. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షం టీడీపీ కూడా కమిటీకి పంపాలని సూచించింది. బిల్లులో ముస్లిం మహిళలకు మరింత రక్షణ కల్పించే అంశాలను చేర్చాలని కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సూచిస్తున్నాయి. ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తను మూడేండ్లపాటు జైలుకు పంపేలా చట్టం చేయడం పట్ల ప్రతిపక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మూడేండ్ల కాలం బాధిత మహిళ, ఆమె పిల్లల బాధ్యత ఎవరు చూడాలని ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందా అన్న ప్రశ్నకు అధికారపక్షం నుంచి సమాధానం లేదు. మహిళల ఆర్థిక భద్రతకు సంబంధించి తమ ప్రతిపాదనలను బిల్లులో చేర్చినట్టయితే తాము మద్దతు ఇస్తామని రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష నేత గులాంనబీ ఆజాద్ స్పష్టం చేశారు.

స్కూల్ డ్రెస్సులపై జీఎస్టీ భారం

మొదటిపేజీ తరువాయి

విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జీఎస్టీ భారం భారీగానే..

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒక్కో డ్రెస్‌కు అవసరమైన వస్త్రానికి రూ.138.5, కుట్టుకు రూ.50లు విద్యాశాఖ చెల్లించింది. ఈ ఏడాది రూ.81కోట్ల వరకు యూనిఫారాల కోసం ఖర్చు చేసింది. ఈ విద్యాసంవత్సరం కేంద్ర ప్రభుత్వం వస్త్రాలపై మొదట్లో 18శాతం జీఎస్టీ వేసినా, కార్మికులు, వ్యాపారులు చేసిన ఆందోళన ఫలితంగా దాన్ని ఐదుశాతానికి తగ్గించింది. దీంతో ప్రస్తుతం ఒక్కోడ్రెస్‌కు అవసరమైన వస్త్రం ధరను రూ.138.5ల నుంచి రూ.150లకు విద్యాశాఖ పెంచింది. వీటికితోడు రవాణా చార్జీల్లోనూ దీని ప్రభావం కనిపించనున్నది. ఈ లెక్కన ఈ ఏడాది మరో రూ.ఏడు కోట్ల వరకు అదనంగా భారం పడనుందని అధికారులు తెలిపారు. జీఎస్టీ ప్రభావం కుట్టు కూలిపైనా ఉండే అవకాశముంది. ఈ విద్యాసంవత్సరం ఒక్కోడ్రెస్ కుట్టు కూలి రూ.40 నుంచి రూ.50లకు ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం దారం, ఇతర పరికరాలపైనా జీఎస్టీ పన్ను ఉండటంతో కుట్టుకూలి మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వమిచ్చే కుట్టుకూలి చాలకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అదనంగా డబ్బులు కలిపి ఇస్తున్నారు. ప్రభుత్వం కుట్టుకూలి పెంచకపోతే ఈ భారం తల్లిదండ్రులపై పడే అవకాశముంది. ' ఇప్పటికే ఒకసారి కుట్టుకూలి పెంచాం..వచ్చే ఏడాది పెంచే అవకాశం లేదు' అని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

కుట్టుకూలి పెంచాలి: ఎన్ నారాయణ,
తెలంగాణ తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రభుత్వమిచ్చే వస్త్రాన్ని విద్యార్థుల తల్లిదండ్రులే కుట్టించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.50లతో ప్రస్తుతం ఒక డ్రెస్‌ను కుట్టడం లేదు. ఇప్పటికే రూ.వంద నుంచి రూ.2వందల వరకు అదనం తల్లిదండ్రులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీఎస్టీ ప్రభావంతో వచ్చే విద్యాసంవత్సరం ఈ భారం మరింత పెరిగే అవకాశముంది. కాబట్టి కుట్టుకూలి పెంచాలి. విద్యార్థుల యూనిఫారాలపై జీఎస్టీ పన్ను రద్దు చేయాలి.

సినిమా టిక్కెట్ ధరలు పెంపునకు అనుమతి

మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తున్నాయో లేదో జాయింట్ కలెక్టర్లు పరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వం టిక్కెట్‌రేట్లపై కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలని గతంలో హైకోర్టు రెండు రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కమిటీల ఏర్పాటు/నిర్ణయం జాప్యం కావడంతో రెండు రాష్ట్రాలకు చెందిన థియేటర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. కమిటీల నిర్ణయం వెలువడే వరకు టిక్కెట్ల రేట్ల పెంపుదలకు అనుమతించాలని కోరడంతో అందుకు న్యాయమూర్తి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే స్వైబాబాపై దాడి

- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా. పసునూరి రవీందర్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాజకీయ దురుద్దేశంతోనే రచయిత స్వైబాబాపై కొందరు దాడికి పాల్పడ్డారని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా. పసునూరి రవీందర్ అన్నారు. స్వైబాబాపై జరిగిన దాడిని భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా భావిస్తున్నామని చెప్పారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిధారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు వారంతా ఒక్కటే అనే విశాల దృక్పథంతో తాము వ్యవహరిస్తున్నామని, రాష్ట్ర విభజన తర్వాత కూడా రెండు రాష్ట్రాల ప్రజల మధ్య సహృద్భావ వాతావరణం దెబ్బతినలేదని రవీందర్ పేర్కొన్నారు. ఏపీలో అధికార పార్టీకి చెందిన వ్యక్తులే స్వైబాబాపై దాడికి పాల్పడినట్టు తమకు సమాచారం అందిందన్నారు. వివాదానికి కారణంగా చెబుతున్న పుస్తకంలో 40మంది ప్రముఖుల కవితలు ఉంటే స్వైబాబానే టార్గెట్ చేయడం వెనక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. దాడి వెనక హిందూత్వ శక్తుల ప్రమేయం ఉందని రవీందర్ ఆరోపించారు.

ఇసుక మాఫియా చేతిలో వీఆర్‌ఏ హత్య ?

మొదటిపేజీ తరువాయి

చనిపోయినట్టు కేసు నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. పిట్లం మండలం కారెగాం గ్రామానికి చెందిన బోయిని సాయిలు(40) మార్ధాండ వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కంబాపూర్ గ్రామశివారులో కాకివాగు వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న అతను గురువారం తెల్లవారుజామున అక్కడకు చేరుకున్నాడు. ఇసుక తరలింపును అడ్డుకునే క్రమంలో వీఆర్‌ఏకు, ఇసుక వ్యాపారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇసుక వ్యాపారులు వీఆర్‌ఏ సాయిలును పక్కకు తోసేసి.. అతని పైనుంచి ట్రాక్టర్‌ను ఎక్కించి హత్య చేసినట్టు తెలుస్తోంద్ది. తీవ్రంగా గాయపడిన సాయిలు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. అతనికి భార్య సాయవ్వ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇసుక మాఫియానే హత్య చేసిందని డిచ్‌పల్లిలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు ఎర్రోళ్ల సాయిలు కూడా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అంతిరెడ్డి మాత్రం వీఆర్‌ఏను కాకివాగు వద్ద ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ ఢీకొన్నట్టు చెబుతున్నారు. కేసు కూడా ఇలాగే నమోదు చేయడం గమనార్హం. ఇసుక వ్యాపారులకు స్థానిక కీలక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతోనే ఈ ఘటన వివరాలను తారుమారు చేసినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీఆర్‌ఏ చనిపోయిన విషయం తెలుసుకున్న కారెగాం, మార్తాండ గ్రామస్థులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ట్రాక్టర్ ప్రమాదంపై వీడని మిస్టరీ

సాధారణంగా ట్రాక్టర్ వేగం అంతగా ఉండదు. వీఆర్‌ఏ పక్కనుంచి వెళుతుంటే.. రక్తసిక్తమైన ఆయన శరీరం ఆ దారి మధ్యలోకి ఎలా వస్తుంది. మాములు గాయాలై..ప్రాణం పోయే స్థితిలో ఉంటే గ్రామస్తులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తారు. కానీ ఇక్కడ సీన్ మరోలా ఉన్నది. ట్రాక్టర్‌ను అడ్డుకున్న సాయిలును అమాంతంగా ఢీకొట్టి..చనిపోయాడని నిర్ధారించుకున్నాకే..ఇసుక మాఫియా అక్కడ నుంచి జారుకున్నట్టు స్పష్టమవుతోంది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసిన తీరుపైనే సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాసులు కురిపిస్తున్న కాకివాగు

పిట్లం మండలంలోని కాకివాగు నుంచి ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రోజుకు సుమారు 20 నుంచి 25 ట్రాక్టర్ల మేరకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం. ఇదంతా రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి పర్మిట్ లేకుండా జరుగుతుండటం గమనార్హం. దీనికి స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని ప్రచారంలో ఉంది.ఇసుక అక్రమాల్లో పాలకనేతల హస్తం ఉండటంతో..దీన్ని నియంత్రించాల్సిన కొందరు అధికారులు కళ్లు మూసుకోవడం కామన్ అయిపోయింది. దీంతో వేల టన్నుల ఇసుక అక్రమంగా తరలుతోంది. దోచుకునే వారికి దోచుకున్నంత అన్న చందంగా ఇసుక దందా మారిపోయింది.

ఇసుక మాఫియాను కఠినంగా శిక్షించాలి :వంగూరు రాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్ గ్రామశివారులో కాకివాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక మాఫియాను అడ్డుకున్న విఆర్‌ఏ సాయిలుపై ట్రాక్టర్‌తో దాడిచేసి హత్యచేయడాన్ని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. సాయిలు హత్యకు పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాను సర్కారు అరికట్టాలని సూచించారు. ప్రభుత్వ విధుల్లో మరణించిన సాయిలు కుటుంబంలో ఒకరికి సర్కారు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సెన్సెక్స్ ▲176 33,969 | నిఫ్టీ ▲62 10,504

డాలరుకు రూపాయి విలువ 63.41



బంగారం(10.గ్రా) రూ. 30,000



వెండి (కేజీ) రూ. 41,700



కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



ఐపీవోకి అపోలో మైక్రో సిస్టమ్స్



న్యూఢిల్లీ: అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ జనవరి 10న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు వస్తున్నట్టు ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్ల ధరల శ్రేణిని రూ.270- 275గా నిర్ణయిం చింది. ఈ ఐపీవో వివరాలను ముంబయిలో ఆ కంపెనీ ఎండీ కరుణాకర్ రెడ్డి, సీఎఫ్‌వో సుదర్శన్, హోల్‌టైం డైరెక్టర్ క్రిష్ణ సాయి కుమార్, అర్యన్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఈడీ శ్రీపాల్ షా వెల్లడించారు.

రూ.100 కోట్లు సేకరించిన ఫిన్‌టెక్

పూణె : ఎర్లీసాలరీ మొబైల్ యాప్‌పై వేతన అడ్వాన్సులు, తక్షణ నగదు రుణాలు అందించే ఫిన్‌టెక్ స్టార్టప్ తాజాగా రూ.100 కోట్లు సమీకరించినట్టు తెలిపింది. ఎయిట్‌రోడ్స్ వెంచర్స్, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఐడీజీ వెంచర్స్ ఇండియా, డీహెచ్‌ఎఫ్‌ఎల్, సీడ్ ఇన్వెస్టర్ అశోక్ అగర్వాల్ నుంచి ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్టు పేర్కొంది. ఈ నిధులతో 2018 చివరి నాటికి నెలకు 1,00,000 రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఈవో అక్షయ్ మెహ్రొత్రా తెలిపారు. ఉద్యోగులు తమ మొబైల్ యాప్ ద్వారా రుణాలు పొందడానికి వీలుందన్నారు.

ఇన్ఫోసిస్ సీఈవో వేతనం రూ.16 కోట్లు..



బెంగళూరు: దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ సీఈవోగా ఈ మధ్య కాలంలోనే బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్ వార్షిక వేతనం రూ.16.25 కోట్లుగా ఆ సంస్థ నిర్ణయించింది. అదే విధంగా స్థిర వేతనం కింద రూ.6.5కోట్లు, వేరియబుల్ చెల్లిం పుల కింద రూ.9.75 కోట్లు చొప్పు న అందించనున్నట్టు ఇన్ఫోసిస్ స్వతంత్ర బోర్డు సభ్యురాలు కిరణ్ మజుం దార్ షా తెలిపారు. మరో రూ.3.25కోట్ల విలువ గల స్టాక్ యూని ట్లను, వార్షిక ఈక్విటీ గ్రాంట్ల కింద రూ.13కోట్లు కూడా పొందనున్నారు. అంతే గాక.. వన్ టైమ్ ఈక్విటీ గ్రాంట్ కింద మరో రూ.9.75 కోట్లు తీసుకుం టారు. ఇక స్టాక్ యూనిట్ల విలువ ప్రతి ఆర్థిక సంవత్స రానికోసారి మారుతుందని షా తెలిపారు. సంస్థ ఆరో సీఈవోగా సలీల్ ఐదేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. మాజీ సీఈవో సిక్కా 2016-17 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తంగా రూ.42 కోట్ల మేర పొందారు.

వచ్చే ఐదేండ్లు 6.7శాతం వృద్ధే: ఫిచ్

ముంబయి: వచ్చే ఐదేండ్లలో భారత ఆర్థిక వ్యవస్థ సగటున 6.7 శాతం వృద్ధి రేటుతో సరిపెట్టుకోనుందని గ్లోబల్ రేటింగ్ ఎజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. విస్తృతావకాశాలు ఉన్నప్పటికీ ఈ వృద్ధిరేటు తక్కువేనని పేర్కొంది. చైనా, ఇండోనేషియాలు 5.5 శాతం వృద్ధిని నమోదు చేయనున్నాయని పేర్కొంది. ప్రపంచంలోనే భారత్ అత్యంత యువ దేశమని తెలిపింది. అత్యధిక మంది యువత పనిలో ఉన్నారని వెల్లడించింది. పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. అయినప్పటికీ తలసరి ఆదాయం తక్కువగా ఉందని, ఉత్పత్తి కూడా బలహీనంగా ఉందని వెల్లడించింది.

పీఎస్‌బీలకు మూల'ధన'మే కీలకం

● రికార్డు స్థాయికి ఎన్‌పీఏలు ● 88శాతం ప్రభుత్వ బ్యాంకులవే ● ప్రముఖ రేటింగ్ ఏజెన్సీల వెల్లడి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధన కరువు తీరాలంటే ఆ సంస్థలకు నిధులు సమకూర్చడము ఒక్కటే మార్గమని పలు రిపోర్టులు సూచిస్తున్నాయి. ప్రయివేటు బ్యాంకులకు దీటుగా మూలధన అంతరాన్ని అధిగమించాలంటే రూ.2.1 లక్షల కోట్ల మూలధన ప్రణాళికలు అమలు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి బ్యాంకుల మొండి బాకీలు కూడా తారా స్థాయికి చేరనున్నాయని హెచ్చరించాయి. క్రితం డిసెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు 10.2 శాతానికి ఎగిసి రూ.10 లక్షల కోట్లకు చేరాయని విశ్లేషించింది. వచ్చే సెప్టెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి ఈ మొండి బాకీలు ఏకంగా 11.1 శాతానికి చేరొచ్చని ఆర్‌బీఐ ఇది వరకే హెచ్చరించింది. వచ్చే రెండేండ్లలో పీఎస్‌బీలకు రూ.2.1 లక్షల కోట్ల మూలధనం సమకూర్చనున్నట్టు గత అక్టోబర్‌లో కేంద్ర



ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో రూ.18,130 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని నిర్ణయించారు. మరో రూ.1.35 లక్షల కోట్లు బాండ్ల విక్రయాల ద్వారా, మరో రూ.58,000 కోట్లు బ్యాంకుల వాటాల విక్రయం ద్వారా మూలధనం సమకూర్చాలని నిర్ణయించింది.

4% పెరిగే ఛాన్స్ : ఇక్రా

రేటింగ్ సంస్థ ఇక్రా రిపోర్టు ప్రకారం 2018 మార్చి నాటికి బ్యాంకుల మొండి బాకీలు శిఖర స్థాయికి చేరనున్నాయి. 2017-18, 2018-19లో మొండి బాకీల కేటాయింపులు బ్యాంకులకు ప్రతికూలంగా మారనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి నాటికి మొండి బాకీలు మరో 3-4 శాతం పెరిగి రూ.2.5-3 లక్షల కోట్లకు చేరొచ్చని హెచ్చరించింది. రద్దు చేసినవి, పునరుద్ధరించినవి, రికవరీలు కలుపుకుని స్థూల మొండి బాకీలు రూ.8.8-9 లక్షల కోట్లు లేదా 10-10.2 శాతానికి ఎగిసిపడొచ్చన్నారు. అదే 2016-17లో స్థూల మొండి బాకీలు రూ.7.65 లక్షల కోట్లు లేదా 9.5 శాతంగా నమోదయ్యాయి. వచ్చే మార్చి 2018 నాటికి బ్యాంకు స్థూల మొండి బాకీలు తారా స్థాయికి చేరొచ్చని అంచనా వేసింది. 2018-19లో ఇది బ్యాంకు ఆస్తులపై మరింత బలహీన ప్రభావాన్ని చూపించవచ్చు.

ప్రయివేటుతో పోల్చితే బలహీనం: మూడీస్

ప్రయివేటు రంగ బ్యాంకులతో పోల్చితే ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధనం బలహీనంగా ఉందని గ్లోబల్ రేటింగ్ ఎజెన్సీ మూడీస్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ అనలిస్టు అల్కా అంబరసు ఒక నోట్‌లో పేర్కొన్నారు. సెప్టెంబర్ 2017 నాటికి టైర్1లో పీఎస్‌బీల రుణాల సాధారణ ఈక్విటీ 8.7 శాతంగా ఉండగా, ప్రయివేటు బ్యాంకులు 12.2 శాతం కలిగి ఉన్నాయన్నారు. పీఎస్‌బీలకు మూలధనం కల్పించడం ద్వారానే ఈ అంతరాన్ని తగ్గించవచ్చన్నారు. అయితే ఎంత అంతరాన్ని తగ్గించవచ్చో ఆమె తెలుపలేదు. మార్చి 2019 నాటికి 21 పీఎస్‌బీలకు రూ.1.5 లక్షల కోట్లు సమకూర్చే అవకాశం ఉందన్నారు. రుణదాతలకు మూలధనం సమకూర్చడం ద్వారా రుణ కేటాయింపులు పెరగడం ద్వారా కొన్ని భయాలు తొలిగిపోనున్నాయన్నారు.

మరో రూ. 2.6 లక్షల కోట్ల ఎన్‌పీఏలు..

మొత్తం మొండి బాకీల్లో 88 శాతం ప్రభుత్వ రంగ బ్యాంకులవే. ఈ ఒత్తిడి ఆస్తులను బ్యాంకులు పరిష్కరించుకొనే సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఇక్రా రిపోర్టు సూచించింది.. 2017-18లో రుణ కేటాయింపుల భారం రూ.2.4-2.6 లక్షల కోట్లకు చేరొచ్చని ఇక్రా గ్రూపు ఫైనాన్సియల్ సెక్టార్ రేటింగ్స్ హెడ్ కార్తిక్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2016-17లో ఈ మొండి బాకీలు రూ.2లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మొండి బాకీలకు అధిక కేటాయింపుల వల్ల బ్యాంకుల నిర్వహణ లాభాలు పడిపోనున్నాయని హెచ్చరించారు. 2017-18లో బ్యాంకుల నష్టాలు అనేక రెట్లు పెరిగి రూ.30,000-రూ.40,000 కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. కాగా 2016-17లో రూ.7000 కోట్ల నష్టాలు చవి చూశాయి.

త్వరలో ఏటీఎంల నుంచి రూ.200 నోట్లు

న్యూఢిల్లీ : త్వరలోనే ఆటోమెటిక్ టెల్లర్ మిషన్ (ఏటీఎం)ల నుంచి రూ.200 నోట్లు జారీ కానున్నాయి. ఈ నోట్లను ఏటీఎంల్లో అందుబాటులోకి తేవాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా బ్యాంకులను ఆదేశించింది. తద్వారా ప్రజలను చిల్లర కష్టాల నుంచి దూరం చేయాలని సూచించింది. ఇప్పటి వరకు బ్యాంకులు రూ.100, రూ.500, రూ.2000 మాత్రమే ఏటీఎంల ద్వారా అందిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం 2016 నవంబర్‌లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసింది. వీటి స్థానంలో కొత్తగా రూ.2,000, రూ.500 నోట్లను అందుబాటులోకి తెచ్చింది. కాగా ఈ నోట్లకు చిల్లర దొరకక పోవడం తో సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొ న్నారు. గతేడాది జులై నుంచే



రూ.2000 నోటు ముద్రణను కూడా ఆర్‌బీఐ తగ్గించింది. వీటి స్థానంలో చిన్న నోట్లను పెంచాలని భావిస్తోంది. దీన్ని అధిగమించడానికి ఆర్‌బీఐ గతేడాది రూ.200 నోటును అందుబాటు లోకి తెచ్చింది. అయితే బ్యాంకుల ద్వారా మాత్రమే ఈ నోట్లను జారీ చేసింది. తాజాగా ఈ చిన్న నోట్లను వీలైనంత తొందరగా ఏటీఎంల్లో అందుబాటులోకి తేవాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. కాగా ఈ నోటును అందజేయాలంటే అందుకు తగిన విధంగా బ్యాంకులు ఏటీఎంల్లో సాంకేతిక మార్పులు చేయా ల్సి ఉంటుంది. ఇందుకుగానూ ఒక్కో ఏటీఎంకు రూ.5000 వరకు వ్యయం కానుంది. దేశవ్యాప్తంగా 2,22,000 ఏటీఎంలు ఉన్నాయి. వీటికి అన్నింటిగానూ బ్యాంకింగ్ పరిశ్రమ దాదాపు రూ.110 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని అంచనా. 2017 సెప్టెంబర్ నాటికి ఏటీఎం నుంచి రూ.2.44 లక్షల కోట్ల నగదు ఉపసంహరణలు చోటు చేసుకున్నాయి.

లాభాల్లో ముగిసిన మార్కెట్లు

- సెన్సెక్స్ 176 పాయింట్లు ర్యాలీ

ముంబయి: వరుసగా రెండు రోజుల పాటు యథాతథంగా నమోదైన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మాత్రం లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 176 పాయింట్లు పెరిగింది. అంతర్జాతీయ సానుకూల పవనాలకు తోడు లోహ, క్యాపిటల్ గూడ్స్, కన్సూమర్ డురెబుల్స్ షేర్ల కొనుగోళ్లకు మదుపర్లు ఉత్సాహం చూపారు. ఈ నేపథ్యంలోనే బీఎస్‌ఈ సెన్సెక్స్ 176 పాయింట్లు లాభపడి 33,969కు చేరింది. తొలుత 33,912 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 33,995-33,802 మధ్య కదలాడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 61.60 పాయింట్లు ర్యాలీతో 10,504.80 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో రంగాల వారిగా క్యాపిటల్ గూడ్స్ సూచీ అత్యధికంగా 2.02శాతం ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో లోహ 1.96 శాతం, కన్సూమర్ డురెబుల్స్ 1.69శాతం, పీఎస్‌యూ 1.37శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు రియాల్టీ 0.3శాతం, ఆటో 0.28శాతం, ఐటీ 0.13శాతం చొప్పున నష్టపోయాయి.

సంక్రాంతి తర్వాత బడ్జెట్ భేటీలు...

- ప్రభుత్వ నిర్ణయం, సీఎం వద్ద వరుస భేటీలు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్రాంతి పండగ తర్వాత బడ్జెట్ కసరత్తులు షురూ కానున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు వరసగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆర్థికశాఖకు మౌఖిక ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది.

బడ్జెట్ రూపకల్పనకు వీలుగా వివిధ శాఖలు తమ ప్రతిపాదనలను రూపొందించి, సమర్పించాలంటూ గతనెల 27న ఉత్తర్వులు విడుదలైన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు ఈ ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. కమిషనర్లు, డైరెక్టర్లతోపాటు జిల్లాల్లోని కిందిస్థాయి సిబ్బందితో వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. తద్వారా శాఖాపరంగా సమర్పించాల్సిన ప్రతిపాదనల ను రూపొందిస్తామని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. వీరితోపాటు అర్థగణాంకశాఖ ఉన్నతాధికారులు కూడా ప్రతిపాదనల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

ఈసారీ భారీగానే..

మరోవైపు టీఆర్‌ఎస్ సర్కారు 2018-19 బడ్జెట్‌ను కూడా భారీగానే ప్రతిపాదించే అవకాశాలున్నాయి. సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. తాయిలాలు, సంక్షేమ పథకాల కోసం భారీగానే నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ యోచిస్తున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో బడ్జెట్ పద్దు రూ.లక్షా 70 వేల కోట్లను మించే అవకాశముందని ఆయా వర్గాలు వివరించాయి. తెలంగాణ వచ్చిన తర్వాత మధ్యంతర బడ్జెట్‌ను రూ.లక్షా 6 వేల కోట్లతో ప్రతిపాదించిన టీఆర్‌ఎస్ సర్కార్.. తొలి బడ్జెట్‌ను రూ.లక్షా 15 వేల కోట్లతోను, రెండో బడ్జెట్‌ను రూ.లక్షా 30 వేల కోట్లతోను, మూడో (ప్రస్తుతం కొనసాగుతున్నది...2016-17) బడ్జెట్‌ను రూ.లక్షా 49 వేల కోట్లతోనూ ప్రతిపాదించిన సంగతి విదితమే.

పాఠశాల డైరెక్టరేట్ ఎదుట హిందీపండిట్ల ధర్నా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హిందీ డిగ్రీలైన విద్వాన్, విశారద, ప్రవీణ, హెచ్‌పీటీ పూర్తి చేసిన టెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు టీఆర్‌టీలో అవకాశమివ్వాలని పలువురు హిందీపండిట్లు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ జి కిషన్‌ను వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ...ప్రస్తుతం రాష్ట్రంలో 40వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వం మాత్రం 8792 పోస్టులతోనే టీఆర్‌టీ నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని అన్నారు. హిందీ విద్వాన్, విశారద, ప్రవీణ చేసిన వారికి అర్హత లేకుండా ఉత్తర్వులు ఇవ్వడంతో ఆ కోర్సు చేసిన అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇవే డిగ్రీలున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీకి అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జి కృష్ణ, నందగోపాల్, సాగర్, రామలింగం, అభ్యర్థులు పవన్‌కుమార్, రామకృష్ణ, లక్ష్మి, ప్రత్యూష, రమ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

మీకు మేము.. మాకు మీరు..

తుంగభద్ర జలాల వాడకంపై కర్నాటక బృందంతో చర్చలు

- తాగునీటి అవసరాల కోసం తెలంగాణ సహకారం కోరిన కర్నాటక
- ఆర్డీఎస్ ఆధునీకరణ పనులపై త్వరలో మూడు రాష్ట్రాల సమావేశం
- ఆరు నెలల్లో పనులు పూర్తి చేయటానికి కర్నాటక సహకారం కోరిన తెలంగాణ



మంత్రి హరీశ్‌రావుతో కర్నాటక బృందం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కొద్దిపాటి నీటి కోసం కర్నాటక తెలంగాణ సహకారం కోరింది. తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది నీటి కొరత తీవ్రంగా ఉన్నందున తమ రాష్ట్రంలో ఆయకట్టును కాపాడుకోవడానికి, తాగునీటి అవసరాలకు తెలంగాణకు కేటాయించిన నీటిని వాడుకునేందుకు అనుమతించాలని ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బీబీ పాటిల్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన ఒక వినతిపత్రం సమర్పించారు. గురువారం స్థానిక జల్లసౌధలో రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయి. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. కర్నాటక విద్యా శాఖ మంత్రి తన్వీర్ షెట్, కార్మిక శాఖ మంత్రి సంతోశ్ లాడ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణకు 3.5 టీఎంసీల నీటి వాటా ఉందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాజోలిబండ (ఆర్డీఎస్) ఆయకట్టుకు అవసరమయ్యే నీటి వినియోగం పోగా కర్నాటకను ఎంతమేరకు నీటి వాడకానికి అనుమతించగలమనే అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ప్రధానంగా చర్చసాగింది. ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 7 వేల ఎకరాల ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజనీర్లు అంచనా వేసిన అనంతరం మిగిలిన నీటిని కర్నాటక వాడుకునే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి హరీశ్‌రావు కర్నాటక మంత్రికి తేల్చి చెప్పారు. ఈ అంశం పై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించిన తర్వాత తమ నిర్ణయం చెబుతామన్నారు. ఇప్పుడు వినియోగించుకునే తుంగభద్ర నీటికి బదులుగా తెలంగాణ ప్రభుత్వం కోరినప్పుడు నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు 2 టి.ఎం.సి.ల నీటిని విడుదల చేస్తామని కర్నాటక హామీ ఇచ్చింది. గత సంవత్సరం కూడా మహబూబ్ నగర్ జిల్లా తాగు నీటి అవసరాల కోసం తాము నారాయణ్‌పూర్ నుంచి ఒక టీఎంసీ నీటిని జూరాలకు తెలంగాణ ప్రభుత్వం కోరిక మేరకు విడుదల చేసిన సంగతిని కర్నాటక మంత్రి గుర్తు చేసినారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో తెలంగాణ స్నేహ సంబంధాలు సాగిస్తున్నదని, గత ఏడాది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగు నీటి అవసరాల్లకోసం ఒక టీఎంసీ కర్నాటక విడుదల చేసిందని, ఇప్పుడు మళ్ళీ అదే రకమైన స్ఫూర్తిని చాటిన కర్నాటక ప్రభుత్వానికి మంత్రి హరీశ్ కతజ్ఞతలు తెలియజేశారు. ఆలంపూర్ నియోజక వర్గంలో ఉన్న పంటని కాపాడుకుంటూనే కర్నాటకకు తుంగభద్ర నీటిని వాడుకునేందుకు అనుమతి ఇచ్చే విశయంలో తనకు అభ్యంతరం లేదని ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ అన్నారు. రాజోలిబండ డైవర్షన్ పథకం ఆధునీకరణ పనులపై త్వరలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల సమావేశం నిర్వహించాలని తెలంగాణ, కర్నాటక నిర్ణయించాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల ప్రాంతం రైతాంగానికి 87 వేల ఎకరాలకు సాగునీరందించవలసిన రాజోలి బండ మళ్లింపు పథకం నుంచి ప్రస్తుతం 20 వేల ఎకరాలకు కూడా సాగు నీరందడంలేదని మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేపట్టినప్పటికీ ఇప్పటిదాకా పూర్తి కాలేదన్నారు. ఈ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కర్నాటకకు సమకూర్చుతామని ఆయన తెలిపారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనుల కోసం ఇదివరకు తాను కర్నాటక ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి మంత్రి గుర్తు చేశారు. ఈ ఆరు నెలల వర్కింగ్ సీజన్లో ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. అయితే ఏపీ సహకారం లేకుండా . ఆధునీకరణ పనులు పూర్తి కావని కర్నాటక ఇరిగేషన్ మంత్రి పాటిల్ అభిప్రాయ పడ్డారు. ఈ అంశంపై మూడు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, ఇరిగేషన్ కార్యదర్శులతో త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ చొరవ చూపాలని కర్నాటక చేసిన విజ్ఞప్తికి మంత్రి హరీశ్‌రావు అంగీకరించారు. ఏపీ ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో బుధవారమే తాను మాట్లాడానని, ఇరు రాష్ట్రాలు ఉమ్మడి ఇండెంట్ ను తుంగభద్ర బోర్డుకు పంపించడానికి అంగీకారం కుదిరిందన్నారు. త్రైపాక్షిక సమావేశం కోసం కూడా తాను దేవినేనితో మాట్లాడతానని హరీశ్ తెలిపినారు. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల నీటిపారుదల మంత్రులతో ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కర్నాటక ఎమ్మెల్యేలులు శివరాజ్ తంగిడి, అంపుల గౌడ, ప్రతాప్ గౌడ, అంపయ్య నాయక్, కేసీ కొండయ్య, బోస్ రాజ్, టీఎస్ పభుత్వ స్పెషల్ సీఎస్ జోషి, కర్నాటక ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాకేశ్ సింగ్ , డిప్యూటీ సెక్రెటరీ అనిల్ కుమార్, కర్నాటక జలవరుల విభాగం ఎండీ మల్లిఖార్జున గూంగే తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో టీఎస్‌పీఎస్సీ పాలకమండలి భేటీ

ఉద్యోగ నియామకాలకు చేపట్టిన చర్యలపై వివరణ

- వార్షిక నివేదిక అందజేత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పాలకమండలి గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, కార్యదర్శి ఎ వాణీప్రసాద్, సభ్యులు సి విఠల్, బి చంద్రావతి, మతీనుద్దీన్‌ఖాద్రీ, డి కృష్ణారెడ్డి, కె రామ్మోహన్‌రెడ్డి, మంగరి రాజేందర్, సీహెచ్ విద్యాసాగర్‌రావు, చింత సాయిలు, బి మన్మథరెడ్డి తదితరులున్నారు. మూడేండ్ల కాలంలో ఉద్యోగ నియామకాలకు చేపట్టిన చర్యలపై గవర్నర్‌కు టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి వివరించారు. 2017లో ఉద్యోగ ప్రకటనలు, నియామకాలు, ఖాళీల భర్తీకి సంబంధించిన వార్షిక నివేదికను అందించినట్టు సమాచారం. వివిధ గురుకులాల్లో 7,306 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌తోపాటు పాఠశాలల్లో 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్ ఈ ఏడాదిలో వెలువడడం ఓ ముందడుగు అని వివరించినట్టు తెలిసింది. గ్రూప్-1 ఫలితాలు ప్రకటించి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని చెప్పినట్టు సమాచారం. ఇక గ్రూప్-2కు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, కోర్టు పరిధిలో ఉన్నందున ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహించలేదని వివరించినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాలు రాగానే ఇంటర్వ్యూలు నిర్వహించి గ్రూప్-2 ఫలితాలు వెల్లడిస్తామని చెప్పినట్టు సమాచారం. ఇక టీఎస్‌పీఎస్సీ ఏర్పడిన మూడేండ్ల కాలంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి 76 నోటిఫికేషన్ల ద్వారా 29,757 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు 5,932 ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. 165 రాతపరీక్షలకు 28 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 20 లక్షల మంది హాజరయ్యారు. 13,865 ఖాళీల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. 8,657 ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతున్నది. ఆధునిక ఐటీ కేంద్రం ఏర్పాటు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం నెలకొల్పడం వంటి చర్యలు చేపడుతున్నట్టు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. సమర్థవంతంగా, వేగవంతంగా, పారదర్శకంగా ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టాలని గవర్నర్ సూచించినట్టు తెలిసింది.


రక్ష
నవతెలంగాణ

ఏక మూత్ర పిండం.. అనర్థదాయకం

మానవ దేహంలో రెండు కిడ్నీలు ఉంటాయనేది సర్వసాధారణ విషయం. అయితే... ఒక కిడ్నీతో పుట్టే వారు కూడా ఉంటారని మీకు తెలుసా? అవును.. సింగిల్ కిడ్నీ పర్సన్స్ కూడా ఉంటారు. ఇది అరుదైన విషయం. చాలామందికి దీనిపై అవగాహన ఉండకపోవచ్చు. తాము ఏక మూత్రపిండంతో కాలం వెళ్లదీస్తున్నామనేది చాలా మందికి తెలియకపోవచ్చు. తమ బిడ్డ ఈ లక్షణంతో జన్మించాడనేది తల్లిదండ్రులు తెలుసుకోలేక పోవచ్చు. ఏదేమైనా సింగిల్ కిడ్నీ వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

ఒక వ్యక్తి ఒక కిడ్నీ మాత్రమే కలిగి ఉన్నా... శరీరంలో ఒక కిడ్నీ మాత్రమే పనిచేస్తున్నా దానిని వైద్య పరిభాషలో 'సాలిటరీ కిడ్నీ' అంటారు. అలాంటి పరిస్థితి కలిగిన వ్యక్తిని 'సింగిల్ కిడ్నీ స్టేటస్' అనంటారు. సగటున 400 ప్రత్యక్ష జననాల్లో ఒకరు ఏక మూత్ర పిండంతో జన్మించొచ్చు. లేదా ఆ బిడ్డకు రెండు కిడ్నీలు ఉన్నప్పటికీ అందులో ఒకటి మాత్రమే పనిచేయొచ్చు. లేదా పుట్టిన తర్వాత ఇంకొక కిడ్నీ వ్యాధి బారిన పడి పనిచేయకపోవచ్చు. ఇదిలాగుండగా కిడ్నీ దానం చేసిన వ్యక్తులు కూడా 'సాలిటరీ కిడ్నీ' కలిగి ఉంటారు. అలాంటి వారు సాధారణ, ఆరోగ్యకర జీవితాన్నే గడుపుతారు. ఇక్కడ రెండు కిడ్నీల పనిని ఒక కిడ్నీ మాత్రమే చేస్తుంది.

తాము సింగిల్ కిడ్నీతో జన్మించామనే విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. తమకు పుట్టిన బిడ్డకు ఇలాంటి లోపం ఉందనే విషయం తెలియరాకపోవచ్చు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా మాత్రమే దీనిని గుర్తించే అవకాశముంది. పుట్టుకతో ఒక కిడ్నీ మాత్రమే కలిగి ఉన్న వారు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. సాలిటరీ కిడ్నీ కారణంగా అధిక రక్తపోటు, మూత్రం ద్వారా శరీరంలోని ప్రొటీన్ బయటకు వెళ్లిపోవడం, వడబోత సామర్థ్యం తగ్గడం లాంటి దీర్ఘకాలిక రుగ్మతలు ఏర్పడొచ్చు. ఈ పరిస్థితులు నియంత్రణలో ఉన్నంత వరకు శరీరంపై ఎలాంటి దుష్ప్రభావం చూపించదు. అయినప్పటికీ దీనిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. పుట్టిన బిడ్డకు ఒక కిడ్నీ మాత్రమే ఉందని నిర్ధారణైతే మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎదుగుతున్న ఆ కిడ్నీ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన పర్యవేక్షణ అవసరం. ఇలాంటి వారి జీవన శైలిలో మార్పులు తీసుకురావడం తప్పనిసరి.



తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు

- ✧ సింగిల్ కిడ్నీ కలిగి ఉన్న బిడ్డల విషయంలో పలు ముందు జాగ్రత్తలు పాటించాలి. ఎలాంటి కారణం లేకుండా జ్వరం వస్తే యూరిన్ కల్చర్ సెన్సిటివిటి పరీక్ష చేయించాలి. ఫలితం పాజిటివ్‌గా వస్తే దానికి తగిన చికిత్స చేయించాలి.
- ✧ యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ ఏర్పడటానికి కారణాన్ని ఎంసీయూజీ, డీఎంఎస్‌ఏ స్కాన్ల ద్వారా నిర్ధారించుకుని తగిన వైద్యం చేయించాలి.
- ✧ సింగిల్ కిడ్నీతో జన్మించిన బిడ్డకు రెండేండ్ల వయసు వచ్చినప్పటి నుంచి తనంతట తానే టాయిలెట్‌కు వెళ్లడం నేర్పించాలి. ప్రతి రెండు గంటలకోసారి మూత్రానికి వెళ్లేలా ప్రోత్సాహించాలి. వెనువెంటనే మూత్రం చేసే అలవాటు మాన్పించాలి.
- ✧ పాఠశాలలోని టాయిలెట్ పరిశుభ్రంగా లేకపోయినా మూత్రవిసర్జన చేయాల్సిందేనని పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. అపరిశుభ్రమైన టాయిలెట్‌ను ఉపయోగించడం ద్వారా యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ ఏర్పడదు. కానీ.. మూత్రాన్ని అలాగే బిగపట్టడం వల్ల ఇన్‌ఫెక్షన్ కలుగుతుంది.
- ✧ పిల్లలు ఉదయాన్నే సులభంగా, సౌకర్యంగా మూత్రవిసర్జన చేసేలా తగిన శిక్షణ ఇవ్వాలి. ఇందుకు వారి ఆహారం, అలవాట్లలో తగిన మార్పులు చేయాలి. నిండిపోయిన పేగుల వల్ల యూరినరీ బ్లాడర్‌పై ఒత్తిడి కలిగి ఇరిటేషన్, మూత్రం నిలిచిపోవడం వంటి ఇతర సమస్యలు ఏర్పడొచ్చు.

ఆహారం

పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన డైరీ ఉత్పత్తుల వంటి ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి. తక్కువ ఉప్పు, కొవ్వు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ ఉప్పును తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో అధిక రక్తపోటు బారినపడే ప్రమాదం ఉంది. తద్వారా కిడ్నీకి నష్టం జరగొచ్చు. మాంసం, కోడి గుడ్డులోని పచ్చ సొనలో కొలెస్ట్రాల్, ప్రొటీన్ అధిక మోతాదులో ఉంటాయి కాబట్టి వాటిని తీసుకోవడం తగ్గించాలి. చేపలు, చికెన్ తక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు.

దైనందిన చర్య

సింగిల్ కిడ్నీ కలిగి ఉన్న పిల్లలు తమ దైనిందిన కార్యకలాపాలను మామూలుగానే కొనసాగించొచ్చు. సాకర్, బాస్కెట్‌బాల్, హాకీ వంటి కఠిన ఆటలకు మాత్రం దూరంగా ఉండాలి. రెండు కిడ్నీల పనిచేసే ఈ ఒక్క కిడ్నీ పరిమాణంలో పెద్దదిగా ఉంటుంది. దీనినే కాంపెన్సెటరి హైపర్‌ట్రోపి అంటారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కిడ్నీ సులభంగా గాయపడే అవకాశం ఉంది.

జాగ్రత్తలు!

ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా డాక్టర్ వద్దకు వెళ్లినప్పుడు సాలిటరీ కిడ్నీ స్టేటస్ గురించి తెలియజేయడం తప్పనిసరి. కిడ్నీకి అపాయం కలిగించే మందులు కొన్ని ఉంటాయి. పరిస్థితిని ముందస్తుగానే డాక్టర్‌కు తెలిపితే వాటిని సిఫార్సు చేయకుండా జాగ్రత్త పడతారు. సింగిల్ కిడ్నీ గల వారు నిమెసులైడ్, మెఫానమిక్ యాసిడ్, ఇబూప్రూఫెన్ వంటి పెయిన్ కిల్లర్స్ వాడొద్దు. వాటి స్థానంలో 'పారాసిటమాల్' తీసుకోవాలి.

వైద్య పరీక్షలు

సాధారణ వైద్య పరీక్షలతోపాటు అధిక రక్తపోటు, యూరిన్‌లో ప్రొటీన్ వంటి టెస్టులను నెల నుంచి ఏడాది పాటు పర్యవేక్షించాలి. ఏదైనా సమస్యను ముందస్తుగానే గుర్తిస్తే మొత్తం మూత్రపిండం పనితీరుకు సంబంధించిన పరీక్ష తప్పకుండా చేయించుకోవాలి.

- డాక్టర్ శ్వేతా ప్రియదర్శిని,
పిడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్





వెయిట్ పెరుగుతున్నావా? అయితే..
'లైట్' తీస్కో!

సమతులాహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రావనేది అందరికీ అవగాహన ఉన్న విషయమే. బరువు ~ ండడానికి, స్థూలకాయం రావడానికి కూడా ఇదే కారణమని ఇప్పటికే అనేక అధ్యయానలు తేల్చిచెప్పాయి. బరువు తగ్గడానికి సరైన ఆహారాన్ని ఎంచుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, ఎక్కువగా నీళ్లు తాగడం దోహదపడతాయని వెల్లడిస్తున్నాయి. ఇవే కాదు.. బరువు తగ్గించుకోవడానికి ఆహార నియమాలు చాలానే ఉన్నాయి. వాటిలో తక్కువ కాలరీల చిరుతిళ్లు తీసుకోవడం ఒకటి. ఆహార ప్రణాళికను కఠినతరం చేసుకోకుండా బరువు తగ్గడానికి ఇదే సరైన మార్గమని సూచిస్తున్నారు వైద్య శాస్త్ర పరిశోధకులు. స్థూలకాయం నుంచి రక్షణ పొందేందుకు తేలికైన ఆహారం (లైట్‌ఫుడ్) ఎంతో మేలని అంటున్నారు.

క్యాలరీలు తక్కువ

ఫాస్ట్ ఫుడ్లను ఇష్టపడే వారిని బరువు పెరగకుండా కాపాడే మరో చిరుతిండి కరకరలాడే బ్రెడ్. ఇది ప్రధానంగా తృణధాన్యాలతో తయారవుతుంది. అనేక రుచులు, రకాల్లో దొరుకుతుంది. మీరు బరువు తగ్గే ఆహార ప్రణాళిక పాటిస్తుంటే ఇది మంచి పోషకాలిచ్చే చిరుతిండి. కరకరలాడే బ్రెడ్ ఒక ముక్క 32 కాలరీలను ఇస్తుంది, 0.2 గ్రాముల కొవ్వును కలిగి ఉంటుంది. శరీరానికి మేలు చేసి బరువు తగ్గడంలో ఉపకరించే ఈ చిరుతిండిలో ధాన్యం, పీచు పదార్థం ఉంటుంది.



ఆరోగ్య రక్ష

విటమిన్లు, యాంటీ–ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఆలివ్‌లలో ఒస్టియోపో రాసిస్, కాన్సర్, కీళ్ల నొప్పులు లాంటి వ్యాధులతో పోరాడే సామర్థ్యం ఉంటుంది. ఆలివ్‌లను నిమ్మరసంలో ముంచి, మూలికలు, సుగంధ ద్రవ్యాలతో వేయించి లేదా సహజ రూపంలోనో తినొచ్చు. ఒక ఔన్సు పచ్చ ఆలివ్‌లలో 41 కాలరీల శక్తి, 5 గ్రాముల కన్నా తక్కువ కొవ్వు ఉండగా, ఒక ఔన్సు నల్లటి ఆలివ్‌లలో 47కాలరీలు, 3.8 గ్రాముల కొవ్వు ఉంటాయి.





సాటిలేనివి..

క్యారెట్లు, తోటకూర, దోసకాయ లాంటి కూరగాయలు వాడడం అధిక బరువు తగ్గించుకోవడానికి సులభమైన మార్గం. హమ్మస్ లాంటి డిప్‌లతో మీరు ఇలాంటి కూరగాయలు తినొచ్చు. అవోకాడో, ఆరిచోక్ డిప్‌లు కూడా మీ ఆహార పట్టికలో చేర్చుకోదగ్గ చిరుతిళ్లు. వీటిలో కాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి.

బెస్ట్ ఫుడ్

బరువు తగ్గాలనుకున్నప్పుడు మీరు నిల్వ ఉంచుకోదగ్గ చిరుతిండి పాప్‌కార్న్. అయితే.. సినిమా హాళ్లు, సూపర్ మార్కెట్లలో దొరికే దానిలా ఇందులో వెన్న, చక్కర, ఉప్పు లాంటివి లేకుండా చూసుకోవాలి. పాప్ కార్న్ తేలిగ్గా ఉండే పదార్థం. ఇందులో పీచు ఎక్కువ ఉంటుంది. ఒక కప్పు పాప్ కార్న్‌లో 31 కాలరీలు మాత్రమే ఉంటాయి. అర గ్రాము మాత్రమే కొవ్వు పదార్థం ఉంటుంది. గాలి ద్వారా తయారు చేసే పాప్ కార్న్‌లో కొవ్వు ఉండదు. ఇవి బరువు తగ్గడానికి ఎంతో దోహదం చేస్తాయి. వెన్న, తీపి, ఉప్పటి పాప్ కార్న్‌లకు మాత్రం దూరంగా ఉండాలి.



కొన్ని తీసుకున్నా..

గుప్పెడు ద్రాక్షలు, కాసిన్ని స్ట్రా బెర్రీలు ఆకలి తీర్చడంలో బాగా ఉపయోగ పడతాయి. ఇవే కావు.. పుచ్చకాయ, యాపిల్, బెర్రీలు, బత్తాయి, అత్తి పండ్లులాంటివి కూడా బరువు తగ్గడానికి ఉపయోగపడతాయి.



పోషక విలువలు పుష్కలం



కొవ్వు లేని లేదా తక్కువ కొవ్వుండే పెరుగు తినడం కూడా ఆకలిని తగ్గించడానికి ఆరోగ్యకరమైన మార్గమే. పెరుగులో ఇతర పోషక విలువలు కూడా ఉంటాయి. ఇందులో పుష్కలంగా కాల్షియం, మాంసకృత్తులు, పొటాషియం ఉంటాయి. ఇవి మంచి సూక్ష్మ క్రిములను ఉత్పత్తి చేసి జీర్ణ సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటాయి. బెర్రీలు, గ్రనోలా లాంటి వాటితో కూడా మీగడ వాడొచ్చు.

కప్పు తీసుకున్నా చాలు



ఒక కప్పు ఓట్ మీల్ ని పాలల్లో కానీ మరే రూపంలో కానీ తీసుకొన్నా ఫలితాలుంటాయి. ఓట్ మీల్ లోని పీచు... ఇతర కార్బొహైడ్రేట్ల వల్ల శరీరానికి నూతనోత్తేజం లభిస్తుంది. దీనిలోని పొటాషియం, పాస్ఫరస్ వంటి ఖనిజ లవణాలు మీరు ఉత్సాహంగా ఉండటానికి బాగా సహాయపడుతుంది. కొత్త ఆలోచనలు వచ్చేలా ఉత్తేజపరుస్తుంది. అధిక కొవ్వు సమస్య కూడా ఉండదు. అన్నిటికంటే గొప్ప ప్రయోజనం అంటే దానిని క్షణాలలో తయారు చేయొచ్చు. పనిలోకి తొందరగా వెళ్లేవారు మైక్రోవేవ్‌లో ఓట్ మీల్ తయారు చేసి రెడీగా తినేయొచ్చు.

❊❊

గర్భస్రావ మాత్రలతో జాగ్రత్త!

గర్భస్రావ మందులు సాధారణంగా మెడికల్ షాపుల్లో దొరుకుతాయి. ప్రిస్క్రిప్షన్ ఉన్నా లేకున్నా వీటిని అమ్ముతుంటారు. డాక్టరును సంప్రదించకుండా ఇలాంటి మందులు వేసుకుంటే కొన్నిసార్లు ప్రమాదాలకు దారితీయొచ్చు. ఈ మాత్రల వల్ల ఇతర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావచ్చు. అధిక రక్తస్రావం, తలనొప్పి, వికారం, డయేరియా, కడుపు తిమ్మిరి, వాంతులు లాంటి దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ మాత్రలు వేసుకునే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

- ✠ ఈ గర్భస్రావం తేలికగా, సునాయాసంగా జరిగేలా చేస్తాయి. అంతేకాదు... కొన్నిసార్లు ఈ గర్భ స్రావం వికటించే అవకాశాలూ ఉన్నాయి.
- ✠ ఈ మాత్రలు చాలా తేలిగా మార్కెట్లో అందుబాటులో దొరికినా డాక్టరును సంప్రదించనిదే వాడటం మంచిది కాదు.



- ✠ మీకు ఏ మాత్రలు ఇస్తే పనిచేస్తాయో డాక్టరుకు మాత్రమే తెలుస్తుంది. కాబట్టి డాక్టరును సంప్రదించడం తప్పనిసరి.
- ✠ ఆస్తమా, డయాబెటిస్, అనేమియా తదితర వ్యాధులు ఉన్న వారు ఈ మాత్రలు వాడరాదు.
- ✠ హెచ్ఐవీ ఉన్నవారు అస్సలు వాడరాదు.
- ✠ చాలావరకు గర్భ స్రావ మాత్రల వల్ల ఇబ్బంది లేదు. అయితే.. ఈ మాత్రల వాడకం వల్ల కొన్నిసార్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి వీటిపై ఆడవారికి ముందుగానే అవగాహన ఉండటం అవసరం.
- ✠ ఒక్కోసారి ఈ ప్రక్రియ వికటిస్తే మీ గర్భస్రావం సగంలోనే ఆగివచ్చు. కడుపులోనే మిగిలిపోయి ఇన్‌ఫెక్షన్స్‌కు దారి తీయొచ్చు.
- ✠ గర్భస్రావం సమయంలో కొన్నిసార్లు తీవ్ర నొప్పులు వచ్చే అవకాశం ఉంది. ఇది తగ్గేందుకు డాక్టరును సంప్రదించడం తప్పనిసరి.
- ✠ కొన్నిసార్లు ఫాలోపియన్ ట్యూబ్ ప్రమాదానికి గురువుతుంది. దీనివల్ల రాబోయే కాలంలో పుట్టబోయే బిడ్డపై ఈ ప్రభావం ఉంటుంది.
- ✠ కాబట్టి గర్భస్రావం చేయించుకోవాలంటే డాక్టరును సంప్రదించడం కన్నా ఉత్తమ మార్గం మరేదీ లేదు.

'అనొరెక్సియా నెర్వోసా' అంటే?

మనిషికి ఆహారం ఎంతో ముఖ్యం. దీన్ని సక్రమంగా తీసుకుంటేనే మనుగడ. లేదంటే అనారోగ్యాన్ని కొనితెచ్చున్నట్టే. అయితే... మనుషుల ప్రవర్తనల్లాగే వారి ఆహార విషయంలోనూ వైవిధ్యం ఉంటుంది. కొంతమంది ఎక్కువగా భుజించొచ్చు. మరికొందరు తక్కువగా తినొచ్చు. కొంతమంది త్వరగా స్థూలకాయులు కావచ్చు. మరికొందరికి ఎంత తిన్నా స్థూలకాయం వారి దరిదాపులకు రాకపోవచ్చు.

కొంతమంది సన్నగా ఉండాలనే భావనతో శరీర అవసరాలకు కూడా సరిపోని స్థాయిలో అతి తక్కువ ఆహా రాన్ని తీసుకుంటారు. ఇలాంటి వారికి వైద్య సహాయం అవసరం కావచ్చు. ఇలాంటి వారు 'అనొరెక్సియా నెర్వోసా' అనే మానసిక వ్యాధితో బాధపడుతున్న వారై ఉండటమే ఇందుకు కారణం. ఇది ఎక్కువగా మహిళల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా యువతలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. అనొరెక్సియా నెర్వోసా బారిన పడ్డ వారి మనోస్థితి విలక్షణంగా ఉంటుంది. తమకు స్థూలకాయం వస్తుందనే భయం వీరిని వెంటాడుతూ ఉంటుంది. దీంతో అతి తక్కువ మోతాదులో ఆహారాన్ని తీసుకుంటారు. స్థాయిని మించి వ్యాయామం చేస్తుంటారు. అలాగే ఈ సమస్యకు గురైన మహిళలు రుతుక్రమంలో లోపాన్ని ఎదుర్కొంటారు.

అనొరెక్సియా నెర్వోసా అనే పరిస్థితి యవ్వనంలోకి అడుగుపెట్టిన కొన్నాళ్లకు కనిపిస్తుంది. ఇది సాధారణంగా ఉన్నతాదాయ వర్గాల్లో ఎక్కువగా ఉంటుంది. అమ్మాయిల్లో డైటింగ్ అనేది సర్వసాధారణంగా చూస్తుంటాం. కొంతమంది అమ్మాయిలు త్వరితగతిన బరువు కోల్పోవాలనే ఉద్దేశంతో ఆహారాన్ని తీసుకోవడం మానేస్తారు.



తెలుసుకుందాం..

తమ వయసు, ఎత్తులతో పోల్చినప్పుడు ఉండాల్సిన స్థాయికంటే తక్కువ బరువు ఉన్నప్పటికీ కొంతమంది అమ్మాయిలు డైటింగ్ చేయడం, తీవ్రస్థాయిలో వ్యాయామం చేయడం చేస్తుంటారు. లేదా డైటింగ్‌తోపాటు బరువు తగ్గడానికి మందులు వేసుకుంటూ ఉంటారు. వీరిలో ఆహారం పట్ల స్థిరమైన అవాంఛిత ఆలోచనలు (అబ్సెషన్స్) ఉంటాయి. ఇలాంటి వారు ఏదైనా తిన్న తర్వాత బరువు పెరగకూడదనే ఆలోచనతో ఆహారాన్ని వాంతి చేసుకోవడానికి కూడా వెనుకాడరు.

దుష్ఫలితాలు

- ⬂ ఆహారం తీసుకోకపోవడం వల్ల కుద్బాధకు గురవుతారు. ఫలితంగా అనేక శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయి.
- ⬂ వ్యాకులతకు గురవుతారు. ఏకాగ్రత దెబ్బ తింటుంది. నిద్ర సరిగా పట్టదు.
- ⬂ శరీరంలో పెళుసైన ఎముకలు విరిగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. శారీరక బలహీనతకు లోనవుతారు.
- ⬂ వాంతుల కారణంగా మూర్ఛ వ్యాధికి గురికావచ్చు. మూత్రపిండాలు దెబ్బ తినొచ్చు. గుండె కొట్టుకోవడంలో లోపాలు సంభవించొచ్చు.
- ⬂ హార్మోన్లలో అసమతుల్యతలు సంభవించి రుతుక్రమంలో మార్పులు రావచ్చు. రుతుక్రమం పూర్తిగా ఆగిపోయే అవకాశాలున్నాయి.

మరేం చేయాలి?

ఈ సమస్య తక్కువ స్థాయిలో ఉన్న వారికి ప్రత్యేక చికిత్స అవసరమవుతుంది. అమ్మాయిలు కొంత బరువు తగ్గిన తర్వాత సరైన పద్ధతిలో సలహాలివ్వడం ద్వారా వారిలో ఉండే అబ్సెషన్‌ని తొలగించొచ్చు.

వయసు, ఎత్తులకు తగిన బరువు ఉన్నప్పటికీ అమ్మాయిల్లో బరువు తగ్గాలనే ఆలోచన ఇంకా స్థిరంగా ఉండ డైటింగ్, వ్యాయామాలు చేస్తుంటే తప్పని సరిగా వారికి వైద్య సహాయం అవసరమవుతుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కూడా సంభవించొచ్చు. అనొరెక్సియాను తొలిదశలోనే గుర్తిస్తే పిల్లలను తిరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడానికి ఆస్కారం ఉంది.

'ముందుగానే అనుకునే పద్ధతేమీ ఉండదు. టెస్టు మ్యాచ్‌లో వీలైనన్ని బంతుల్ని వదిలిపెడతామనే దృక్పథంతో బరిలోకి దిగలేం. ఎక్కడ పరుగులు చేయాలనే ఆలోచన సైతం ఉండాలి. బౌలర్లు మంచి బంతులు సంధించినా, ఎదురుదాడితో మరింత బలంగా కనిపించాలి' - **మురళీ విజయ్**

'భారత్ చాలా మటుకు మ్యాచులు సొంతగడ్డపైనే ఆడింది. దక్షిణాఫ్రికాలో వారు ఎలా ఆడతారనేది ఆసక్తికరం. సఫారీలో వారికిది పూర్తిగా భిన్నమైన గేమ్!. తొలి టెస్టు పూర్తయ్యేవరకూ కోహ్లీసేన ప్రదర్శనపై ఎదురుచూస్తాం' - **వెర్నన్ ఫిలాండర్**



ఫ్రీడం ట్రోఫీతో కోహ్లి, డుప్లెసిస్

చెన్నైకి ధోని బెంగళూర్‌కు కోహ్లి


ధోని (15 కోట్లు)

- రోహిత్, పాండ్య, బుమ్రాలు ముంబయికే..
- డెవిడ్ వార్నర్, భువనేశ్వర్‌లు హైదరాబాద్‌కు..
- గంభీర్, గేల్‌లను వదిలేసిన కోల్‌కత, బెంగళూర్


కోహ్లి (17 కోట్లు)


రోహిత్ (15 కోట్లు)


గంభీర్


క్రిస్ గేల్

న్యూఢిల్లీ : అనుకున్నట్టే ఎక్కడి స్టార్స్ అక్కడే ఉండిపోయారు. కానీ కొందరు కీలక ఆటగాళ్లను వదులుకున్న ఫ్రాంచైజీలు ఆశ్చర్యానికి గురిచేశాయి. పరుగుల యంత్రం విరాట్ కోహ్లి అట్టిపెట్టుకున్న ఆటగాళ్లలో అత్యధికంగా రూ. 17 కోట్లు వార్షిక వేతనం అందుకోనున్నాడు. రెండేండ్ల విరామం తర్వాత ఎం.ఎస్ ధోని మళ్లీ చెన్నై గూటికి చేరగా అతడితో పాటే రవీంద్ర జడేజా, సురేశ్ రైనాలు వెళ్లగా, లోకల్ స్టార్ అశ్విన్ వేలంలోకి నెట్టబడ్డాడు. కోల్‌కతను రెండుసార్లు విజేతగా నిలిపిన గౌతం గంభీర్‌ను షారుఖ్ ఖాన్ ఫ్రాంచైజీ వదులుకోగా, టీ20 స్టార్ క్రిస్ గేల్‌ను బెంగళూర్ సైత పట్టించుకోలేదు. డెవిడ్ వార్నర్, భువనేశ్వర్ కుమార్‌లను సన్‌రైజర్స్ హైదరాబాద్ అట్టిపెట్టుకోగా..శిఖర్ ధావన్, యువరాజ్ సింగ్‌లు వేలంలోకి రానున్నారు. ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాలను అట్టిపెట్టుకున్నది. కోల్‌కత ఇద్దరు కరీబియన్ ఆటగాళ్లు సునీల్ నరైన్, ఆండ్రూ రస్సెల్‌లను మాత్రమే రిటెయిన్ చేసుకున్నది. రాజస్థాన్ రాయల్స్ తన పాత ఆటగాళ్లలో ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్ మాత్రమే అట్టిపెట్టుకున్నది. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ అక్షర్ పటేల్‌ను మనహా అందరినీ వదిలేసింది. ఐపీఎల్ 10 తర్వాత అన్ని ఫ్రాంచైజీలు పాత ఆటగాళ్లను వదులుకొని మళ్లీ వేలంలో తీసుకోవాలి. కానీ ఫ్రాంచైజీల వినతి మేరకు వేలానికి ముందు ముగ్గురు, వేలంలో ఇద్దరిని (రైట్ టు మ్యాచ్ కార్డ్) వెనక్కి తీసుకునేందుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అనుమతిచ్చింది. త్వరలో జరిగే మెగా వేలంలో ప్రస్తుతం అట్టిపెట్టుకోబడిన ఆటగాళ్లు మినహా అందరూ వేలంలోకి రానున్నారు.

ఈ స్టార్స్ పాత జట్లకే : ఎం.ఎస్ ధోని (రూ.15 కోట్లు), రైనా (11 కోట్లు), జడేజా (7 కోట్లు) (చెన్నై సూపర్ కింగ్స్). రోహిత్ శర్మ (15 కోట్లు), హార్దిక్ పాండ్య (11 కోట్లు), బుమ్రా (7 కోట్లు) (ముంబయి ఇండియన్స్). విరాట్ కోహ్లి (17 కోట్లు), ఏబీ డివిలియర్స్ (11 కోట్లు), సర్ఫరాజ్ ఖాన్ (1.7 కోట్లు) (రాయల్ చాలెంజర్స్ బెంగళూర్). సునీల్ నరైన్ (8.5 కోట్లు), ఆండ్రూ రస్సెల్ (7కోట్లు) (కోల్‌కత నైట్‌రైడర్స్). రిషబ్ పంత్ (8 కోట్లు), క్రిస్ మోరీస్ (7.1 కోట్లు), శ్రేయాష్ అయ్యర్ (7 కోట్లు) (ఢిల్లీ డేర్‌డెవిల్స్). అక్షర్ పటేల్ (6.75 కోట్లు) కింగ్స్ ఎలెవన్ పంజాబ్. డెవిడ్ వార్నర్ (12 కోట్లు), భువనేశ్వర్ కుమార్ (8.5 కోట్లు) (సన్‌రైజర్స్ హైదరాబాద్). స్టీవ్ స్మిత్ (12 కోట్లు, రాజస్థాన్ రాయల్స్).

ప్రాక్టీస్‌కు డుమ్మా

విదేశీ సీజన్‌లో ప్రతిష్టాత్మక తొలి టెస్టుకు టీమ్ ఇండియా గురువారం నాడు ప్రాక్టీస్‌కు డుమ్మా కొట్టింది. ఐచ్ఛిక ప్రాక్టీస్‌గా పేర్కొన్నా.. మ్యాచ్‌కు ముందు రోజు కావటంలో కీలక ఆటగాళ్లు హాజరవుతారని అనుకున్నారు. కానీ కెప్టెన్ కోహ్లి సహ జట్టు మొత్తం ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు. చీఫ్ కోచ్ రవిశాస్త్రి, సహాయక కోచ్ సంజయ్ బంగర్, చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌లు స్టేడియానికి వచ్చి పిచ్‌ను పరిశీలించారు. సిరీస్‌కు తొలి టెస్టుకు ముందు కెప్టెన్ మీడియాతో మాట్లాడాల్సి ఉన్నది. కానీ కోహ్లి ప్రెస్ మీట్‌కు సైతం డుమ్మా కొట్టాడు. గంటన్నర ఆలస్యం తర్వాత సంజయ్ బంగర్ మీడియా ముందుకొచ్చాడు. కోహ్లి రాకపోవటంపై సఫారీ మీడియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ధోని కెప్టెన్‌గా ఉన్న సమయంలో విదేశాల్లో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రానీయలేదని అక్కడి మీడియా గుర్తుచేసింది!.

సెమీస్‌లో హర్యానా

65వ సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్స్

హైదరాబాద్ : మంజీత్ చిల్లర్ ఆఖర్లో చేసిన మెరుపు రైడ్‌తో హర్యానా జట్టు సెమీస్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో 29-29 రాజస్థాన్‌తో సమవుజ్జీగా నిలిచిన హర్యానాకు ఆఖరు రైడ్‌లో రెండు పాయింట్లతో మంజీత్ విజయాన్ని అందించాడు. మిగతా క్వార్టర్స్ పోరుల్లో ఉత్తర్ ప్రదేశ్‌పై 44-36తో మహారాష్ట్ర గెలుపొందింది. ఉత్తరాఖండ్‌పై 56-31తో కర్నాటక విజయం సాధించింది. సర్వీసెస్‌కు రైల్వేస్ మధ్య జరిగిన కబడీ పోరులో 51-39తో నెగ్గిన సర్వీసెస్ సెమీస్‌లో చోటు దక్కించుకున్నది.

సైనా, కిదాంబి రాణించినా...

ముంబయి చేతిలో 1-4తో అవాధె ఓటమి

లక్నో : పీబీఎల్ పోరులో అవాధె వారియర్స్‌కు తొలి పరాజయం. సింగిల్స్ మ్యాచుల్లో సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు రాణించినా, ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న మిక్స్‌డ్ డబుల్స్ ఓటమి అవాధె గెలుపునకు గండి కొట్టింది. ముంబయి రాకెట్స్ చేతిలో అవాధె 1-4తో ఓడింది. ప్రత్యర్థిని ట్రంప్ మ్యాచ్‌లో ఓడించటంతో పాటు తమ ట్రంప్ మ్యాచ్‌లో వరుస సెట్లలో గెలుపొందిన ముంబయి రాకెట్స్ సీజన్‌లో రెండో గెలుపు సొంతం చేసుకున్నది. డబుల్స్ ఆటగాడు లీ యాంగ్‌డీ (కొరియా) ముంబయి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

- ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ ఢిల్లీ డేర్‌డెవిల్స్ చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు ఢిల్లీ ఫ్రాంచైజీ సీఈవో ప్రకటించారు. ఆటగాడిగా కోల్‌కతకు, కోచ్‌గా ముంబయికి ఐపీఎల్‌లో సేవలందించిన పాంటింగ్ 2018 సీజన్ నుంచి ఢిల్లీ హెడ్ కోచ్ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. రాహుల్ ద్రవిడ్ భారత్-ఏ జట్టుకు కోచ్‌గా ఉన్నందున, అతడు ఐపీఎల్‌లో కొనసాగేందుకు వీల్లేదు. దీంతో ఢిల్లీ పాంటింగ్‌ను కొత్త కోచ్‌గా ఎంచుకున్నది.

ఎన్ని రికార్డులు తిరగరాసినా, ఎన్ని విజయాలు సాధించినా, ఎన్ని టైటిళ్లు సొంతం చేసుకున్నా.. టీమ్ ఇండియాపై ఉన్న ఆ ముద్ర చెరగటం లేదు. గవాస్కర్, టెండూల్కర్, ద్రవిడ్ వంటి దిగ్గజాలు కొనసాగిన టీమ్ ఇండియాకూ ఇది తప్పలేదు. అదే.. ఆసియా ఆవల గర్జించలేని ఉపఖండపు పులి! కుర్రాళ్లతో కూడిన కోహ్లిసేన సైతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రజట్టుగా ఎదిగింది. అప్రతిహత విజయాలతో సరికొత్త చరిత్ర లిఖించింది. అయితేనేం, విదేశీ పరీక్షలో నెగ్గితే గానీ కోహ్లిసేననూ ఆ ముద్ర వీడనంటోంది!. దిగ్గజాలకు అందని, సక్సెస్‌ఫుల్ సారథులకు చిక్కని ఎన్నో ఘట్టాలను అలవోకగా అందుకోగలిగిన విరాట్ కోహ్లి.. ఇప్పుడూ అదే చేస్తానంటున్నాడు. విదేశీ పరీక్షలో పాసై చరిత్రను తిరగరాసేందుకు సిద్ధమయ్యాడు. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పిచ్‌లపై నెగ్గితేనే విజయం, అక్కడ శతకం సాధిస్తేనే సెంచరీ అనే సంప్రదాయం వరల్డ్ మీడియాలో ఇంకా కొనసాగుతోంది. ఇంట గెల్చిన కోహ్లిసేన.. రచ్చ గెలిచే తొలి ప్రయత్నంలో సఫారీ సవాల్ ముందున్నాడు. కేప్‌టౌన్ టెస్టుతో విదేశీ పరీక్షకు సిద్ధమవుతోన్న టీమ్ ఇండియా కొత్త చరిత్రకూ ఇక్కడే శ్రీకారం చుడుతుందేమో చూడాలి. దక్షిణాఫ్రికాతో భారత్ ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు నేటి నుంచే ఆరంభం.

చరిత్ర తిరగరాస్తారా?

- నేటి నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు
- కోహ్లిసేనకు ఇది కఠిన సవాల్

మధ్యాహ్నం 2 నుంచి సోనీ టెన్‌లో ప్రసారం


విరాట్ కోహ్లి

నవతెలంగాణ-కేప్‌టౌన్

అంచనాలు, వ్యూహాలు, సమీకరణాల నడుమ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న టీమ్ ఇండియా విదేశీ టెస్టు పరీక్ష రానే వచ్చింది. దక్షిణాఫ్రికాతో గాంధీ-మండేలా ఫ్రీడం సిరీస్‌లో తొలి టెస్టు నేటి నుంచి కేప్‌టౌన్ న్యూలాండ్స్ వేదికగా జరుగనున్నది. టెస్టుల్లో అజేయ రికార్డుకు తోడు వరల్డ్ నెం.1 హోదాలో టీమ్ ఇండియా సవాల్‌కు సై అంటోంది. కీలక ఆటగాళ్ల గాయాలు, సెలక్షన్ ఎంపికలో డైలామా పక్కనపెడితే స్వదేశంలో బ్లాక్‌బస్టర్ సిరీస్‌ను గొప్పగా ఆరంభించేందుకు సఫారీలు సైతం రెడీ అయ్యారు. పేస్, స్వింగ్, బౌన్స్‌కు తోడు స్పిన్‌కూ అనుకూలించే అవకాశాలున్న పిచ్‌పై తొలి టెస్టు ఆడనుండటం కోహ్లిసేనకు కచ్చితంగా కలిసొచ్చే అంశం!. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ మూడు టెస్టులు, ఆరు వన్డేలు, మూడు టీ20ఆడనున్నది. కేప్‌టౌన్‌లో తొలి టెస్టు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానున్నది.

ఏం చేస్తారో? : వార్మప్‌ను వద్దనుకొని రోజుకు రెండు సెషన్ల పాటు ప్రాక్టీస్‌లో కఠోర సాధన చేసిన టీమ్ ఇండియా.. మైదానంలో అసలు సవాల్ కోసం ఎదురుచూస్తోంది. జట్టులోని ఆటగాళ్లందరూ ఫామ్‌లో ఉండటం, వరుస విజయాల ఊపు సానుకూలాంశాలు. కానీ శ్రీలంకతో కోల్‌కత టెస్టు మ్యాచ్ అనుభవం.. కాస్త కలవరపాటుకు గురిచేస్తోంది. ఉదయం సెషన్లో భీకర సఫారీ పేసర్లను ఎదురొడ్డి మన బ్యాట్స్‌మెన్ నిలువగల్గితేనే కేప్‌టౌన్‌లో ఆశలు మిగిలేది. ఓపెనర్లు మురళీ విజయ్, శిఖర్ ధావన్‌లకు తోడు చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లిలపై ప్రధానంగా బ్యాటింగ్ బాధ్యత ఉంది. స్వదేశంలో విఫలమైన రహానె అచ్చొచ్చిన పరిస్థితుల్లో ఆడగలడనే దీమా జట్టు మనేజ్‌మెంట్ వ్యక్తపరుస్తోంది. నాయకుడిగా, బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లికి ఇది కఠిన పరీక్ష. బ్యాట్‌తో అతడు పరుగులు సాధిస్తే.. ఆ ఉత్సాహం జట్టును నడిపించటంలోనూ ప్రతిబింబించగలదు. పిచ్ పరిస్థితులను బట్టి అదనపు బ్యాట్స్‌మన్‌గా రోహిత్ శర్మను తీసుకోవాలా, ఆల్‌రౌండర్‌గా పాండ్యను ఆడించాలా అనే నిర్ణయం ఉండనున్నది. విదేశీ పిచ్‌లపై ఎలా ఉన్న సందేహం గతంలో మాదిరి అవసరం లేదు!. ఎందుకంటే ఇప్పుడు మన పేస్ సైన్యం సైతం ప్రత్యర్థిని వణికించగలదు. పేస్ ఫ్రెండ్లీ పిచ్‌లను కావాలని రూపకల్పన చేస్తే సఫారీలకూ భంగపాటు తప్పకపోవచ్చు. మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్‌లతో కూడిన వైవిధ్యమైన పేస్ బృందం కేప్‌టౌన్‌లో ఆడనున్నది. రవీంద్ర జడేజాకు జ్వరం కారణంగా ఎలాంటి సెలక్షన్ డైలామా లేకుండా స్పిన్ కోటాలో అశ్విన్ ఆడనున్నాడు.

సఫారీకీ సవాలే! : ఫ్రీడం సిరీస్ టీమ్ ఇండియాకే కాదు దక్షిణాఫ్రికాకూ సవాలే. ఏబీ డివిలియర్స్, డెల్ స్టెయిన్ సహ కెప్టెన్ డుప్లెసిస్ సైతం గాయం నుంచి కోలుకున్న జట్టులోకి వస్తున్నారు. వీరు ఫామ్ నిరూపించుకోవాల్సిన అవసరం ఉన్నది. దక్షిణాఫ్రికాను ఇతర జట్లతో భిన్నంగా ఉంచిన అంశం నాణ్యమైన ఆల్‌రౌండర్. బ్రయాన్ మెక్‌మిలన్, లాన్స్ క్లుసెనార్, జాక్వస్ కలిస్‌లు సఫారీని విశిష్ట జట్టుగా నిలిపారు. బ్యాట్‌తో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా, బంతితో స్పెషలిస్ట్ బౌలర్‌గా వీరు అదరగొట్టారు. కానీ ప్రస్తుత జట్టులో ఆ లక్షణం లోపించింది. నాణ్యమైన ఆల్‌రౌండర్ లేకుండానే సఫారీ బరిలోకి దిగబోతుంది. డీన్ ఎల్గార్, హషీమ్ ఆమ్లాలు టాప్ ఆర్డర్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్. క్వింటన్ డికాక్‌కు భారత్‌పై మంచి రికార్డుంది. మోరీస్, మోర్కెల్, ఫిలాండర్, రబాడాలతో కూడిన పేస్ బౌలర్లకు తిరుగులేదు. స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్ భారత్‌ను ఎదుర్కోనున్నాడు.

పిచ్ రిపోర్టు

న్యూలాండ్స్ పిచ్‌పై ఇంకా ఎటూ తేల్చలేని పరిస్థితి. పిచ్‌పై పచ్చిక కానవస్తోన్నా.. నిటారుగా పగుళ్లు సైతం ఉన్నాయి. దక్షిణాఫ్రికాలో స్పిన్‌కు అత్యధిక వికెట్లు కూలిన వేదిక ఇదే. దీంతో స్వింగ్, బౌన్స్‌తో పాటు స్పిన్ ప్రభావం ఉండే వీలున్నది. నీటి కొరత కారణంగా న్యూలాండ్స్ పిచ్ రూపకల్పనలో అవాంతరాలు ఏర్పడినట్టు వార్తలొచ్చాయి. అంతిమంగా ఇది స్పిన్‌కు అనుకూలించే పరిణామం. కానీ ఇప్పటికీ టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకోవటంపై సందిగ్ధత నెలకొన్నది. తొలి, నాల్గో రోజు ఇక్కడ వర్ష సూచనలు ఉన్నాయి. మేఘావృతమైన పరిస్థితుల్లో బ్యాట్స్‌మెన్‌కు ఇక్కడ పెను సవాల్.

తుది జట్లు (అంచనా)

భారత్ : మురళీ విజయ్, శిఖర్ ధావన్/కెఎల్ రాహుల్, చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, రోహిత్ శర్మ/హార్దిక్ పాండ్య, వృద్ధిమాన్ సాహా, అశ్విన్, భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి.

దక్షిణాఫ్రికా : డీన్ ఎల్గార్, మార్క్‌రం, హషీమ్ ఆమ్లా, డుప్లెసిస్, ఏడీ డివిలియర్స్, క్రిస్ మోరీస్, వెర్నన్ ఫిలాండర్, కగిసో రబాడా, స్టెయిన్/మోర్కెల్, కేశవ్ మహరాజ్.


జో రూట్ (83)

ఇంగ్లాండ్ 233/5

రూట్, మలన్ అర్ధ శతకాలు

యాషెస్ ఐదో టెస్టు

సిడ్నీ : కెప్టెన్ జో రూట్ (83), డావిడ్ మలన్ (55 బ్యాటింగ్) అర్ధ శతకాలతో రాణించటంతో యాషెస్ ఆఖరుపోరులో ఇంగ్లాండ్ దూసుకుపోతున్నది. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఐదు వికెట్లు కోల్పోయి 233 పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగిస్తోంది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌కు ఆదిలోనే చుక్కెదురు. ధనాధన్ ఆటతో మెరిసిన మార్క్ స్టోన్‌మన్ (24, 24 బంతుల్లో 4 ఫోర్లు) పదో ఓవర్లో పాట్ కమిన్స్ బంతికి టిమ్ పైనే చేతికి చిక్కాడు. డ్రింక్స్ విరామానంతరం ఇంగ్లాండ్ నాల్గు ఓవర్ల వ్యవధిలో రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ స్టోన్‌మన్‌ను పెవిలియన్ చేర్చి కమిన్స్ వన్‌డౌన్‌లో వచ్చిన జేమ్స్ విన్సే (25)ను సైతం బలిగొన్నాడు. 29వ ఓవర్లో కమిన్స్ వేసిన షార్ట్ బంతిని ఆడబోయిన విన్సేను.. టిమ్ పైనే చేతిలో క్యాచౌట్ చేశాడు. మరో ఓపెనర్ కుక్.. హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఎల్‌బిగా వెనుదిరిగాడు. దీంతో 95 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి ఇంగ్లాండ్ ఒత్తిడిలో పడింది. టాప్ ఆర్డర్ విఫలమైన వేళ ఇంగ్లాండ్ సారథి రూట్ బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. డావిడ్ మలన్ సహకారంతో స్కోరు బోర్డు కదిలించాడు.

రూట్ 82 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకోగా, ఐదు ఫోర్ల సాయంతో డావిడ్ మలన్ 146 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కు అందుకున్నాడు. శతకం దిశగా దూసుకెళ్తోన్న రూట్ జోరుకు మిచెల్ స్టార్క్ రెండో కొత్త బంతితో అడ్డుకట్ట వేశాడు. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ జానీ బెయిరిస్టో (5) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. ఆట ముగిసే సమయానికి డావిడ్ మలన్ అర్ధ శతకంతో అజేయంగా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లు చెరో రెండు వికెట్లు తీసుకోగా.. మిచెల్ స్టార్స్ ఒక వికెట్ పడగొట్టాడు. నేడు టెయిలెండర్ల సాయంతో మలన్ రాణిస్తే ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో మూడొందల పైచిలుకు స్కోరు చేసే అవకాశమున్నది.



సెమీస్‌లో షరపోవా

దియాస్‌పై 2-0తో విజయం

షెన్‌జెన్ ఓపెన్

షెన్‌జెన్ (చైనా) : మాజీ ప్రపంచ నెంబర్ వన్ మరియా షరపోవా సీజన్ తొలి టోర్నీలో రాణిస్తోంది. షెన్‌జెన్ ఓపెన్ సెమీస్ బరిలో అడుగు పెట్టింది. 15 నెలల డోప్ నిషేధానంతరం టెన్నిస్ రాకెట్ అందుకున్న షరపోవా పునరాగమనంలో క్వార్టర్స్‌లోనే తడబడింది. అయితే తాజాగా గురువారం జరిగిన క్వార్టర్స్ పోరులో కజకిస్థాన్ చిన్నది జరీనా దియాస్‌పై ఆద్యంతం ఆధిపత్యం చలాయించింది. 6-3, 6-3తో వరుస సెట్లలో నెగ్గింది. అన్ సీడెడ్‌గా బరిలోకి దిగిన రష్యా సుందరి ఫైనల్ పోరులో నిలిచేందుకు, ఆరో సీడ్ కటెరినా సినియకోవా (చెక్ రిపబ్లిక్)తో నేడు తలపడనున్నది. మరో సెమీస్ మ్యాచ్‌లో రొమేనియా అమ్మాయిలు టాప్ సీడ్ సిమోన హాలెప్, నాల్గో సీడ్ ఇరినా కామెలియా బెగులు అమీతుమీ తేల్చుకోనున్నారు.

ఆస్ట్రేలియా ఓపెన్‌కు ముర్రే దూరం



సిడ్నీ : మాజీ ప్రపంచ నెంబర్ వన్, ఆండీ ముర్రే పిరుదుల గాయం కారణంగా ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరం కానున్నాడు. గతేడాది వింబుల్డన్ తర్వాత గాయం కారణంగా మరే ఏటీపీ టోర్నీలోనూ పాల్గొనని ముర్రే, ఇంకా పూర్తిగా కోలుకోలేదు. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీ నుంచి వైదొలగిన ముర్రే సీజన్ తొలి గ్రాండ్ స్లామ్ బరిలో నిలవటానికి ఫిట్‌గా లేనని ఓ ప్రకటనలో తెలిపాడు. ఆసియా నెంబర్ వన్ నిషికోరి సైతం మణికట్టు కండర గాయం కారణంగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో పాల్గొనబోనని చెప్పాడు. ఆరుసార్లు ఆస్ట్రేలియా ఓపెన్ విజేత నొవాక్ జకోవిచ్ సైతం మోచేతి గాయంతో బాధపడుతున్నాడు. అతడు మెల్‌బోర్న్ బరిలో దిగటం సందేహమే. దిగ్గజ ఆటగాళ్లంతా గాయాలపాలై టోర్నీకి దూరమవుతుండటంతో నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.